
ఆంధ్రసచిత్రవారపత్రిక



24-10-75
60 పైసలు

శ్రీ విజయభట్ ప్రొడక్షన్సు

గుణవంతుడు

ఈస్ట్‌మన్ కలర్

దర్శకుడు — నిర్మాతలు

మర్తి సుబ్బారావు · యస్.యన్.భట్ - యస్.యస్.మూర్తి


సంగీతం: కె.వి.మహదేవన్ • మాటలు: సత్యానంద్


అన్నపూర్ణా ఫిలింస్





మేము మా రేడియోల కోసం మా టి వి కి ఉపయోగించే పురోగమించిన సాంకేతిక పరిజ్ఞానాన్నే సమకూరుస్తున్నాం





టెలిరాడ్ రేడియోలు—టెలిరాడ్ టివి, టివి సొంతదార్ల ఆదరాభిమానాలు ఎలా పొందిందో అలాగే టెలిరాడ్ రేడియోలు రేడియో సొంతదార్ల ఆదరాభిమానాలు పొందాయి. దానికి కారణం టెలివిజన్లలో టెలిరాడ్‌కు నాయకత్వం చేకూర్చిన సాంకేతిక పరిజ్ఞానము యీ రేడియోలకూ వినియోగించబడడమే. అందుకనే యీ సారి మీకు రేడియో కావలసివచ్చినప్పుడు, ఒకటి, రెండు, మూడు లేక నాలుగు బ్యాండ్ల టెలిరాడ్ రేడియోలలో దేనినైనాసరే ఎన్నుకోండి. అది ఎలా పని చేస్తుందో వినండి. మీ బడ్జెట్టు రు. 85/ కావచ్చు లేక రు. 1500 కావచ్చు. ఎంతైనాసరే, సాంకేతికంగా పురోగమించిన ఒక ఎలక్ట్రానిక్ అద్భుతాన్ని మీరు వింటున్నారనేది మాత్రం నిజం.


టెలిరాడ్ : సారాభాయ్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చి సెంటర్ వారి సాంకేతిక విజ్ఞానంతో కూడినది.

TELERAD

టెలిరాడ్–టివి. రేడియో. ట్రాన్సిస్టర్లు. స్టీరియో సిస్టమ్స్.

Shilpi TR 30a/75 tel

లోకం పోకడ — ధామన



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 – 1972)
శుక్రవారం : 24–10–'75
రాక్షసనామసం.ఆశ్వయుజమాసబ. చతుర్దశి
సంపుటము : 69 సంచిక : 7

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

★

సంవత్సర చందా – రు. 33-80
ఆరుమాసాల చందా – రు. 16-90
విడిప్రతి వెల 60 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520003.

విషయానుక్రమణిక

అట్టమీద బొమ్మ :
ధర్మేంద్ర
(ఫొటో : డి. సుశీల)

అట్టమీద బొమ్మ

నటి జయప్రద ముఖ చిత్రముతో వెలువడిన 19—9—1975 ఆంధ్ర సచిత్ర వార పత్రిక మమ్మల్నెంతో ఆకర్షించింది. గాజువేడ సీరియల్ ఇతి వృత్తం నేటి సమాజం దృష్ట్యా చాల వాస్తవికంగా ఉంది, రాగ వీచికలు సీరియల్ మమ్మల్నెంతో ఆకర్షించింది. పీడకల, అదృష్టం జారిపోదు, కథలు చాల బాగున్నాయి.

యం. సుధాకర్‌రెడ్డి, కే. మధుసూదన్‌రెడ్డి కృష్ణారెడ్డి, కే. సురారెడ్డి, జే. శ్రీరాములు, (సిరిపురం)

క థ లు

19—9—75 సంచికలోని 'మానస'గారి 'అదృష్టం జారిపోదు' కథ మా హృదయాలను కదిల్చివేసింది. బ్రతుకున్న మనుష్యులతోనేగాక మృతశరీరాలతో కూడ వ్యాపారంచేసే రామచంద్రరావు, రాధలవంటి మేకవన్నెపులులు ఉంటారని తెలియక మోసపోయిన అమాయకురాలుశారద హృదయావేదన కంటనీరు తెప్పించింది. రచయితకథను నడిపినతీరు చివరలో తిప్పిన మలుపు ప్రశంసనీయము.

పి. లక్ష్మీ రాజ్యం, పద్మావతి (జగ్గయ్యపేట)

* * *

26—9—75 మరియు 3—10—75 తేది పత్రికలలో ప్రచురింపబడ్డ "జీవనసంధ్య" కథ బాగుంది. కాని 26—9—75 పత్రికలో రమేష్, సురేష్‌కంటే ఒకగంట ముందు పుట్టినట్లు వ్రాశారు. 13—10—75 పత్రికలో రమేష్, సురేష్‌లు కవల పిల్లలుగా పుట్టినప్పుడు పొట్టకి పక్క భాగములో చర్మము కలిసిపోయి ఉండటమువలన డాక్టర్లు ఆపరేషన్‌చేసి విడదీశారని రచయిత్రిగారు వ్రాశారు. ఇటువంటి పొరపాట్లు రచయిత్రిగారు ముందు వ్రాయబోయేకథలలోచేయకుండాఉంటారనిఆశిస్తున్నాను.

డి. ఉదయకుమార్ (కాశీబుగ్గ)

* * *

భాగవతుల లలిత శర్మగారి రచన "ఒకరికొకరు వాళ్ళిద్దరు" కథ చాలా బావుంది. సుజాత చదువుకునే రోజుల్లో అహంభావంతో ప్రవర్తించింది. కాని...కాలప్రవాహానికి ఎదురీదలేక, విధి వైపరీత్యం అంగవైకల్యం ప్రాప్తించిందామెకు.ఆమె ఆశలకు ఆశయాలకు ఇది గొడ్డలి పెట్టువంటిది. అందుకే సుజాత చివరకు తన స్నేహితురాలితో అంది "పిచ్చి నోగమ్మత్తు చూశావా ? మనం భూమ్మీద పడకముందే దేముడు మన జీవితాలను ఎవరితో ముడిపెట్టివుంచాలో ముందే నిర్ణయించుకుంటాడు."

జీవన సంధ్య కథను మాంచి సస్పెన్స్‌లో ఆపివేశారు. "సీతకథ" చిన్నదైనా...ఎంతో బరువైన పాత్రలను సృష్టించారు.

నైనారు మురళి, (తిరుపతి)

ఉత్తరాలు

26—9—75 సంచికలో "జీవన సంధ్య' కథలో సీతమ్మ భర్త దగ్గరకు బరబరా కుర్చీ జరుపుకొని కూర్చునట్లు రచయితగారు వ్రాశారు కాని చిత్రములో క్రింద కూర్చునట్లు వేశారు. చిత్రము గీయుటలో శ్రద్ధతీసుకోవలయునని. మా మనవి.

కే.జి. ప్రదీప్‌కుమార్, నిర్మల్ (రాజమండ్రి)

* * *

స్త్రీలు సినిమాలుచూసి కథలు రాస్తున్నారంటే ఉడుక్కునేదాన్ని, 'జీవన సంధ్య' చదివాక నిజమే అనిపిస్తుంది. సినిమాలో డబుల్ యాక్షన్‌కు పనికివస్తుంది అని కాకాని కమలగారు ఆశపడ్డట్టున్నారు. ఎంత కవలలయినా, యెన్ని పోలికలున్నా, స్పర్శ జ్ఞానము అనేది ఒకటి ఉంటుందని గమనించాలి.

క్రాంతి (హైదరాబాద్)

* * *

"సీత" చాల బాగుంది.

"నమ్మూ నమ్మకపో" "విజ్ఞానం—వినోదం" ఉపయోగకరంగా, ఆసక్తిదాయకంగా ఉంది.

డి. కె. సుబ్బారావు (తిరుపతి)

సి ని మా

(3—10—75) ఈ వారం సంచిక, అబ్బ! చాలా బాగుంది. జయంతి ముఖచిత్రంలో, ఇద్దరు సినీకవులతో, గాయకునితో రచించిన గేయాలు బాగున్నాయి. సినిమా బాగుంది. ఎ. ఎన్. ఆర్. గారి శ్రీనివాస్ బేటీ బాగుంది. హీరోయిన్లను అలా ఎర్రి, పుర్రి అనడం నచ్చలేదు నాకు వాణిశ్రీకే పలుకుపడి తగ్గుతూందని, మరోకవైపు పైకి పొగడ్డం సముచితంగలేదు. ఆ నటికి కాంపిటీటర్ నేడు సమానంగా ఎవరూలేరు అనడం ఎ. ఎన్. ఆర్. ముదావహంగా అన్నారు.

బద్వేలి రమేష్ (అనంతపురం)

అట్టమీద బొమ్మ

తారల్లో నా అంత తళుక్కుపుందా ? అంటూ కళాభినేత్రి వాణిశ్రీ, నన్నుమించిన ఎవర్‌గ్రీన్ హీరో ఎవరు ? అంటూ నటరత్న రామారావు, ఛాలెంజి చేస్తున్నారు. పత్రిక పీక్లీ ముఖచిత్రాన 'ఎదురులేని మనిషి' చిత్రంలోని ఎదురులేని ఆనాయకీ నాయకులు.

ఇంత, అంత అనలేని ఎంతో అందమైన ఈ చిత్రాన్ని,మీ కందించిన పొటోగ్రాఫర్‌కి, మాకందించిన మీకు కోటి ధన్యవాదాలు.

సత్యశ్రీ, ఎస్. లక్ష్మీనారాయణ, సి. హెచ్. సీతారామయ్య, ఇ. లక్ష్మణమూర్తి, (కొత్తగూడెం)

* * *

నాగేశ్వరరావుగారు "నవరాత్రి"లో తొమ్మిది పాత్రలు పోషించారని బరంపురంనుంచి న్యాయపతి రమేష్‌బాబు నటి జయంతి ముఖచిత్రం (3—10—75) సంచికలో డబ్బా వాయించారు. కాని అంతకు ముందు "శివాజిగణేశన్" ఆపాత్రలను పోషించి, భేష్ అనిపించుకున్నారు, హిందీలో సంజీవ్ కుమార్ పోషించారు.

కె. వి. వెంకట కృష్ణప్ప (బెంగుళూరు)

* * *

శ్రీ కడారు నాగభూషణం ఉప్పుతిన్నవారు ఆయన్ని మర్చిపోయినా, సహృదయుడు, నిగర్వి మంచి మనసున్న మనిషి రాజబాబు ఈయన గొప్పతనాన్ని గుర్తించి తనపుట్టినరోజునాడు ఆయన్ని సన్మానం చెయ్యడం గర్వించతగ్గ విషయం. ఇంతమంచి కార్యాన్ని చేస్తున్న రాజబాబుని ఆ భగవంతుడే పచ్చగా చూడాలిగాక !

న్యాయపతి రమేష్‌బాబు (బరంపురం)

అవీ—ఇవీ—అన్నీ


3—10—75 సంచిక ఆంధ్రపత్రిక 'అవి ఇవీ అన్నీ' 'శీర్షికలో' ఐ. ఐ. టి.లో జరిగిన ఆంధ్ర సంఘం కార్యక్రమాల విశేషాల గూర్చి ప్రచురించిన వార్తలో కుమారి ఎస్. దమయంతి శ్రీ సి.నా. రే. లలిత గీతాలు పాడిందని ప్రచురించారు. కానీ ఆమె ఆ దినం పాడిన లలిత గీతాలన్నీ మా సోదరుడు 'సనారా' వ్రాసినవి.

శిలపరసెట్టి 'సంజీవి' (ఖర్గపూరు)

డాక్టర్ సలహాలు

"డాక్టరు సలహాలు" శీర్షికలో, రోగాలకు సంబంధించిన జవాబులు సమంజసంగా ఉండటం లేదు. రోగాల బాధను పడలేక ప్రశ్నలడుగుతున్నారు, కాబట్టి డాక్టరుగారు ఇంకా శ్రద్ధను వహించాలని మరీ మరీ ఆశిస్తున్నాను.

మహమ్మదు జహీరుఅహమదు, ఫాతిమా, కరీమా, సికిందర్, మాధవ్, (వనపర్తి.)


APH 38
గెలుపు
నాదే!

హాల్లో ఉన్న గోడ గడియారం వంక ఓసారి చూసి బద్ధకంగా కుర్చీలోనుండి లేచాను. కూర్చుని కూర్చుని విసుగొస్తోంది. దాదాపు ముప్పావుగంట క్రితం ప్యూన్‌కి ఓ స్లిప్ మీద నాపేరూ, వచ్చిన పనీ రాసిచ్చి, ప్రొప్రయిటర్ మాధవరావుగారి దర్శనం కోసం ఈ విశాలమైన హాల్లో ఓపిగ్గా పడిగాపులు కాస్తున్న నాకు ఇంతదాకా ఆయన దర్శనం కాకపోగా, నాకంటే వెనక వచ్చిన ఎందరో చనువుగా, హుందాగా అలాటి చీటీలేవీ రాసివ్వకుండానే చక చకా లోపలికి వెళ్లి గలగలా నవ్వుకుంటూ బయటికి తిరిగి వస్తున్నారు. నేనిచ్చిన స్లిప్ ఇంకా ప్యూన్ చేతిలోనే ఉంది. రాను రాను నా సహనం సన్నగిల్లుతోంది. 'పోనీ నేనూ సరాసరి లోపలికి వెళ్ళిపోతే...'అన్న ఆలోచన వచ్చినా ఆ పని చేయటానికి ధైర్యం చాలటంలేదు.

నా మనస్సులోని ఆలోచనలని చదివేసినట్లు ప్యూన్ జాలిగా నా వంక చూస్తూ, రహస్యం చెప్తున్నట్లు, "అళ్లందరూ గొప్ప గొప్పోళ్ళమ్మగారూ! ముందుగాల ఎల్లినారు సూడండి బుంగమీసాల ఆసామీ, ఆయన అదేదో మంతిరిగారి పరసనల్ సెక్రెటరీ అంట. ఆయనెనకాల పెరిలిన్



షర్ట్లేసుకుని పోయినాయన ఓ కంపెనీ జనరల్ మానేజరుగారు..." అంటూ లోపలికి వెళ్లిన ఒక్కో వ్యక్తి గురించీ చెప్పటం మొదలు పెట్టి, "గొప్పోళ్ళతో మాట్లాడేటప్పుడు లోపలికెళ్తేనే కస్సుమంటా రయ్యగారు." అంటూ ముగించాడు.

'ఏం గొప్పోళ్ళో కానీ నా ప్రాణాలు తీసేస్తున్నారు మధ్యన!' మనస్సులోనే వినుక్కుంటూ బద్ధకంగా చిటికెవేసి ఆవులించాను. ఈ సమయంలో చిన్నన్నయ్య పక్కనుంటేనా, "ఆడపిల్లవి ఎక్కడబడితే అక్కడ నోరు తెరిచి అలా ఆవులిస్తే చూసేవాళ్ళేమనుకుంటారు? ఆ మాత్రం బుద్ధుండక్కర్లా?" అంటూ కసిరేవాడే అక్కడికి నోరు తెరిచి నిర్భయంగా, నిస్సంకోచంగా ఆవులించటం మగాళ్ళకి మాత్రమే చెల్లినట్టు. అయినా నోరు తెరవకుండా ఆవులించడం ఎలాగో మరి! అదేం ఖర్మోగానీ వాడికీ, నాకూ ప్రతి విషయంలోనూ చుక్కెదురే.

'వాడితో నీకేమిటే అమ్మాయ్! ఆడపిల్లకి అందంతోపాటూ సహన సంపదుండాలి. రేపు చేసుకోబోయేవాళ్ళు ముఖ్యంగా చూసేదదే." అనేది అమ్మ నేను వాడితో వాదించినప్పుడల్లా వాడి తరఫున వకాల్తా పుచ్చుకున్నట్టు.

'ఏం? నా సహనానికేమయిందిప్పుడు?' విసురుగా అనేదాన్ని.

గెలుపు నాదే

"అలా కస్సు బస్సుమంటూ వుంటావుగానీ నీకేమే చాలా గుణవంతురాలివి." అనేవాడు వాసన్నయ్య నవ్వుతూ.

"అదేం కాదులేరా అన్నాయ్! దానికి చదువుకున్నానని గర్వం." వేణన్నయ్య ఉక్రోషంగా అనేవాడు. నా కంటే రెండేళ్ళు పెద్దవాడైనా ఇంకా బి. ఎ. రెండో సంవత్సరంలోనే ఉన్నానన్న అసూయతో అప్పుడప్పుడూ వాడలా ఎత్తిపొడవటం నాకు క్రొత్తేమీకాదు.

ఐదు నిమిషాలు గడిచాయి. ప్యూనుకి కూడా విసుగొచ్చినట్లుంది కాబోలు ఎటో వెళ్లాడు. మరోసారి బద్ధకంగా ఆవులించి ప్రొప్రయిటరుగారి గదివంక చూసాను.

ఆ గదికి తలుపులు పూర్తిగా లేవు. పైనా, క్రిందా రెండేసి అడుగుల చొప్పున ఖాళీగా వదిలేసి, మధ్య ఓ రెండడుగుల పొడవున్న నీలంరంగు గ్లాస్ గ్రెప్‌గల తలుపులున్నాయి. క్రింద ఖరీదైన తివాచీ, పైన గిరగిరా తిరుగుతున్న ఫానూ మాత్రమే బయటికి కనిపిస్తున్నా, ఆ గదిలో ఇంకేమేం ఉండి ఉంటాయో నేను సులభంగానే ఊహించగలిగాను. ఓ టేబిలూ, కూర్చునేందుకు మెత్తటి కుర్చీలూ, ఓ ప్రక్కగా వ్యాపార సంబంధమైన కాగితాలూ గ్రా భద్రపరుచుకునేందుకు బీర్వాలూ, టెలిఫోనూ వగైరా వస్తువులు ఉండవచ్చు ఆలోచిస్తూనే చూట్టూ చూసి, ఎవరూ లేకపోవటంతో కొద్దిగా వంగి క్రింద నుండి చూసాను. క్రింది నుండి కాళ్లనిబట్టి మనుష్యుల్ని లెక్కపెట్టాలని నా ఉద్దేశ్యం. ఆశ్చర్యం నాలుగే కాళ్ళు కనిపించాయి. అంటే ఇద్దరే మనుష్యులన్నమాట. ప్రొప్రయిటరు గారు కాక మరొకరు. నా ఆనందానికి అవధులు లేవు. 'హమ్మయ్య! ఇతను వెళ్లిపోతే ఇక నేను వెళ్లి నాన్నగారిచ్చిన లెటర్ మాధవరావుగారికి చూపించవచ్చు' అనుకుంటున్న దాన్నల్లా చటుక్కున లేచి నిల్చున్నాను. అప్పటికే ఒకతను చకచకా అంగలు వేస్తూ బయటికి వచ్చేస్తున్నాడు. పైనుండి అతని నున్నటి చెంపలు, క్రింద నుండి నల్లగా నిగనిగలాడుతున్న బూట్లు, కొద్దివరకూ పాంటూ మాత్రమే బయటికి కనిపిస్తున్నాయి.

ఒక్కసారి నా వంక చూసీ చూడనట్లుగా ఉదాసీనంగా చూసి దాదాపు బయటికి వచ్చేసిన అతను ఏమనుకున్నాడో ఏమో చటుక్కున వెనక్కి తిరిగి మళ్లీ లోపలికి వెళ్లాడు.

"అంతేనంటారా డాడీ? అదే మీ ఆఖరి నిర్ణయమా?" వెళ్లిన మరునిమిషానికే అతని గొంతు వినిపించింది. 'అంటే ఇతను మాధవరావుగారి సుపుత్రుడన్నమాట!' అనుకున్నాను. మాధవరావుగారు ఏం మాట్లాడకపోవడంతో మళ్లీ అతనే అన్నాడు. "ఈ ఒక్కసారికీ

నా మాట దక్కించండి డాడీ! ఈ ఉద్యోగం తప్పక ఇప్పిస్తానని మాలకి ప్రామిస్ చేశాను.''

ఉలిక్కిపడ్డాను. నా మనసదోలా అయిపోయింది. ఈ టెంపరరీ పోస్ట్‌కి కూడా రికమెండేషన్లేనా!

ఈసారి మాధవరావుగారి కంఠం మృదు గంభీరంగా వినిపించింది. ''చూడు రవీ! నన్నిబ్బందిలో పెట్టకు. ఇంతదాకా నువ్వు ఎంతమందిని రికమెండ్ చేసినా వద్దనలేదు. ఆఖరికి నువ్వెంతో మంచి పిల్లని పొగుడ్తూ ఉద్యోగం ఇప్పించేదాకా ఊరుకోని ఝాన్సీ అనే అమ్మాయి కంపెనీ డబ్బు తీసుకుని పారిపోయినా నిన్ను తప్పు పట్టలేదు. కానీ ఒకటి మాత్రం గుర్తుంచుకో. సిఫారసు చేసినా అర్హతగల వాళ్లనే చెయ్యాలి''

''కానీ 'మాలా', ఝాన్సీ లాంటిది కాదు డాడీ!''

''అని నీ కెలా తెలుసు? మనిషిని చూసి స్వభావం ఊహించటం అంత మంచిది కాదు రవీ! పోనీ అవన్నీ అవతలపెట్టి ఉద్యోగం ఇద్దామన్నా ఆ అమ్మాయికి మినిమమ్ క్వాలిఫికేషన్సైనా లేవే! ఈ పోస్ట్‌కి కనీసం గ్రాడ్యుయేట్ ఐనా అయివుండాలని నీకు తెలుసుగా!'' నచ్చచెప్తున్నట్లన్నారాయన.

''ఎంతలో అవుతుంది డాడీ! మాల సప్లిమెంటరీ పరీక్షలు నెలరోజుల్లో ఉన్నాయి. ఒక్క పార్టేగదా ఈసారి తప్పక పాసవుతుంది.'' పట్టుదల స్పష్టంగా కనిపిస్తోంది రవి కంఠంలో.

మాల! నాకు సుపరిచితమైన పేరు కొంపదీసి రవి రికమెండ్ చేసే ఈ మాల నా క్లాస్‌మేట్ మాల కాదు గదా! ఒక పార్టు పోయిందంటున్నాడు కూడా! ఆ పిల్ల అయినా అయి ఉండవచ్చు.

మాధవరావుగారి కంఠం హఠాత్తుగా తగ్గు స్వరంలో వినిపించింది. ''చూడు రవీ! ఇవన్నీ ఇంటిదగ్గర మాట్లాడుకోవచ్చు బయట ఎవరైనా మన మాటలు వింటే బాగుండదు వెళ్ళు.''

''బయటెవరూ లేరు కానీ నేను చెప్పిన విషయం కూడా ఆలోచించండి డాడీ! ఈ సారి మాల తప్పక పాసవుతుంది.'' అంటున్నాడు రవి. ఇందాక బయటికి వస్తూ నన్ను చూసి కూడా ఎవరూ లేరంటాడేం ఈ మహానుభావుడు! బహుశా అతని దృష్టిలో నేనంత లెక్కచేయదగ్గ దాన్ని కానేమో!

ఈ ఉద్యోగం తప్పక వస్తుందని ఎన్ని కలలు కన్నాను! ఇప్పుడు రవి మాటలు వింటూంటే నిరాశే ఎదురవుతుందని పిస్తోంది. అందుకే కాబోలు వాసన్నయ్య ''పిచ్చిపిల్లా! ఈ కాలంలో ప్రతి చిన్న ఉద్యోగానికి ఎంత కాంపిటీషనో తెలిస్తే, కనీసం ఊహించగలిగితే నువ్వీ ఉద్యోగం మీద ఇన్ని ఆశలు పెట్టుకోవు.'' అన్నాడు నా ఉత్సాహాన్ని చూసి జాలిపడుతున్నట్లు.

''పోదూ! ముందా వేడి నిట్టూర్పులు మానెయ్యాలి నువ్వు.'' అంటూ అప్పుడు కొట్టిపారేసిన నాకు అది వాడు ఎంత అనుభవంతో చెప్పాడో ఇప్పటికర్థమయింది. నిజమే! ఎమ్. ఎ. పాసయినవాడు ప్రైవేట్లు చెప్పి డబ్బు సంపాదిస్తున్నాడు ఉద్యోగం దొరక్క. అలాంటిది కేవలం గ్రాడ్యుయేట్‌ని నేనెంత? అసలీ పోస్టు ఒక్క ఆడవాళ్లకేగానీ లేకపోతే అన్నయ్యకూడా అప్లై చేసేవాడే. ఈ కంపెనీ ప్రొప్రయిటర్ తన ప్రాణస్నేహితుడనీ తనపేరు చెప్తే తప్పక సహాయం చేస్తాడనీ నాన్నగారు మరీ మరీ చెప్తే ఎంతో ఆశగా వచ్చాను. ఆలోచనల్లో మునిగి తేల్తున్న నేను మాధవరావుగారి కంఠం వినిపించటంతో తేరుకున్నాను.

''ఈసారి మాత్రం ఆ అమ్మాయి పరీక్ష పోదని గ్యారంటీ ఏమిటి?'' అడుగుతున్నారాయన.

''పోదు డాడీ! మాల చాల ఇంటలిజెంట్ గరల్. ఈసారి తప్పక పాసవుతుంది.'' చాలా నమ్మకంగా చెప్పాడు రవి.

'ఏమిటో అంత నమ్మకం! అసలయినా లంచగొండితనాన్ని రూపుమాపవలసిన వాళ్ళూ, రికమెండేషన్లని అవతలికి నెట్టాల్సిన వాళ్ళూ అయిన యువకులే ఇలా తయారయితే ఇక దేశమేం బాగుపడుతుంది?' ఓ నిట్టూర్పు విడిచాను.


అలాగే మాధవరావుగారికీ విసుగొచ్చింది కాబోలు, ''ఇంటలిజెంట్ అయితే కనీసం థర్డ్ క్లాస్ అయినా రాకపోయేదా, అప్పుడు నన్ను ఒప్పించటం ఇంతకష్టం అయేదా నీకు! ఆ అమ్మాయి గురించి పొగడ్తలు మానెయ్'' అన్నారు. కుతూహలం పట్టలేక చెవులు రిక్కించి వాళ్ల సంభాషణ వినసాగాను.

''అది కాదు డాడీ! మాల...''

''అబ్బబ్బ ఎవర్రా ఆ మాల? కొంపదీసి పూమాల వేసి వరించటం లేదు కద?'' ఈసారి రెచ్చిపోయి వెటకారంగా అన్నారాయన.

''వట్టి పూలమాల వేసి పెళ్లయిపోయిందని నమ్మేస్తే నమ్మేటంత తెలివి తక్కువ వాళ్ళుకాదు డాడీ ఈ కాలం ఆడపిల్లలు. రిజిస్ట్రార్ ఆఫీసుకి లాక్కు వెళ్లందే ఊరుకోరు. ఈ అమ్మాయి ప్రస్తుతం నా బెస్ట్ ఫ్రెండ్.''

''సంతోషించాంలే తెలివికి! కానీ నా నిర్ణయం మారదని మరోసారి ఖచ్చితంగా



చెప్తున్నాను. ఈసారి మెరిట్ బేసిస్ మీదే సెలెక్షన్ జరుగుతుంది.''

పోయినప్రాణం తిరిగి వస్తున్నట్లనిపించింది నాకు. కానీ రవికి ఆయన మాటలు నచ్చలేదు. ''ఆ అమ్మాయి సరదా చూసి తప్పక ఉద్యోగం ఇప్పిస్తానని ప్రామిస్ చేసాను కానీ ఆమెకేం గతిలేక కాదు. వాళ్ల నాన్నగారు తాసీల్దారు రంగారావుగారికి మంచి పలుకుబడి ఉంది. కావాలంటే ఆమెకి ఈ క్షణంలో మరో ఉద్యోగం వస్తుంది.'' అన్నాడు తల బిరుసుగా.

నా సందేహం నివృత్తి అయింది అయితే ఇతని బెస్ట్‌ఫ్రెండ్ నా క్లాస్‌మెట్ మాలే నన్నమాట. ఎంత చిత్రం! క్లాస్‌లో అన్ని విషయాల్లోనూ నాతో పోటీ చేసి ఓడిపోయి ఉడుక్కునే మాల ఉద్యోగ విషయంలోనూ తనకి తెలీకుండానే నాతో పోటీకొస్తోందన్న మాట! కానీ ఈసారెందుకో నేను ఓడిపోక తప్పదేమోననిపిస్తోంది నాకు.

''ఏమిటీ ఆ పిల్లా? ఆ అమ్మాయిని నేను చూసాను. సరదాగా, జల్సాగా తిరిగే ఆ పిల్ల స్థిమితంగా కూర్చుని ఉద్యోగం చేస్తుందంటే ఎవరు నమ్మగలరు? ఇన్ని మాటలనవసరం రవీ! నువ్వు ఎన్నిసార్లు ఎందర్నిలా రికమెండ్ చేసావో గుర్తులేదు కానీ నేను మాత్రం మొదటిసారిగా నీ రికమెండేషన్ని రిజెక్ట్ చేస్తున్నాను. నన్నర్థం చేసుకుని వెళ్లు.''

మాధవరావుగారి గొంతులో అభ్యర్థన స్పష్టంగా వినిపిస్తోంది.

''కొన్ని రోజులు అలవాటయిపోతే మాల కూడా...'' రవి మాటలింకా పూర్తికాక ముందే.

''మిస్టర్ రవిచందర్! ఈ కంపెనీ ప్రొప్రయిటర్‌గా చెప్తున్నాను. ఆ పిల్లకి ఉద్యోగం రావటం అసంభవం'' అంటూ త్రుంచేసారాయన.

''సరే. వస్తాను.''

విసురుగా వినిపిస్తున్న బూట్ల టకటకల్ని బట్టి అతను బయటికి వచ్చేస్తున్నాడని గ్రహించి ఉత్సాహం తెచ్చిపెట్టుకుంటూ మాధవరావుగారితో ఏం మాట్లాడాలో, ఎంత వినయంగా మాట్లాడాలో రిహార్సల్ చేసుకుంటూ, గొంతు సవరించుకుంటూ తలుపు ప్రక్కగా గోడనానుకుని నిలబడ్డాను అతనిలా బయటికి రాగానే అలా లోపలికి వెళ్లిపోవచ్చుని.

రాలిన ముత్యాలు

శ్రీ సోమసుందర్

కవితా ప్రియంవద
అచ్చమైన తమోభిసారిణి
ఏ పూపొద మాటున ఏ మోక మాటున
దాగిందో—ఎంత వెదికినా కనిపించదు
అపస్వర భూయిష్టంకాని దసలే
వినిపించదు!

గెలుపు నాదే

ఫ్యాన్ ఓ సారొచ్చి చూసి మళ్లీ ఎటో వెళ్లిపోయాడు.

నీలం రంగు తలుపులమీద తెల్లటి చేతివేళ్లు పడ్డాయి. ఆ క్షణంలో నా దృష్టినాకర్షించింది పొడుగాటి అందమైన వేళ్ళకి మరింత అందాన్నిస్తూ మెరుస్తున్న మూడు బంగారు ఉంగరాలు. లక్ష్మీపుత్రుడు! లతనికేం, మూడు కాకపోతే ముప్ఫై పెట్టుకొంటాడు. అతను దాదాపు బయటికి వచ్చేసాడు కానీ ఇంతలో ఈసారి వెనకనుండి.

''రవీ! ఓ నిమిషం ఇలారా!'' అంటూ మాధవరావుగారి పిలుపు వినిపించింది.

'హతోస్మి!' నీరసంగా కుర్చీలో కూలబడ్డాను.

''నిన్నేరా!'' ఆయన రెండోసారి పిలవటంతో రవి మళ్లీ లోపలికెళ్లాడు.

''అన్నం తిన్నావా?'' అడుగుతున్నారాయన.

''లేదు.'' పొడిగా వచ్చింది సమాధానం.

''ఇప్పుడేం వెళ్తావుగానీ ఇక్కడే ఉండిపో. ఎలాగూ లంచ్ టైమ్ అవుతోంది గనుక క్యారియర్ వస్తుంది. ఇద్దరం తినేద్దాం'' ఆయన కంఠంలో ఈసారి ఆదరణా, ఆప్యాయతా తొణికిసలాడుతున్నాయి. ఎంతయినా పితృహృదయం మరి!

'క్యారియర్' అన్న పదం వినగానే నాకు ఎక్కడలేని ఆకలీ ముంచుకొచ్చింది, ప్రొద్దున్న వచ్చేటప్పుడు త్రాగివచ్చిన గుక్కెడు కాఫీ అరిగిపోయి చాలా సేపవుతోంది. రవికి బదులు మాధవరావుగారు ఆ సూచన నాకే గనక చేసినట్లయితే శుభ్రంగా ఆయనకి కూడా మిగల్చకుండా క్యారియర్ మొత్తం ఖాళీచేసే దాన్నే.

''అఖ్కర్లేదు: ఈ రోజు నేను భోం చెయ్యను.'' రవి విసురుగా బయటికి వచ్చేస్తున్నాడు. కానీ ఈసారి నేను ఒక్కడుగు కూడా ముందుకి వెయ్యకుండా నిస్త్రాణంగా అక్కడే కూర్చుండిపోయాను. అయితే ఈసారి అతను నిజంగానే బయటికి వచ్చేసి చకచకా నడుస్తూ హాలు నుండి వెళ్లిపోవటానికి ఉద్యుక్తుడయాడు. ఆ విసురులో అతని కాలి బూటు నా కాలి బొటనవ్రేలిమీద పడటంతో 'అబ్బా!' అంటూ బాధగా వంగి వేలిమీద చేత్తో రాసుకోసాగాను.

కాస్తదూరం వెళ్లిన అతను నా మూలుగు విని కాబోలు ఒక్క సెకండు ఆగి, ''గట్టిగా త్రొక్కానా? ఐయామ్ సారీ'' అంటూ మళ్లీ ముందుకి నడిచాడు. నాకు బుస్సున కోపం పొంగింది. 'త్రొక్కితే తొక్కాడు. కనీసం చెప్పుకున్న ఆ సారీ అయినా మనస్ఫూర్తిగా చెప్తేగా! ఛ! ఛ! బొత్తిగా మానర్సే లేదు.' తిట్టుకుంటూ లేచి కాస్త కుంటుతూ లోపలికి వెళ్లటానికి సిద్ధమవబోతూ, లోపల్నుండి మాధవరావుగారు ఆదుర్దాగా వచ్చి రవి భుజం పట్టి ఆపేయటం చూసి ఆగిపోయాను.

''రవీ. –ఏమిట్రా ఈ మొండితనం! గారాబం చేసేకొద్దీ చదువులో వెనకపడ్తావేమోనని భయపడ్డాను కానీ ఇలా మొండివాడివీ, సంస్కార హీనుడివీ అవుతావనుకోలేదు. అయినా ...'' ఘాటుగా ఏదో అనబోతున్న ఆయన హఠాత్తుగా నా ఉనికి గుర్తించినట్లు ప్రక్కకి తిరిగి తెల్లబోతున్నటు నా వంక చూసారు.

అంతదాకా ఆయన్తో ఏం మాట్లాడాలో పదేపదే రిహార్సల్స్ చేసుకుంటున్న –నేను అసలు సమయం వచ్చేసరికి, ''నేను...నేను... నా పేరు సుజాతండీ. బి. ఏ. పాసయ్యాను'' అంటూ తికమక పడ్తుంటే, నన్ను సగంలోనే ఆపేసి.

''చూడమ్మా! నాతో మాట్లాడవలసిన పనుంటే రేప్పొద్దున్న పదిగంటలకి. వస్తే సావకాశంగా మాట్లాడటానికి వీలుంటుంది ఇక ఈ రోజుకి నేనెవర్తోనూ మాట్లాడ దలుచుకోలేదు.'' ఖచ్చితంగా అన్నారాయన

చేతి గడియారం వంక చూసుకుంటూ.

నా కాళ్లలో వణుకు ప్రారంభమైంది. రవి చేతిలో ఉన్న కీ చెయిన్ అటూ ఇటూ తిప్పుతూ సవిలాసంగా నావంకా, ఆయన వంకా మార్చి మార్చి చూస్తున్నాడు,

"— ప్లీజ్ ఎక్స్‌క్యూజ్ మీ! ఈరోజు నేను—" ఊరెళ్లిపోవాలని చెప్పబోతున్న నన్ను మధ్యలోనే ఆపేసి

"ఒకసారి చెప్తే వెళ్లిపోతే బావుంటుందమ్మా. నేనిప్పుడు మాట్లాడే మూడ్‌లో లేను. ఇంటికెళ్లిపోతున్నానని చెప్తున్నానుగా! నన్నిబ్బందిలో పెట్టకు." చిరాగ్గా చూసారాయన.

నా కళ్లలోకి నీళ్లు చిమ్మాయి. ముఖ్యంగా రవి ముందు ఆయన నామీద విసుక్కోటం చిన్నతనమనిపించింది. పోనీ పనయిందా అంటే అదీలేదు. ఇప్పుడేం చెయ్యటం ? ఇంతదూరం వచ్చి ఆయన్తో మాట్లాడకుండా వెళ్లిపోవటమా!

ఆలోచిస్తున్నదాన్నల్లా, ముందుకి వెళ్లబోతున్న మాధవరావుగారు ఆగి, ఆదోలా నావంక చూస్తూ, "మీ ఆడపిల్లల్తో వచ్చిన చిక్కే ఇది. కాస్త కటువుగా మాట్లాడితే చాలు. కళ్లనీళ్లు పర్యంతమౌతారు. పోనీ వచ్చిన పనేమిటో త్వరగా చెప్పమ్మా!" అనటంతో ఆదే చాలన్నట్లు క్షణం ఆలస్యం చేయకుండా బాగ్‌లోనుండి నాన్నగారిచ్చిన లెటరు తీసి ఆయనకిచ్చాను.

కాస్త విసుగ్గానే అందుకుని ప్రొప్రైటరు హోదాతో మొదట హుందాగా చదువుకోవటం మొదలుపెట్టిన ఆయన పెదవుల మీదికి చూస్తూండగానే చిరునవ్వు వచ్చేసింది. దిగ్గున ఉత్తరం లోనుంచి తలెత్తి మెరిసే కళ్లతో.

"అయితే నువ్వు రాఘవ కూతురివన్నమాట? ఆ మాట ఇందాకే చెప్పి ఉండకూడదటమ్మా?...అవును. ఇప్పుడు చూస్తూంటే పోలికలుకూడా స్పష్టంగాతెలుస్తున్నాయి..." అన్నారు పరీక్షగా చూస్తూ. చిన్నగా నవ్వి ఊరుకున్నాను.

"ఊ! ఇంతకీ ఎలా ఉంది వాడి ఆరోగ్యం? మీఅమ్మబావుందా? మొత్తానికి మీ నాన్న తెలివితేటలూ మీ అమ్మ అందం పుణికి పుచ్చుకు పుట్టావన్నమాట. మీనాన్న గుంటూరు వదిలి వెళ్లిపోయేసరికి నువ్వింకా పుట్టలేదు వాసూ, వేణూ ఇద్దరూ బాగా చిన్నపిల్లలు మీనాన్న వెళ్లిపోయిన రెండేళ్లకి నేనూ రవితో హైదరాబాదు వచ్చేసాను. రాకపోకలు బొత్తిగా ఆగిపోయాయి. మొన్న నెలరోజుల క్రితం తిరుపతిలో కనిపించినప్పుడు రాఘవ చెప్పాడ్లే. యూనివర్శిటీ ఫస్ట్‌గా పాసయావట కదూ! గుడ్......ఎక్కడ! సరిగ్గా నిలబడి రెండు నిమిషాలు కూడా మాట్లాడలేనంత అవసరమైన పని మీద వెళ్తున్నానిప్పుడు." ముక్కుమీదికి జారిన కళ్ళజోడుని సర్దుకుంటూ నవ్వారాయన.

"అవునండీ. నాన్న చెప్పారు. మీ కంపెనీలో టెంపరరీ వేకెన్సీలు కొన్ని ఉన్నాయని కూడా చెప్పారట." గుర్తు చేస్తున్నట్లుగా అన్నాను సర్టిఫికెట్లు ఆయన కందిస్తూ.

"అవునవును." తలాడిస్తూ వాటిని పరిశీలించి, నీకు ప్రైజ్‌రాని గేమ్ ఉన్నట్లు లేదే! అవున్లే! తండ్రి పోలికలెక్కడికి పోతాయి? చిన్నప్పుడు రాఘవా అంతే. క్రికెట్, టెన్నిస్... ఒకటేమిటి అన్నింట్లో వాడే ఫస్టు. అదృష్టంలేదు కానీ టెస్ట్ ప్లేయర్ కావలసినవాడు. విధి ఎంత చిత్రమైనదో చూడు. ఒకప్పుడు నన్నీ స్థితిలో నిలబెట్టినవాడికి ఈనాడు నేను సాయం చేయాల్సిన అవసరం వచ్చింది." అన్నారాయన నిట్టూరుస్తూ.

మౌనంగా చేతి గోళ్లవంక చూసుకుంటూండిపోయాను.


రెండు నిమిషాలాగి, "చూడమ్మా! ఈ ఉద్యోగం నీ కివ్వటానికి నాకే అభ్యంతరమూ లేదు. ఈ ఫస్ట్‌కల్లా వచ్చి చేరిపో. ఘూ రాఘవ కూతురికోసం ఆ మాత్రం చెయ్యలేకపోను. ఎటొచ్చీ నాకు బాధగా ఉన్న విషయమేమిటంటే ఇది టెంపరరీ పోస్టు మాత్రమే!" ఆయన మాటలింకా పూర్తికాకముందే, నా ముఖంలో కదలాడుతున్న కృతజ్ఞత ఇంకా చెదరిపోకముందే.

"అవును మరి! పర్మనెంటయితే ఇంకా బావుండేది. కదు డాడీ?" వెటకారంగా ధ్వనించింది రవి కంఠం. "ఇప్పుడు తెలుస్తోంది నాకు మీరు మాలకెందుకు ఉద్యోగం ఇవ్వన్నారో! మీరు స్వయంగా రికమెండ్ చేసే కాండిడేట్ ఉందంటే నేను సిఫారసు చేసి మాటపోగొట్టుకునే అవసరం ఉండేది కాదుగా!" నిష్ఠూరంగా అన్నాడు రవి.

"కాస్త సెన్సిబుల్‌గా మాట్లాడు రవీ! మాల క్వాలిఫికేషన్‌కీ సుజాత క్వాలిఫికేషన్‌కి పోలికేమిటి?—అయినా సుజాత తండ్రి రాఘవ నా ప్రాణ స్నేహితుడు. చిన్నప్పుడు 'అంకుల్! అంకుల్!' అంటూ వాడివెనకే తిరిగేవాడివి గుర్తులేదూ!"

"ఎప్పుడో చిన్నప్పటి సంగతులెవరికి గుర్తుంటాయి? ఇంకా ఎంత సేపవుతుంది మీరు రావటానికి?" రవి ఇబ్బందిగా కదుల్తూ మాట మార్చాడు. మాధవరావుగారు వాచీ వంక చూసుకున్నారు.

"ఫైల్స్ సర్ది పావుగంటలో వచ్చేస్తాను





ధర్మపధం —బులుసు వేంకటరమణయ్య.

పశుపక్ష్యాదుల భక్తి రహస్యం

మన పురాణాలనూ, క్షేత్ర మహాత్మ్యాలను బట్టి చూస్తే పశువులు, పక్షులు, కీటకాలు కూడ ప్రయత్నపూర్వకంగానో అప్రయత్నంగానో చేసిన అత్యల్పమైన భగవత్సేవవల్ల కూడా ముక్తిని పొందినట్లు తెలుస్తున్నది. రాముడు సముద్రం పైని వారధిని నిర్మించినపుడు ఉడత తన తోకతో ఇసుక జల్లి తన భక్తిని చూపిన సంగతి అందరికీ తెలిసినదే!

పండరిపుర మహాత్మ్యాన్ని తెలుపుతున్న కథలలో ఒక ఆవు శ్రీకృష్ణుని మురళీధ్వనిని విని పరవశమై పాలు కురిసినదనీ, గాలికి ఎగిరిన పాలనురుగు దేవుని శిరస్సుపైని పడగా, క్షీరాన్ని అభిషేకం చేసిన ఫలం ఆ గోవుకు లభించినదనీ, అందువల్ల ఆ ధేనువు ఒక భక్తురాలుగా పుట్టినదనీ ఉన్నది. ఒక కాకి దేవుని ఆలయంపై వాలడంవల్ల దాని రెక్కల గాలికి అక్కడి దుమ్ము ఎగిరిపోయి ఆ కాకికి సమ్మార్జన సేవాఫలం దక్కింది.

ఒక హంస ఆలయ ప్రాంగణంపైని వ్రాలగా, దాని రెక్కలనుండి జారిన నీటి బిందువులవల్ల ఆ హంసకు కలయంపి చల్లిన పుణ్యం వచ్చింది. పాము గర్భగుడిలో ప్రవేశించగా, దాని తలవిూది మణి మూలంగా అక్కడ దేవునికి దీపం పెట్టిన సుకృతం చేకూరినది. ఒక చిలుక ఒక ముత్యాలదండను తెచ్చి గుడిదగ్గర త్రుంచి పడవేయగా, ముత్యాలముగ్గులు పెట్టిన ఫలం లభించింది. ఒక తేనెటీగ దేవుని పాదాలపై ఉన్న పూవులోని మకరందం తోడి జలబిందువును ఆస్వాదించగా పాదతీర్థం సేవించిన ఫలం దక్కింది. ఈ విధంగా లభించిన పుణ్యంవల్ల కాకి మున్నగువాటికి మనుష్యత్వం వచ్చింది. ఆ అయిదూ ఆ భక్తురాలికి పుత్రులుగా పుట్టాయి.

ఈ వృత్తాంతాలనుబట్టి ఒక విషయం గ్రహించవచ్చును. ప్రాణులకు స్థూల శరీరం, సూక్ష్మ శరీరం, కారణ శరీరం — అని. ఆ విధంగా షడూర్ములు — జరా మరణములు, క్షుత్పిపాసలు, శోక, మోహములు అనే జంటలు ఉంటున్నవి. జరామరణాలు స్థూల శరీరానికి సంబంధించినవి. క్షుత్పిపాసలు(ఆకలి, దప్పికలు) సూక్ష్మశరీరానికి సంబంధించినవి. శోక మోహములు (దుఃఖము, అజ్ఞానము) కారణ శరీరమునకు సంబంధించినవి. ఈ ఆరింటికీ లొంగని ప్రాణి లేదు.

ఎప్పుడయితే ప్రాణి వీటిని తప్పించుకొనగలదో — అంటే — వీటికి లొంగకుండా వుంటుందో అప్పుడే ముక్తి లభిస్తుంది. ఆ తల్లి ఆ అయిదుగురు బిడ్డలతో సుఖంగా ఉన్నదంటే షడూర్ములకూ స్వాధీనం కాని జీవి ముక్తిని సాధించిన దన్నమాట.

పయి వృత్తాంతాల వల్ల ముక్తిమార్గం కూడా తెలుస్తూ ఉన్నది.

ఈ విధంగానే ఇట్టి వృత్తాంతాల సత్యాసత్యాలను విమర్శించకుండా వాటి ఆంతర్యాన్నే గ్రహించవలసి ఉంటుంది.

గెలుపు నాదే

సుజాతని ఈ రోజు మనింటికి అతిథిగా తీసుకెళ్దాం." నవ్వుతూ అన్నారు.

"క్షమించండి. ఇప్పటికే ఆలస్యమయింది. వసుంధరా, ఆంటీ నా కోసం భోంచెయ్యకుండా ఎదురు చూస్తూంటారు." నమ్రతగా అన్నాను.

"వసుంధరెవరు?" ప్రశ్నార్థకంగా చూసారాయన.

"నా స్నేహితురాలు, దాని దగ్గర నాకున్న చనువుకొద్దీ వాళ్లింట్లోనే దిగాను. వాళ్ల నాన్నగారికి బదిలీ అయిందిట. ఈ రాత్రే వాళ్ళు బెజవాడ వెళ్లిపోతున్నారు. ఆ సంగతి ఇక్కడికొచ్చాక తెలిసింది. అందుకే మీరు మాట్లాడే మూడ్‌లో లేకపోయినా మిమ్మల్ని ఇబ్బంది పెట్టాల్సొచ్చింది." అన్నాను నొచ్చుకుంటూ.

ఈ సారాయన స్వచ్ఛంగా నవ్వారు. "ఆఁ! అదేం మాటలే అమ్మా! ఈరోజు నీతో మాట్లాడకపోతే నువ్వు మా రాఘవ కూతురివని తెలిసేదా!" అన్నారు నవ్వుతూ.

నేను ఆయన స్నేహితుడి కూతుర్ని తెలిసాక ఎంతో ఆత్మీయురాలితో మాట్లాడుతున్నట్లు మాట్లాడటాన్ని నేను గమనించక పోలేదు. అది రవికి అంతగా నచ్చినట్లు లేదు.

"డాడీ! నాక్కాస్త అవసరమైన పనుంది వెళ్తున్నాను" అన్నాడు ఆయన వైపు చూస్తూ.

"ఎక్కడికి?" మాధవరావుగారు అయిష్టంగా కనుబొమ్మలు చిట్లించారు.

"ఓ ఫ్రెండ్ దగ్గరికి"

"ఫ్రెండంటే? స్నేహితుడా? స్నేహితురాలా?" వెటకారంగా, ఆరా తీస్తున్నట్లుగా ఉన్న ఆయన ప్రశ్నకి నేను బిత్తరపోతే రవి మాత్రం నదురు బెదురూ లేకుండా.

"ఎవరైతేమాత్రం వచ్చే తేడాఏముంది?" అంటూ నిర్లక్షంగా వెళ్లిపోయాడు. అతను వెళ్లిపోయిన వంక ఆవేదనగా కొన్ని క్షణాలు చూసి "నువ్విలా కూర్చోమ్మా, ఇప్పుడే ఐదు నిమిషాల్లో వస్తాను. నిన్ను మీ ఫ్రెండింటి దగ్గర డ్రాప్ చేసి వెళ్తాను." అంటూ తన గదిలోకి వెళ్లారాయన,

కాస్త ముందుకి నడిచి కిటికీ లోనుండి కాంపౌండులోకి చూసాను.

ఠీవిగా నడుస్తూ వెళ్లిన రవి విసురుగా కారుడోరు తెరిచి, అంత విసురుగానూ డ్రైవర్ జేబులో నుండి తాళం చెవుల గుత్తి లాక్కుని, కారు స్టార్ట్ చేస్తూ.

"చూడు వెంకయ్యా! కారు నేను తీసుకెళ్లానని డాడీతో చెప్పు" అన్నాడు నిర్లక్ష్యంగా.

అంతదాకా కళ్లప్పగించి చూస్తున్న డ్రైవర్ అతని మాటలకి బిత్తరపోయి, "అయ్యబాబోయ్! నాన్నగారు రంగయ్యతో వస్తున్నానని కబురెట్టారండీ! కారు లేకపోతే నన్నన్యాయంగా కేకలేస్తారు. రవి బాబూ! ఇది తమకు న్యాయం కాదండీ". అన్నాడు. ప్రాధేయపడుతున్నట్లు.

రవి కళ్ళలో జాలికి బదులు చిరాకు తొంగి చూసింది.

"ఏమిటయ్యా నీ గొడవ! నాకు అర్జెంటు పని ఉందంటే నీక్కాదూ చెప్పేది? అంతగా అయితే ప్రక్కనే టాక్సీస్టాండ్ ఉందిగా ఓ టాక్సీ తీసుకొచ్చి కారు నాక్కావలసి వచ్చి తీసుకెళ్లానని నాన్నగారితో చెప్పేయ్" అతని మాటలు పూర్తికాకముందే కారు స్టార్టయి గేటుదాకా వచ్చేయటం గూర్ఖా తెరిచిపట్టుకున్న విశాలమైన గేటులో నుండి కారు నున్నటి తారురోడ్డుమీదికి దూసుకుపోవటం జరిగిపోయింది.

(ఇంకా వుంది)

హైదరాబాద్ నోట్ బుక్

అంతర్జాతీయ సంగీతోత్సవం

అంతర్జాతీయ సంగీతోత్సవం సందర్భంగా సంగీత నాటక అకాడెమీ యాజమాన్యాన సెప్టెంబరు 29 న కళా భవన్‌లో జరిగిన ఉత్సవంలో సంగీత నాటక అకాడెమీ మాజీ కార్యదర్శి, ప్రముఖ వేణుగాన నిపుణులు శ్రీ ఎం. ఎస్. పద్మారావు భారతీయ సంగీతం పుట్టు పూర్వాలను గురించి ఒక పరిశోధన వ్యాసం పఠించారు. భారతీయ సంగీతంలో ఉత్తరాపథ దక్షిణాపథ భేదాలు పూర్వం లేవని, ముస్లిం పాలకుల ప్రభావం వల్ల మధ్యకాలంలో భేదం ఏర్పడిందని, ప్రస్తుతం మరల భారతీయ సంగీతం అనేది ఏకధారగా రూపొందుతున్నదని ఆయన వ్యాసం సారాంశం. అధ్యక్షత వహించిన అకాడెమీ అధ్యక్షులు శ్రీ కె. వి. గోపాలస్వామి, శ్రీ పద్మరావు వ్యాసం ప్రశంసిస్తూ ప్రసంగించారు. తర్వాత తూర్పు గోదావరిజిల్లా శ్రీ ముత్యాల అబ్రహాం పార్టీవారు సారంగధర జముకుల కథ చెప్పి, శ్రోతలను ఆనందపరచారు.

ఇద్దరు ప్రజానాయకుల షష్టిపూర్తి

సెప్టెంబరు చివరివారం జంట నగరాల విశేషం ఇద్దరు ప్రజానాయకులు శ్రీ కోదాటి నారాయణరావు, శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీల షష్ట్యబ్దపూర్త్యుత్సవం అనవచ్చు. హోరున వాన కురుస్తున్నా ఈ ఉత్సవాలు విజయవంతంగా జరిగాయంటే, ప్రజలకు వారి యెడల గల విశేష గౌరవాదరాలనే అనాలి. శ్రీ కోదాటి స్వాతంత్ర్యసమర యోధుడుగా, గ్రంథాలయోద్యమ నాయకుడుగా, సర్వోదయ కార్యకర్తగా ఆంధ్ర ప్రాంతమంతా ఎరిగిన ప్రముఖులు. ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు అధ్యక్షతన గాంధి భవన్‌లో సెప్టెంబరు 28 న జరిగిన శ్రీ కోదాటి షష్టిపూర్త్యుత్సవంలో శ్రీ ప్రభాకరజీ, డాక్టర్ జి. ఎస్. మేల్‌కోటే, శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య డాక్టర్ రాజ బహదూర్ గౌడ్, మున్నగువారు శ్రీ కోదాటి నిస్వార్థ సేవను ప్రశంసించారు. ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఆవుల సాంబశివరావు శ్రీ కోదాటి జీవిత విశేషాలు తెలిపే ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. సన్మాన సంఘాధ్యక్షులు శ్రీ భోజిరెడ్డి స్వాగతం పలికారు. శ్రీ అక్కిరాజు వాసుదేవరావు స్వాగతపత్రం చదివారు. వందకుపైగా సంస్థలు శ్రీ కోదాటిని పుష్ప మాలాలంకృతులను చేశారు. నూతన వస్త్రాలు, బహూకరించారు. నిజాంరాష్ట్రం మాజీ హోం శాఖా మంత్రి శ్రీ డి. జి. బిందూ ఉత్సవాన్ని ప్రారంభించారు. శ్రీ కోదాటి సవినయంగా అందరికీ కృతజ్ఞతా వందనాలర్పించారు. శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ షష్టిపూర్త్యుత్సవం ముఖ్యమంత్రి అధ్యక్షతన సెప్టెంబరు 27 న ఎగ్జిబిషన్ గ్రౌండ్సులో వైభవోపేతంగా జరిగింది. వంద సంస్థలకుపైగా ఆయనను పూలమాలలతో సన్మానించి, సన్మానపత్రాలు సమర్పించాయి. ముఖ్యమంత్రి., కార్మికమంత్రి శ్రీఅంజయ్య చేనేత మంత్రి శ్రీ కె. వి. కేశవులు, శ్రీ డి. జి. బిందూ మొదలైనవారు శ్రీ లక్ష్మణ్ బలహీన వర్గాలకు చేసిన సేవను ప్రశంసించారు. శ్రీ లక్ష్మణ్ ఘన సన్మానానికి కృతజ్ఞత తెలిపారు.

వయస్సు వెల్లువలు

నవ్య సాహితీ సమితి యాజమాన్యాన ఇటీవల హైదరాబాద్ వై. ఎం. సి. ఎ. హాలులో సమితి అధ్యక్షులు శ్రీ వి. నారాయణరావు (ఐ. ఎ. ఎస్) అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీ నెమలికంటి రామచంద్రరావు రచించిన 'వయస్సు—వెల్లువలు' నవలను జీవిత భీమా డివిజనల్ మేనేజర్ శ్రీ కె. వి. వై. శాస్త్రి ఆవిష్కరిస్తూ, ఈ నవల అన్నివర్గాల పాఠకులూ చదువదగినంత సరళ సుందరంగా వుందన్నారు. ఇలాటి నవలలు చాల రావాలని శ్రీ వి. నారాయణరావు కోరారు. డాక్టర్ అరిపిరాల విశ్వం నవల పరిచయంచేస్తూ, రచయిత నాట్యరంగానుభవం నవలలో విశేషంగా కనిపిస్తున్నదన్నారు. డాక్టర్ నాయని కృష్ణకుమారి ఈ నవలలో ఆనాటి బ్రహ్మసమాజం వాతావరణం వుందనీ, శ్రీ పోతుకూచి సాంబశివరావు పాత్రల సంభాషణలలో మానసిక తత్త్వ వివేచన వున్నదని, అన్నారు. రచయిత శ్రీ రామచంద్రరావు తమ ప్రసంగంలో నవల వ్రాయడానికి గల కారణాలు, ప్రేరణలు తెలిపారు. నవ్యసాహితి కార్యదర్శి శ్రీ టి. వి. భద్రిరాజు స్వాగతం చెప్పారు. శ్రీమతి కమలా శంకర్రావు వందన సమర్పణతో సమావేశం సమాప్తమైంది.

ఉపశ్రుతి

"ఏమండీ, ఈపార్టీల వారంతా నిమిషంలో పోట్లాడుతారు, అంతలో చేరిపోతారు. ఎవరు ఎవరో తెలుసుకోవడం ఎలాగండీ ?" అని ప్రశ్నించాను ఒక స్వాతంత్ర్య యోధుణ్ని. ఆయన సమాధానం చెప్పేంతలోగా ఒక పల్లెటూరి పెద్దమనిషి "ఏందయ్యా తెలవక పోవడం ! సాగి సంసారి, బచ్చిలంజ. ఈడిగోడి ఇంటికాడ అందరూ ఒక్కటే అనే సామెత ఎరుకలేదా ?" అన్నాడు.

—తిరుమల రామచంద్ర


"ప్రజల మనిషి" "కింగ్ మేకర్"

'ప్రజల మనిషి' కార్యదక్షుడు పోయాడంటూ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి గాంధీ జయంతి నాడు శ్రీ కామరాజ్ నాడార్ ఆకస్మిక మరణవార్త వినగానే వాపోయారు. అత్యంత సామాన్య కుటుంబంనుంచి వచ్చి అత్యున్నతస్థాయి నాయకునిగా భాసించి 'కింగ్‌మేకర్'గా వర్తమాన చరిత్రలోను, రాజకీయ రంగంలోను వాసికెక్కిన కామరాజ్ నాడార్, గాంధీగారి ఉద్యమంలో దూకి జైలుకిపోయి స్వాతంత్ర్య పోరాటంలో ముమ్మరంగా పాల్గొని వుండకపోతే బట్టలషాపులో గుడ్డలు కొలుస్తూ వుండిపోయేవారు. శ్రీ కామరాజ్ 1936 లో రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శి అయిన నాటినుంచి 1954 లో రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యేటంతవరకు ఆయన ఘటనాఘటన సామర్థ్యం ఒక్కటే కాదు, ప్రజల పట్ల ఆయనకుగల ప్రేమ, చిత్తశుద్ధి, నిస్వార్థ సేవానిరతి అందరికీ ఆయన ప్రతికక్షులకుకూడా అవగతమైనాయి 1964లో "కామరాజ్ పథకం"తో నెహ్రూ జరిపిన ప్రక్షాళన కార్యక్రమంలో ఆయననే మొట్టమొదటివాడుగా పదవీ విరమణ చేశారు. అత్యున్నతిస్థాయి కాంగ్రెసు నాయకుడై రాణించిన కామరాజ్ గాంధేయవాది. నిరాడంబరుడు. ఆజన్మ బ్రహ్మచారి. మితభాషి– "పార్కలావ్స్," అంటే "చూద్దాం" అన్న మాట తప్ప పెద్ద హామీలు నినాదాలు చేసినవాడు కా అతణ్ణి చరిత్ర తన "ప్రజల మనిషి"గానే రికార్డు చేస్తుందని అంగీకరించని వారుండరు.



జననం : జూలై 15, 1903
మరణం : అక్టోబరు 2, 1975

[పి]



ఓ గుమాస్తా వేదన

తీరిగ్గా తొమ్మిదిన్నరకు భోజనంచేసి, అద్దం ముందు కూర్చుని, ఇంకా నింపాదిగా నా మొహంలోని అందాలను వెతుక్కుంటూ దువ్వుకుంటున్న నాకు వంటింట్లో నుంచి అమ్మ మాటలు లీలగా వినిపిస్తున్నాయి.

"అందరూ పదింటికల్లా ఆఫీసుకు చేరాలని ఆదరా బాదరాగా భోజనాలు చేసి పరిగెత్తుతారు కదా, వీడు మాత్రం దొర బాబులా పదింటిదాకా ఇంట్లోనుంచి కదల లేడే" అంటోంది మా అమ్మ మా చెల్లెలితో.

నేను అలా వెళ్లటానికి గల కారణాలు సవిస్తరంగా అమ్మకు చెప్పాలనిపించింది గాని, అవి చెప్పినా ఆవిడకు అర్థం కావని తిన్నగా గదిలోకి వెళ్లి బట్టలు వేసుకోవటం మొదలు పెట్టాను.

ఈ సారి అమ్మ సరాసరి నా దగ్గరకే వచ్చింది.

"ఇంకా కదలవేరా, పావుతక్కువ పది అయింది. ఆడపిల్లలా ఎంతసేపు యీ సింగారాలు, తొందరగా తెమిలి ఆఫీసుకుపో" ఇంచు మించు కసిరినట్టు చెప్పి ఎలా వచ్చిందో అలా తిన్నగా వంటింట్లోకి వెళ్లిపోయింది.

ఇక ఇంట్లో వుండటం ఏ మాత్రం సాధ్యం కాని పని అని నిర్ధారించుకుని, డ్రెస్ చేసుకోవటం పూర్తిగానిచ్చి "వెళ్లొస్తానే అమ్మా, తలుపు వేసుకో" అని చెప్పి బయట పడ్డాను.

మా అమ్మ నా వెనకాలే కొంచెం గట్టిగా తలుపు వేసుకోవటం గమనించి కూడ గమనించనట్టే ముందుకు నడిచాను.

అందరిలా నేను కూడ 'ఆఫీసుకు టయిమైపోతోంది తొందరగా అన్నం పెట్టవే' అని ఆవిడని తొందర పెట్టాలని, ఆవిడ తొందర తొందరగా వంట చేసి టైముకు అందిస్తే, టైముకు 'అబ్బ టైముకు అందించావే ఎలాగైతే' అని నా చేత అనిపించుకోవాలని ఆవిడ కోరిక.

నేను వుద్యోగంలో చేరిన కొత్తల్లో అలాగే వుండేది. అంటే నేను మా అమ్మను తొందర పెట్టడం, ఆవిడ చకా చకా వంటచేసి పెట్టడం, నేను ఇంకా తొందరగా భోజనం చేసి ఆఫీసుకు పోవటం జరుగుతుండేవి.

కాని ఆఫీసులో చేరిన రెండు సంవత్సరాల తర్వాత ఇలా తీరిగ్గా వెళ్ళడం మొదలు పెట్టాను. ఇంకా తీరిగ్గా వెడదామనే నా వుద్దేశ్యం కాని మా అమ్మ తొమ్మిదింబావు కల్లా వంట చేయటం మూలాన్నా, భోజనంచేసి ఆఫీసుకు బయలుదేరే దాకా తొందర చేయటం వల్లనూ, నాకు తొమ్మిదిన్ముప్పావు కల్లా బయట పడడం తప్పనిసరి అవుతోంది.

బస్ స్టాపుకు వెళ్ళిన రెండు నిమిషాలకే ఓ బస్సు వచ్చింది. పెద్ద రష్ లేకపోయినా, కొంతమంది నుంచోని వున్నారు. నెక్స్ట్ బస్‌లో హాయిగా కూర్చొని వెళ్ళొచ్చు ననుకుని సిగ

రెట్స్ కొనటానికి ప్రక్కనే వున్న పాన్‌షాపు కేసి నడిచాను.

తర్వాత బస్ అందుకుని ఆఫీసుకు చేరేటప్పటికి కచ్చితంగా పదిగంటల ఇరవై నిమిషాలయింది. సెక్షన్ హెడ్ రెడిగా వున్నాడు. రెడ్ పెన్‌తో లేటు మార్కు పెట్టటానికి. 'ప్రతిరోజూ లేటుగా వచ్చేవాడు, ఇవాళ తొందరగా వచ్చాడేమిటబ్బా' అని మనసులో అనుకుంటూ, "ఆగండి గురువుగారూ వచ్చేసాను" అని రెడ్ పెన్ వున్న ఆయన కుడిచేతిని నా ఎడంచేత్తో పట్టుకుని, నా కుడిచేత్తో ఆయన జేబులో నుంచే పెన్ తీసుకుని ఎటెండెన్స్ రిజిస్టరులో సంతకం పెట్టాను.

"థాంక్స్ గురువుగారూ, ఒక్క నిమిషం లేటయినా లేటు మార్కు పడిపోయేదే." అని మళ్లీ ఆయన జేబులో పెన్ పెట్టేసి నా సీటు కేసి నడిచాను.

పాపం మా సెక్షన్ హెడ్‌ది కొంచెం పెద్ద ఫామిలీ. భార్యకు తరచుగా ఏదో ఒక జబ్బు చేస్తూ వుంటుంది. అందువల్ల నెల్లో పాతిక రోజులు లేటుగా వస్తుంటాడు లేటు మార్కు పెట్టేవాడే లేటుగా వస్తుంటే 'మేం మాత్రం తీసిపోయామా' అని మా క్లర్కుగాళ్లమంతా కూడ సామాన్యంగా లేటుగానే వస్తుంటాం

కాని మా సెక్షన్ హెడ్ తొందరగా వచ్చినరోజు మాత్రం తనంత పంక్చువల్‌గా వచ్చేవాడు ఈ ప్రపంచంలో లేడన్నట్టుగా పోజుపెట్టి, పదీ ఇరవైకల్లా లేటుమార్కు పెట్టేస్తాడు. అదేమిటని కాస్త చనువున్న వాళ్లు అడిగితే, "టైముకు గాని గో... ఎలాగూ పెట్టలేను, కనీసం వచ్చిన రోజైనా పెట్టకపోతే ఎలాగయ్యా" అంటాడు.

ఇంతలో 'పోటు'గారు వచ్చారు. పాపం ఆయనకు లేటు మార్కు పడిపోయింది. ఆయన సంతకం పెడుతున్నప్పుడు ఆయన మొహం చూసిన ప్రతివాడికి తెలుస్తుంది, మనస్సులో సెక్షన్ హెడ్‌ని ఎంత ఘోరంగా తిడుతున్నదీ.

ఇంతకీ ఆయనకు 'పోటు' గారని పేరు ఎందుకు వచ్చిందంటే 'మనం పదింటికి ఆఫీసుకు వెళ్లి పొడి చేసేదేమిటి, ఓ సంతకం తప్ప' అంటుంటాడు అందుకని.

నా సీట్లో కూర్చుని డ్రాయరు తెరిచాను. ఆ రోజు అటెండ్ అవాల్సిన లెటర్స్ ఒక్కొక్కటే ఒక పక్క పెట్టాను. అంత తొందర లేని వాటిని భద్రంగా 'పెండింగ్ పాడ్' లో కట్టాను. అర్జంటుగా అటెండ్ అవ్వవలసినవి ఓ పది మాత్రం వున్నాయి.

సీరియస్‌గా ఓ గంట పని చేసిన తర్వాత 'సిగరెట్ కాల్చివస్తే తప్ప బుర్ర పన్జేసేటట్టు లేదు' అని సెక్షన్ హెడ్‌కు వినపడేలా నాకు నేను చెప్పుకుని బయటకు నడిచాను.

బయట కారిడార్ లోకి వచ్చి సిగరెట్ ముట్టించుకుని పచార్లు చేయటం మొదలు పెట్టాను. కారిడార్ ఆ చివరకు వెళ్లి మళ్లీ వెనక్కు తిరిగేవాణ్ని తిరిగినట్టే వుండి పోయాను. ఎదురుగా గోపి. నేను వాణ్ణి ఎంత ఆశ్చర్యంతో చూస్తుండి పోయానో వాడూ అంతే ఆశ్చర్యంగా నన్ను చూస్తూ నిలుచున్నాడు.

...దుగా తేరుకుని వాడి దగ్గరకువెళ్లి బుజం మీద చేయివేసి "ఏరా! అలా చూస్తూ నిలబడి పోయావేం" అన్నాను.

"ఆశ్చర్యంగాక మరేమిటిరా, నిన్ను ఈ టైములో యిలా చూస్తానని కల్లోగూడ అనుకోలేదు. కారణాలు చెప్పమంటావా, నంబర్‌వన్ నీ చేతిలో సిగరెట్, నంబర్‌టూ ఇప్పుడు టైము పన్నెండు. పదింటికి సీట్లో కూచ్చుని, ఒంటిగంట దాకా కదలని వాడివి యీ టైములో యిలా తిరిగ్గా పచార్లు చేయటం విచిత్రం కాక మరేమిటి ?" అన్నాడు.

గోపి నేను యీ ఆఫీసులో ఒకేసారి అడుగు పెట్టాం. ఓ ఆర్నెల్ల తర్వాత వాడు వాళ్ల వూరికి ట్రాన్స్ఫర్ చేయించుకున్నాడు. నేను వుద్యోగంలో చేరిన కొత్తల్లో చాలా సిన్సియర్‌గా వర్కు చేసేవాణ్ని. ఆఫీసు టైములో తిరిగేవాళ్లని విమర్శిస్తుండేవాణ్ణి. నా ఆశయాల గురించి, దేశాన్ని బాగుచేయటానికి నాకు తోచిన మార్గాల గురించి తీరిక దొరికినప్పుడల్లా లెక్చర్లు ఇస్తుండేవాణ్ణి. అలా ఎన్నో చెప్పిన నేను ఇలా తిరిగ్గా సిగరెట్ తాగుతూ పచార్లు చేయటం వాడికి చాలా ఆశ్చర్యాన్ని కల్గించి వుండవచ్చు.


"తర్వాత అంతా వివరంగా చెప్తాను గాని ముందు కాంటీన్‌కి పద కాస్త కాఫీ తాగుదాం. అసలు ఎప్పుడు వచ్చావు, మీ అమ్మా నాన్నా కులాసాయేనా మీ తమ్ముడేమంటున్నాడు" అని వాడిమీద ప్రశ్నలవర్షం కురిపించాను.

గోపీ వాళ్ల వూరి విశేషాలు చెపుతూ వుంటే. ఇద్దరం కాంటీన్ కేసి నడిచాము. విశేషాలు చెప్పటం అయాక వాడు, "ఒరే నేను ఓ సంవత్సరం క్రితం ఇదే టైములో ఆఫీసుకు వస్తే నువ్వేమన్నావో గుర్తుందా?" అన్నాడు.


"ఏమన్నానేమిటి ?"

"ఇది ఆఫీసు టైము. ఇప్పుడు నీతో మాట్లాడుతూ కూర్చుంటే నా టైమంతా వేస్టవుతుంది. సాయంకాలం మా యింటికిరా, అన్ని విషయాలు తీరిగ్గా మాట్లాడుకుందాము అని పెద్ద పోజుపెట్టి చెప్పలేదూ"

"ఒప్పుకుంటానురా అన్నాను. ఇంకా చాలా అనేవాణ్ణి. దొంగతనం అంటే ఏదన్నా వస్తువు ఎత్తుకు పోవటమేకాదు, మనం పని చేయటానికి ఒప్పుకున్న టైముకు డబ్బు



అగ్రదర్శకుడు



తెలుగు తెరకేగాక భారతీయ చలన చిత్ర రంగంలోనే ఎనలేని కీర్తి నందుకున్న సుప్రసిద్ధ చలన చిత్ర దర్శకుడు నిర్మాత శ్రీ బి. యన్. రెడ్డిగారికి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు లభించడంతో చిత్ర పరిశ్రమలోను, పత్రికా ప్రపంచంలోను, ప్రేక్షకలోకంలోను కూడా హర్షాతిరేకం యినుమడించింది.

తీసుకుంటూ, అంటే నెల నెలా జీతం పుచ్చుకుంటూ పని చేయకపోవటంకూడా దొంగతనమే అంటుండే వాణ్ణి. ప్రస్తుతం అటువంటి దొంగతనమే నేనూ చేస్తున్నాను, చేస్తున్నానని నాకూ తెలుసు. సరే, అవన్నీ ఇప్పుడు దేనికిలే. సాయంకాలం మా యింటికి రా, అన్నీ తీరిగ్గా మాట్లాడుకుందాం. అన్నట్టు రాత్రికి నీ భోజనం మా యింట్లోనే. మళ్లీ భోజనం చేయనంటే కుదరదు. అమ్మతో నీక్కూడా వంట చేయమని చెపుతాను.'' అన్నాను

కాఫీ అయిన తర్వాత, బయటదాకా వాడితో వెళ్లి సాయంకాలం మరీ మరీ భోజనానికి రమ్మని చెప్పి మా డిపార్టుమెంటు వైపు నడిచాను.

మళ్లీ సీట్లోకి వచ్చి కూచ్చున్నానన్న మాటేగాని పనిమీద మనసు లగ్నం కావటం లేదు. యథాప్రకారంగా లంచ్ కానివ్వటం, మళ్లీ మధ్యాహ్నం ఓ గంట సీరియస్‌గా పని చేయటం జరిగిపోయాయి. నాలుగింటికల్లా ఆనాటికి చేయాల్సిన వర్కు ముగించాను.

ఊరికే కూర్చుంటే మనసు మనసుదగ్గర

ఓ గుమస్తా కథ

వుండదు. గోపి రాకమాటి మాటికి నా మనస్సును గతంలోకి లాక్కెడుతోంది.

ఉద్యోగంలో చేరిన కొత్తల్లో దేశంలో ప్రతి ఆఫీసులో పెరిగిపోయిన లంచగొండితనం, ఆఫీసులు పనిచేస్తున్న తీరు, వాటిని బాగు చేయటానికి గల మార్గాలు, ప్రతి వుద్యోగిలోనూ రావల్సిన మార్పులు మొదలైన వాటిగురించి తీవ్రంగా ఆలోచిస్తూండేవాణ్ణి. మార్గాలు కొన్ని స్నేహితులకు చెప్తే, వాటిని అందరూ విని, ''బోరుకొట్టి చంపేసావురా, బాబు'' అంటుండేవాళ్ళు.

ఓ రోజు యీ విషయంమీద మా బావతో రెండు గంటలు పోట్లాడాను. ఆ రోజు మా బావ తను ఏదో ఆఫీసులో పని తొందరగా ఎలా పూర్తిచేసిందీ, ప్యూనుకు, గుమాస్తాకు ఎంత ముట్టచెప్పిందీ, అమ్మతో ఏదో ఘనకార్యం చేసినట్టుగా చెపుతుంటే విని సహించలేకపోయాను.

''అసలు మీలాటివారు వుండబట్టే దేశం యిలా పాడయిపోయింది. ఎవరి స్వార్థం కొద్దీ వారు పనులు తొందరగా అవాలని లంచాలు ఇస్తూంటే పుచ్చుకునేవాళ్లు తీసుకోకేం చేస్తారు? అందరూ ఇవ్వటం మానేస్తే పుచ్చుకునేవాళ్లు పని చేయటం మానేస్తారా, అప్పుడు వచ్చినట్టు ప్రయారిటి ప్రకారం పనులు చేస్తారు. నువు ఇలా ఇవ్వటం మూలానా, నీకంటె ముందు వచ్చిన వాడిపని నీ పనికంటె వెనక అవుతుంది. అంటే నువు ఇన్‌డైరక్టుగా వాడికి అపకారం చేస్తున్నట్లే. ఇదేం పెద్ద ఘనకార్యంకాదు'' అన్నాను ఆవేశంగా.

దాంతో మావాడికి ఒళ్ళు మండిపోయింది. అయినా ఏం చేస్తాడు, తను చేస్తున్నది తప్పని వాడికీ తెలుసు. ఇక వేరే మార్గం లేక మా ఆఫీసుమీద విరుచుక పడ్డాడు.

''వెధవ నీతులు చెప్పకు. మీ ఆఫీసు మాత్రం ఏమన్నా తీసిపోయిందా, ఒక్కొక్క ఫైలు కదలటానికి ఎంత టైము పడుతుందో అందరికి తెల్సు. లంచం ఇవ్వటం ఎంత నేరమో, జీతం పుచ్చుకుంటూ ఆఫీసు టైములో పని చేయక పోవటం కూడ అంతే నేరం. ముందు నీ సంగతి చెప్పు. నువ్వు తీసుకుంటున్న జీతానికి, న్యాయంగా ఆరున్నర గంటలు పని చేయాలి. కనీసం నాలుగు గంటలైనా పని చేస్తున్నావా'' అన్నాడు.

''ఇతరుల సంగతి ఏమోగాని నేను మాత్రం నేను సిన్సియర్‌గానే పని చేస్తున్నాను. ఫైళ్ళు కదలటమంటావా, అది అందరిమీదా ఆధారపడి వుంటుంది. గుమస్తా ఎంత తొందరగా చేసినా, ఆఫీసరు దాని మీద సంతకం పెట్టటం ఆలశ్యం అయితే ఎవడేం జేస్తాడు. అందుకే నామీదా, మా ఆఫీసుమీదా ఎగరటం మాని నేను చెప్పేది కొంచం ఓపిగ్గా విను. నేనూ అనేది అదేకదా, అందరిలో మార్పు రావాలని. కొన్ని కొన్ని చిన్న విషయాలే తీసుకుందాం. ఫైళ్లు కదలకపోవటానికి మొదటి కారణం మొదట్నుంచి వస్తున్న 'రెడ్ టేపిజం'. ఈ రోజు ఆఫీసరు టేబుల్ మీదకు ఫైలు వచ్చిందనుకో, ఆఫీసరు ఖాళీగావున్నా దానిమీద సంతకం పెట్టడు. 'ఇవాళే కదా, వచ్చింది దీనికి అప్పుడే ఏమిటి తొందర' అనుకుంటాడు. నిజానికి చెక్ చేసి సంతకం పెట్టటం అయిదు నిమిషాలకన్నా ఎక్కువ టైము తీసుకోకపోవచ్చు. ఇవాల్టి ఫైలుమీద రెండు మూడు రోజుల తర్వాత గాని సంతకం పెటకపోవటం అలవాటై పోయింది మన వాళ్లకు. అలాగే గుమస్తా గూడా ఏ రోజు లెటర్సు ఆ రోజు అటెండవడు. కారణం మామూలే. 'ఇవాళే కదా వచ్చింది, వీటికేమిటి తొందర' అనుకునే మనవాళ్ల మనస్తత్వం. అలాగే ఓ గుమాస్తా శలవు పెడితే, పక్క క్లర్కుకు ఆ వర్కు తెలిసినా, ఎవరైనా వచ్చి అడిగితే, 'కన్‌సరన్డ్ క్లర్కు' రాలేదని చెపులాడే తప్ప, తను వచ్చినా ఆ పని చేయడు. నిజానికి ఆ పని పది నిమిషాలకన్నా ఎక్కువసేపు పటక పోవచ్చు.'' అన్నాను కొద్దిగా వూపిరి పీల్చుకుంటూ.

మళ్లీ నేనే, ''ఏ రోజు ఫైళ్లు ఆ రోజు సంతకం పెడితే కొంపలేమీ మునిగిపోవని ఆఫీసర్లు, పక్కవాడి వర్కు చేయటం పాపం కాదని ప్రతి గుమస్తా అనుకుంటే తప్ప ఈ ఆఫీసులు బాగుపడవు'' అన్నాను.

''ఒరే నువు చిన్నవాడివి, నీకు యీ వుద్యోగాల్లో వుండే సాధక బాధకాలు తెలియవు. నేను మాత్రం గవర్నమెంటు సర్వీసులోలేనా, నాకీ విషయాలన్నీ తెలియవా, ఇవన్నీ వింటానికి బాగుంటాయేకాని, ఆచరణలో పెట్టటం చాలా కష్టం. ఇక్కడిస్తే,

(32వ పేజీ చూడండి)

సీరియల్
శ్రావణసంధ్య
తెళ్ళూప నాగేశ్వరరావు

(గత సంచిక తరువాయి)

"నాకు టైంలేదు శాంతీ! అప్పుడే టెన్ మినిట్స్ లేట్! సింపుల్ కాఫీ యివ్వు. టిఫిన్ కంపెనీ క్యాంటీన్‌లో తింటాన్లే!" అన్నాడు రాంమ్మోహన్ ఆదుర్దాపడుతూ.

"అంతా రెడీగా వుంది. మీరు తినడమే ఆలస్యం. తినేలోపుగా కాఫీ తెస్తాను" అంది శాంతి.

"ఉహూఁ! ... నో టైమ్!"

"అబ్బా! నాతో వాదించే టైంలోనే మీరు బ్రేక్‌ఫాస్ట్ చేయొచ్చు. పొయ్యిమీద పాలున్నాయి. బ్రేక్‌ఫాస్ట్ కూడా హెవీ కాదు. వెరీ లైట్! మీరు తినేలోపుగానే కాఫీ చేసుకు తీసుకొస్తాను."

ఆమెతో వాదించే లోపుగానే, ఆమె సంతృప్తి కోసమైనా గానీ కాస్త తినవచ్చునని రాంమ్మోహన్ ఆమ్లెట్‌తో ఓ బ్రెడ్ స్లైస్ తిన్నాడు. అంతలో శాంతి కాఫీ తీసుకొచ్చింది.

"శాంతీ! సాయంత్రం నేను వచ్చేలోపుగా నువ్వూ, నీలూ రెడీగా వుండండి!"

"దేనికండీ?"

"సంగీత్‌లో మంచి పిక్చరొచ్చింది. వెళదాం!"

"వెరీగుడ్ డాడీ! నేను రెడీ అవుతాను" అంది నీలిమ చప్పట్లు కొడుతూ.

"సినిమా అంటే సరి — నువ్వెప్పుడూ రెడీయే నీలూ! అయితే...అయిదింటికే వంటచేసేస్తాను."

"వంటొద్దూ—గింటొద్దూ! పిక్చర్ చూసి ఏ నాన్‌కింగ్‌లోనో డిన్నర్ చేద్దాం!"

"ఇంకా వెడ్డింగ్ యానివర్సరీ జోరు తగ్గనట్టుంది అయ్యగారికి — వెయ్యి రూపాయలు ఖర్చు అయినా!"

"మళ్లీ మొదలెట్టావ్ స్తోత్రం! ఖర్చూ, డబ్బూ అంటూ."

"నేను ఎంత వాగినా నా నోరు నొప్పిపుట్టడమేగానీ, మీరు ఖర్చు ఏమైనా తగ్గించారా? నెల నెలా వచ్చే జీతమే చూసుకుంటున్నారుగానీ, ఆ జీతంలో నాలుగు రాళ్లు మిగల్చాలనేదీ, మన వెనుక ఆర్థికంగా అండ ఏమీ లేదన్న సంగతే మీరు ఆలోచించడంలేదు. జీతాల మీద బ్రతికేవాళ్లకు ముందు ఆలోచన వుండాలి. మనం బ్రతికేది కేవలం సర్దాలను తీర్చుకోవడం కోసం కాదండీ!"

"మరెందుకు బ్రతకడం? సంపాయించుకుంటాం. జీవితంలో ఆనందంగా వుండేందుకు ఖర్చు పెట్టుకుంటాం శాంతీ! మనకోసం మనం జీవిస్తాంగానీ, జీవితం కోసం జీవించం. అదే నా పాలసీ శాంతీ! ముందు జాగ్రత్త కోసమని వర్తమానాన్ని నికృష్టం చేసుకోవడం నా ఆశయం కాదు. భవిష్యత్తు మీద నాకు విశ్వాస ముంది. ఆ విశ్వాసం లేనివాళ్లు వర్తమానంలో కోర్కెల్ని చంపుకొని, ఏ అనుభవమూ లేకుండా, ఏ సర్దానీ తీర్చుకోకుండా — కేవలం డబ్బును గడించడమే జీవితధ్యేయంగా వ్యవహరిస్తూ వుంటారు. అది నా పద్ధతి కాదని ఎన్నోసార్లు చెప్పాను శాంతీ!"

"అది కాదండీ! మన చుట్టూ వున్న సమాజం తీరుతెన్నుల్నిబట్టి మనం నడుచుకోవాలి. భవిష్యత్తుమీద విశ్వాసం వుండనక్కర్లేదనడంలేదు. కాని ఎప్పుడో వర్షం కురుస్తుందని మన కుండలో నీళ్లు పారబోసుకుంటామా? మన జాగ్రత్తలో మనం వుండాలి. వందరూపాయలు సంపాయిస్తే, ఎనభై రూపాయలు కర్చుచేసుకొని — ఇరవై రూపాయలైనా మిగుల్చుకోవద్దూ!"

"ఈ ఎకనామిక్స్ నాకు తెలియకకాదు శాంతీ!"

"తెలిస్తే, వందరరూపాయల సంపాదనకు వందరూపాయలు ఖర్చుపెడతారా!"

"అరె! అప్పుడే సెవన్ ఫార్టీఫైవ్! ఇప్పుడు నీతో వాదించే టైం నాకు లేదుగానీ, శాంతీ! ఐయామ్ గో యి ం గ్! అయిదుంబావుకల్లా వస్తాను. రెడీగా వుండు. ఈ లోపల టికెట్స్ బుక్ చేయించి, ఫోన్ చేస్తాలే!" అంటూ గబగబా స్కూటర్ దగ్గరకు వెళ్లాడు రాంమ్మోహన్.

గేటుదాకా వచ్చింది శాంతి. భర్త ఆఫీసుకు వెళుతూంటే రోజూ గేటుదాకా వచ్చి చిరునవ్వుతో పంపించడం, ఆ ఫీ సు ను ం చి సాయంత్రాలు వస్తూంటే గేటు ముందు నిలబడి చిరునవ్వుతో ఆహ్వానించడం ఆమెకు అలవాటు.

ఉదయపు ఎండ తీక్షణంగా పడుతోంది. ఆ ఎండకు గార్డెన్‌లోని పువ్వులన్నీ హుషారుగా తలలు ఆడిస్తున్నాయి.

రాంమ్మోహన్ స్కూటర్ స్టార్టుచేసి, ఎక్కి కూర్చుని, ముప్ఫై సెకండ్లలోనే మూడు గేర్లు మార్చి నలభై కిలోమీటర్ల స్పీడును అందుకున్నాడు.

"జాగ్రత్త! అంత స్పీడుగా వెళ్లకండి!" శాంతి కేకలువేసింది. కాని, ఆఫీసుకు లేటు అయిందనుకుంటూ అంత స్పీడులో వెళ్ళే రాంమ్మోహన్‌కు భార్య కేకలు గాలిలో కలిసిపోక, నిజంగా చెవులకు సోకుతాయా?

సాయంత్రం అయిదు గంటలనుంచీ వరండాలో నిలబడి శాంతీ, నీలిమా తీవ్రంగా ఎదురు చూస్తూనే ఉన్నారు — రాంమ్మోహన్ కోసం.

అయిదున్నరైంది.

రాంమ్మోహన్ స్కూటర్ కనుచూపుదూరంలో వస్తూన్నట్టు జాడ ఏమీ లేదు.

శాంతికి ఏమీ అర్థం కావడంలేదు.

"మమ్మీ!... ఇంకా డాడీ రాలేదేం?" అంటోంది నీలిమ ప్రతి అయిదు నిముషాలకీ ఓసారి.

"వస్తారమ్మా!... వచ్చే వేళైంది" సమాధానం చెబుతోంది శాంతి.

సాయంత్రం మూడున్నర ప్రాంతాల్లో కూడా రాంమ్మోహన్ ఇంటికి ఫోన్ చేసి ఉన్నాడు — టిక్కెట్లు తెప్పించాననీ, అయిదుంబావుకు ఠంచన్‌గా వస్తాననీ, సినిమాకు రెడీగా వుండమనీ, వంట ప్రయత్నం ఏమీ చేయవద్దనీ, సినిమా కాగానే 'నాన్‌కింగ్‌కు వెడదామనీ' తాను సరే నన్నది. కాని ఇంకా ఆయన ఎందుకు రాలేదో!... ఇచ్చిన అపాయింట్‌మెంట్‌ను ఎప్పుడూ అతిక్రమించే వ్యక్తి కాదు. టైమింగ్స్ ప్రకారం నడిచే మనిషి. ఆఫీసుక్కూడా అంతే! ఎన్ని పనులున్నా వేళకు తప్పకుండా వెళతారు. ఆలస్యమైతే ఫోన్ చేసి సెలవు పెడతారు గానీ — అరగంట కూడా పర్మిషన్ అడిగి తీసికోరు.

... ఏమిటో ఆయన తత్వం మరీ విపరీతంగా వుంటోంది! తాను చెవిని ఇల్లుగా కట్టుకొనిపోరినా వినిపించుకోరు. సంపాయించిందంతా ఖర్చు పెట్టుకొని, వర్తమాన సౌఖ్యాల్ని, సరదాల్ని అనుభవించాలంటారు. ఆయన నిఘంటువులో 'రేపు' అనేదానికి అర్థం లేదు. 'నిన్న' అనేదాని ప్రసక్తే వొద్దంటారు. 'నేడు' అనేదాన్ని గురించే ఆలోచించాలంటారు. వెడ్డింగ్ యానివర్సరీకి అంతమంది ఫ్రెండ్స్‌ను పిలవడం దేనికి? అంత గ్రాండ్‌గా చేయడం దేనికి? అంత ఖర్చు పెట్టడం దేనికి? ఏటా వచ్చేదే గదా! తాను ఎంత మొత్తుకున్నా లాభం లేదు. ఆయన మతమే మతం! ఆయిన పాలసీయే పాలసీ! జీవితాన్ని, ప్రపంచాన్ని, డబ్బును అంత తేలిగ్గా తీసుకోరాదు!

.. తమ జీవితాలు వేరు. తాము ప్రేమించి పెళ్లి చేసుకొని, తమ చుట్టూ ఉన్న సమాజపు కట్టుబాట్లను ధిక్కరించి, అయినవాళ్లకు దూరమై అన్నివిధాలా స్వతంత్రంగా బ్రతుకుతున్నారు. తమకు స్నేహితుల అండేగానీ, బంధువుల అండగానీ, ఆర్థికమైన బలంగానీ లేవు. ఆయనకు తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోయారు. తనకి తండ్రీ, అన్నయ్యా ఉన్నప్పటికీ, రామ్‌ను ప్రేమించి, వాళ్ల అభిప్రాయాలకు వ్యతిరేకంగా, వాళ్ల అభిమానాల్ని ఖాతరు చేయకుండా, ఇంట్లోంచి లేచివొచ్చి పెళ్లి

జరిగిన కథ I : ప్రేమించి పెళ్లి చేసుకున్న రాంమ్మోహన్, శాంతిల అనురాగ ఫలం నీలిమ. ఎంతో వైభవంగా ఏడవ వెడ్డింగ్ యానివర్సరీ జరుపుకుంటారు.

చేసుకోవడంతో – వాళ్ల ఆదరాభిమానాలకు తాను శాశ్వతంగా దూరమైంది. అందుకు తాను ఎప్పుడూ విచారించలేదు; విచారించబోవడం లేదు కూడా.

... తామిద్దరూ ప్రేమాభిమానాలతో, అన్యోన్యంగా జీవితకాలమంతా ఇట్లా వుంటే చాలు! అంతకంటె తాను కోరుకునేదేముంది? తండ్రిని ఎదిరించింది; అన్నయ్యను ఎదిరించింది; బంధువుల్ని ఎదిరించింది; సమాజాన్ని ఎదిరించింది. ఎందుకోసం? రావ్‌కోసం. రావ్‌ను ప్రేమించి, ఆ ప్రేమకోసం అయినవాళ్ళను వొదులుకుంది. ఎవరితో చెప్పకుండా యింట్లోంచి అర్ధరాత్రి లేచి వొచ్చి, పుట్టినింటికి ఎంతో అపఖ్యాతి తెచ్చింది. వర్ణాంతర వివాహానికి కూడా తాను వెనుకాడలేదు. నిర్మలమైన ప్రేమకు కులాలూ, మతాలూ, ఆచారాలూ, కలిమిలేములూ అడ్డురావనేదాంట్లో తనకు నమ్మకముంది. అందుచేతనే తాను ధైర్యంగా ఎంచుకొన్న మార్గాన్ని తొక్కింది. ఆ మార్గంలో ఎన్ని గతుకులున్నా, గోతులున్నా, ముళ్ళున్నా – పయనించడానికి కృతనిశ్చయురాలైంది. తనపట్ల రావ్‌కు కూడా గాఢాతిగాఢమైన ప్రేమాభిమానాలున్నాయి. అప్పుడప్పుడూ అంటూవుంటాడు; 'నామీద పెంచుకున్న ప్రేమకోసం అయినవాళ్లందరికీ దూరమయ్యావు శాంతీ! ఈ రోజుల్లో ఏ స్త్రీ చేయని సాహసమూ, త్యాగమూ చేశావు. నాకోసం లక్షరూపాయల ఆస్తిని వొదులుకున్నావు. కని పెంచిన తండ్రిని కాదన్నావు. తోడబుట్టినవాడి మాట పెడచెవిన బెట్టావు. కులాన్ని లక్ష్యపెట్టలేదు. నామీద నీకు గల ప్రేమా, విశ్వాసమూ అంత తెగింపుకు దోహదం చేశాయి. అలాంటి నిన్ను జీవితాంతమూ సుఖపెట్టడం, ఆరాధించడం నా ధర్మమూ, కర్తవ్యమూ శాంతీ!''

...కాని ఆయన జీవిత దృక్పథమూ, జీవించడం పట్ల ఆయనకున్న అభిప్రాయాలూ తనకు నచ్చలేదు ... మనిషికి ముందుచూపు తక్కువ. మంచితనం ఎక్కువ. సంపాయించినదాన్ని ఖర్చు పెట్టడంలో ఆనందం జాస్తి. చీమల్లాంటి జీవులు కూడా వానాకాలానికి కూడబెట్టుకుంటాయి. ముందుకాలంకోసం యిప్పట్నుంచీ కూడబెట్టడమనేది ఆయన నైజంలో ఏ కోశానా లేదు. తాను ఎంత చెప్పినా అర్థం చేసుకోరు. వినరు. 'సంపాయిస్తున్నాం; ఖర్చుపెడుతున్నాం! అదే జీవితం!' అంటారు. ఆ ధోరణే తనని అంతకంతకూ ఆదుర్దా పెడుతోంది ...

''మమ్మీ! మమ్మీ! ఇంకా డాడీ రాలేదేం!... ఇవాళ రాడా!'' అంది నీలిమ బుంగమూతిపెట్టి.

''ఛీ. అవేం మాటలే! వస్తారు. ఆఫీసులో అర్జంటుగా ఏమైనా పనివుండి ఆగిపోయారేమో!'' అన్నది శాంతి ఆలోచించడం మాని.

''మరి సినిమా టైం అయిపోతోందిగా.''

''అయిపోనీ! రెండోఆటకు పోదాం.''

''నాకు నిద్రొస్తుందిగా.''

''పోనీ రేపెడదాం.''

''ఉహూఁ! ఇవాళే చూడాలి సినిమా.''

''అయితే డాడీ వచ్చేదాకా నోరుమూసుకు కూర్చో!'' అన్నది శాంతి విసుగ్గా.



ఆరైంది.

శాంతిలో ఆదుర్దా ఎక్కువైంది. ఆయన ఇంకా రాలేదేం! ఎవరైనా మిత్రులు కలిస్తే ఎక్కడికైనా వెళ్లారా? ఆఫీసులో పనివుండి ఆగిపోయారా? ఆలస్యమైతే ఫోన్ చేసేవారేనే! ... శాంతి మనస్సులో పలు ఆలోచనలు చోటు చేసుకున్నాయి. ఏమీ తోచక వెంటనే ఆఫీసుకు ఫోన్ చేసింది.

''హల్లో ... రాంమ్మోహన్‌గారు వున్నారా?''

''లేరండీ! అయిదింటికే ఆఫీసునుంచి వెళ్లిపోయారు.'' అవతలనుంచి జవాబు.

ఫోన్ పెట్టేసింది శాంతి.

అయిదింటికి ఆఫీసునుంచి బయలుదేరితే – యిప్పటిదాకా యింటికి రాకుండా ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు? ఈ ప్రోగ్రాం విషయం మర్చిపోయి ఎవరైనా ఫ్రెండ్స్ యింటికి వెళ్ళారా? అలా వెళ్ళరే! పొద్దున ఆఫీసుకు వెళ్ళేటప్పుడు చెప్పారు; మూడున్నరకు ఫోన్‌చేశారు; – ప్రోగ్రాం సంగతి మర్చిపోవటానికి వీల్లేదు. మరెక్కడకు వెళ్ళినట్టు!

''మమ్మీ! ... మమ్మీ!''

''అబ్బా! మధ్యలో నీగోల వొకటి'' విసుక్కుంది శాంతి.

నీలిమ అలిగి, మొహం బుల్లి చెంచాంత చేసుకొని, గబగబా సోఫాలోకి వెళ్ళి పడుకొంది.

అంతలో ఓ ఎంబాసిడర్ కారు వచ్చి యింటి ముందు ఆగింది. ఒకవేళ కారులో ఆయన వొచ్చాడేమోనని ఆశపడింది శాంతి. కాని అందులోంచి రాజారాం దిగి, చిరునవ్వు నవ్వుకొంటూ ఇంట్లోకి వచ్చాడు.

ఈ పీడ తగలడిందేమిటి? అనుకుంది శాంతి మొహం చిట్లించుకొని.

''రాంమ్మోహన్‌గారు ఇంట్లో లేరా?'' అన్నాడు రాజారాం సోఫాలో కూర్చుని.

''ఇంకా ఆఫీసు నుంచి రాలేదు'' అంది శాంతి.

''వచ్చే వేళ అయినట్టుంది.''

''ఊఁ!''

''ఏదో పనిమీద నిన్న వొచ్చాను హైద్రాబాద్ కొంతమంది మిత్రులతో కలిసి. మినిస్టర్‌గారితో పని. ఇవాళ అయిపోయింది. రాత్రికి మా వూరు వెళ్లిపోతున్నాను. వూరికే చూద్దామని వచ్చాను. పని ఏమీ లేదు. కాస్త మంచినీళ్ళు ఇవ్వు శాంతీ! కాఫీ, గీఫీ ఏమీ వొద్దు'' అన్నాడు రాజారాం లాల్చీ జేబులోంచి త్రీ ఫైవ్స్ పాకెట్ తీసి, ఓ సిగిరెట్టు వెలిగిస్తూ.

గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది శాంతి.

ఆమె మనస్సంతా అల్లకల్లోలంగా ఉంది. అటు భర్త రాలేదు. ఏమైందో, ఏమిటో! ఇటు రాజారాం వచ్చాడు హఠాత్తుగా. ఎంతసేపు కూర్చుంటాడో, ఏమిటో! ఎప్పుడొచ్చినా రావ్ ఇంట్లో లేనప్పుడే వస్తాడు. గతంలో రెండు మూడు సార్లు కూడా అలానే వచ్చాడు. ఏదో యోగక్షేమాలు అడుగుతూ, పిచ్చాపాటీ మాట్లాడి పోతాడు.

శాంతి మేనత్త కొడుకే రాజారాం. చదువు

మెట్రిక్యులేషన్ వరకేగానీ, ఆస్తి బోలెడంత ఉంది. ఇరవై ఎకరాల మాగాణి భూమీ, అయిదెకరాల మెట్ట భూమీ ఉన్నాయి. అదీగాక వాళ్ల నాన్న పట్టీ వ్యాపారం మీద ఓ లక్ష రూపాయల నగదు చేసి ఇచ్చి వెళ్లాడు. తండ్రి అకాలమరణంతో రాజారాంకి పాతికేళ్లకే ఇంటి పెత్తనం వచ్చింది. జల్సా పురుషుడు. ఊళ్లో ఒక ముఠాకు నాయకుడు ఎప్పుడూ పదిమంది బలగం వెంట వుంటూ వుంటుంది. అతనికి శాంతిని యిస్తే, మేనరికం చేసుకున్నట్టు అవుతుందనీ, బోలెడు ఆస్తితో అమ్మాయి సుఖపడుతుందనీ శాంతి తండ్రి దశరథరామయ్య ఆలోచన. శాంతి అన్నయ్య సుబ్బారావు అభిమతం కూడా అదే! పై పెచ్చు ఊళ్లో అయినవాళ్ల అండ పెరుగుతుంది. కాని ఆ పెళ్లికి శాంతి ఒప్పుకోలేదు. తాను ప్రేమించిన యువకుడ్ని పెళ్లి చేసుకుంటానని గంట మ్రోగించి చెప్పింది. శతవిధాలా వాదించింది. మంకుపట్టు పట్టింది. కాని వాళ్లు వినలేదు. నయాన చెప్పి చూశారు. లాభం లేకపోయేసరికి, బలవంతాన ఆమెను రాజారాంకు ముడి పెడదామని పన్నాగం పన్నేసరికి, ఆ విషయాన్ని శాంతి ముందుగానే గ్రహించినదై, అర్ధ రాత్రిన కట్టుబట్టలతో లేచి వెళ్లింది. ఆ తర్వాత ఆమెను వెతికించడానికి దశరథరామయ్య ప్రయత్నాలేమీ చేయలేదు. "ఇంటిదనాన్ని మంట గల్పి, స్వార్థాన్ని చూసుకొని అది వెళ్లిపోయింది. అది మళ్లీ నా ఇంటి గడప తొక్కే పనిలేదు నా ఆస్తిలో చిల్లిగవ్వ దానికి దక్కనివ్వను. దాని ముఖం నేను బ్రతికున్నంత కాలమూ చూడను." అన్నాడు దశరథరామయ్య ప్రతిజ్ఞా పూర్వకంగా.

శాంతి తల్లి శాంతికి పదో సంవత్సరం రాగానే చనిపోయింది క్యాన్సర్ వచ్చి.

శాంతిని భార్యగా పొందాలనేది అప్పుడు రాజారాంకు జీవితాశయంగా ఉండేది. ఆ ఆశయం నెరవేరలేదు. అయినా ఆమెమీద తనకున్న ప్రగాఢమైన ప్రేమాభిమానాలను చంపుకోలేకనో, తనని కాదని కులంతక్కువవాడ్ని చేసుకొని తన గుండెలో రంపపుకోతను కలిగించిందన్న కోపాన్ని మనస్సులో పెట్టుకొనో, పగ తీర్చుకోవాలనే ప్రతీకార వాంఛతోనో తరుచూ రాజారాం ఆమె యింటికి వస్తూనే వుంటాడు. అయితే అతను ఏ ఉద్దేశంతో తన యింటికి యింకా ఎందుకు వస్తున్నాడో, తన కుటుంబంతో పరిచయాన్ని పెంచుకోవాలని ఎందుకు తహతహలాడుతున్నాడో శాంతి కచ్చితంగా గ్రహించ లేదు. ఏమైనా అతని రాకపోకల్లో ఏదో కొంత దురుద్దేశం లేకపోలేదని మాత్రం శాంతి గ్రహించక పోలేదు. అందుచేతనే అతను ఎప్పుడు యింటికి వచ్చినా ముభావంగా, ముక్తసరిగా, పట్టీపట్ట నట్టు వుంటుంది శాంతి.

"పాపా! యిలారా అమ్మా!" రాజారాం ఆప్యాయంగా నీలిమను పిల్చాడు.

కాని నీలిమ మొహం పక్కకు తిప్పుకుంది. సినిమా ప్రోగ్రాం చెడిపోయినందుకు ఆ పిల్లకు ఉక్రోషంగా వుంది.

కొన్ని నిముషాలపాటు నిశ్శబ్దంగా గడిచింది.

కాని శాంతి మనస్సులో 'రామ్ ఇంకా రాలేదే!' అన్న ఆందోళన తీవ్రాతి తీవ్రంగానే వుంది. ఆమె ధ్యాసంతా అతని రాకమీదనే కేంద్రీకృతమై వుంది. అయినా యింటికొచ్చిన వ్యక్తిని బెల్లపు రాయిలాగ కూర్చోబెట్టడం మర్యాదకాదనే ఉద్దేశంతో–

"మా నాన్నా, అన్నయ్యా కులాసాగా వున్నారా ?" అంది శాంతి. తన పూరివాళ్ళు ఎవరు తటస్థపడ్డా, వారి యోగక్షేమాన్ని అడిగి తెల్సు కుంటూ వుంటుంది.

"లేకేం! గుండ్రాళ్లా వున్నారు. ఏమైనా నువ్వు అభిమానంకొద్దీ వాళ్ళ బాగోగులు అడుగుతూ వుంటావుగానీ శాంతీ, నీమీద మీ నాన్నకూ, అన్నయ్యకూ ఇసుమంతకూడా లేదు. నువ్వు చని పోయినట్లే వాళ్ళు మాటాడుతూవుంటారు శాంతీ!" అన్నాడు రాజారాం.

"అది నా దురదృష్టం!" అంది శాంతి.

"మీ అమ్మేగనక బ్రతికివుంటే, ఒక్కసారైనా నీ యింటికి రాకుండా వుండేదా ?"

శాంతి మాట్లాడలేదు.

"నువ్వు యిలా లేచివొచ్చి, రామ్మోహన్‌ను పెళ్లి చేసుకోవడంవల్ల ఒకరకంగా మీ అన్నయ్యకు మంచిదే అయింది."

శాంతి మౌనంగా వుంది.

"ఎందుకంటే, నీకు రావాల్సిన భాగంకూడా మీ అన్నయ్యకే దక్కింది. ఎల్లాలేదన్నా లక్ష రూపాయలు నీకు కట్నంగా ముట్టవల్సివుంది. ఆ ఆస్తి నంతా మీ అన్నయ్యే అనుభవిస్తున్నాడు. మీ అమ్మ నగలు బోలెడన్ని వున్నాయి. దాదాపు యాభై తులాలు బంగారం. వాటి విలువ యీ రోజుల్లో ఎట్లాలేదన్నా పాతికవేల రూపాయలు. ఏమంటావ్ శాంతీ ?"

శాంతి ఏమీ అనలేదు అసలు అతను దేన్ని గురించి మాట్లాడుతున్నాడో కూడా ఆమెకు ధ్యాస లేదు. ఆమె మనస్సంతా 'రామ్ ఇంకా రాలేదేం ?' అనే ప్రశ్నకు జవాబు దొరక్క గజిబిజిగా వుంది. మనస్సు ఏమాత్రం బావుండలేదు.

తాను ఎంత మాట్లాడినా శాంతి నుంచి ఏ రకమైన సమాధానాలు లేకపోయేసరికి రాజారాం మనస్సు చివుక్కు మన్నది. ఒకపట్ల శాంతి ప్రవర్తన కొత్త కాదు అతనికి. ఎప్పుడొచ్చినా ఆమె ముభావంగానే, ఇష్టంలేని అతిథి ఎదుట ముళ్లమీద కూర్చున్నట్టుగానే వుంటుంది. అది రాజారాం గ్రహించకపోలేదు. అయినా తరుచూ ఆమె దగ్గరకు వచ్చి పోతూనే వుంటాడు. ఏదో మాట్లాడుతూనే వుంటాడు.

"సరే! వస్తాను శాంతీ! అవతల అర్జంటు పనుంది. నేను ఎప్పుడొచ్చినా రామ్మోహన్ ఇంట్లో వుండడు" అంటూ లేచాడు రాజారాం.

దానిక్కూడా శాంతి నోరు విప్పలేదు.

ఆరున్నరైంది.

శాంతిలో ఆందోళనా, భయమూ జాస్తి కాజొచ్చినాయి. ఆయన ఇంకా ఎందుకు రాలేదు ? ఎక్కడి కెళ్లారు ? లేటు అయితే కనీసం ఫోన్ అయినా చేసేవారే! తాను వేసిన ప్రోగ్రాంకు ఎట్టి పరిస్థితుల్లోనైనా అందుకొనేవారే! ఇలాంటిది ఎప్పుడూ జరగలేదు. నిముష నిముషానికీ శాంతి మనస్సు పలు ఆలోచనలతో, ఆందోళనతో, భయాలతో బరువెక్కసాగింది.

హఠాత్తుగా ఫోన్ మోగింది.

వెంటనే రిసీవర్ తీసుకొంది శాంతి.

3

"హల్లో !..."

"హల్లో !..."

"రామ్మోహన్‌గారి ఇల్లేనా అది !"

"అవును. ఎవరూ మాట్లాడేది ?"

"మీ రెవరు ?"


"శాంతిని. వారి మిసెస్‌ను."

"నేను హౌస్ సర్జన్‌ను. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నుంచి మాట్లాడుతున్నాను..."

"ఆఁ!... ఏమైంది ?" శాంతి గుండె గొంతులోకి వచ్చింది భయోత్పాతంతో.

"రామ్మోహన్‌గారికి లకిడీకాపూల్ దగ్గర యాక్సిడెంట్ అయింది. వారి స్కూటర్ మీదుగా లారీ పోయింది."

ఫోన్‌ను అలానే చేతిలో వొదిలేసి కుర్చీలో కూలబడిపోయింది శాంతి. సీలింగ్ ఫ్యాన్ వూడి



తలమీద పడినట్లయింది. మెదడంతా బండబారి పోయింది.

మూడు నిముషాల తర్వాతగానీ ఆమెకు స్పృహ రాలేదు. కళ్లవెంట నీళ్ళు బొటబొట కారినయ్. వొళ్లంతా దుఃఖోద్వేగంతో చల్లబడిపోయింది. ఇంకా ఆ షాక్ చిహ్నలు మస్తిష్కంలో పని చేస్తూనే ఉన్నాయి. అయినా ఆమె గుండె రాయి చేసుకుంది. ధైర్యాన్ని నిలదొక్కుకుంది. ఎదురుగ్గా శ్రీ వేంకటేశ్వరస్వామివారి చిత్రపటం ముందు మోకరిల్లింది. "స్వామీ! మా వారిని బ్రతికించు. నా ఆత్మజ్యోతిని ఆర్పివేయకు. నా ప్రాణాన్ని నిలబెట్టు. ఈ ప్రమాదాన్నుంచి వారిని కాపాడు. నన్ను అన్యాయం చేయకు..." పరిపరి విధాలా వేడుకుంది. పిచ్చి ఆవేశంతో, మొండి ధైర్యంతో చివుక్కున లేచి, నీలిమను పక్కింట్లో వొదిలి, ఆటోరిక్షాలో ఉస్మానియా జనరల్ హాస్పటల్‌కు వెళ్లింది శాంతి.

నెత్తురు మరకల కట్లతో, ఆనవాలు పట్టడానికి వీలులేని స్థితిలో వున్న భర్తను చూసి మరోసారి మూర్ఛబోయింది శాంతి. అక్కడున్న డాక్టర్లు ప్రథమచికిత్స చేసి, పది నిముషాల్లో ఆమెకు స్పృహ వచ్చేటట్లు చేశారు. ఆమెను వేరే గదిలో వుంచారు. అరగంట తర్వాత పెద్దడాక్టరు ఆమె దగ్గరకు వచ్చాడు.

"తల్లీ! నువ్వు నా కూతురులాంటిదానివి. నీకు జరిగిన అన్యాయానికి ఆ భగవంతుడే దిగివచ్చి, ఓదార్చాలిగానీ మాలాంటి ఓదార్పులు ఏపాటివి? జీవితమే ఒక యాక్సిడెంట్ తల్లీ! ఏ క్షణంలో ఏం జరుగుతుందో చెప్పలేము. ఇప్పుడు నీతో మాట్లాడుతూన్న నేను, యింత ఆరోగ్యంగా కనబడుతూన్న నేను మరో నిముషంలోనే హార్ట్ ఎటాక్ వచ్చి గుటుక్కుమనవచ్చు. అందుకే మానవుని బ్రతుకును మనవాళ్ళు నీటిబుడగతో పోల్చుతారు..."

రెప్పలువాలని చూపుతో శాంతి అయోమయంగా, నిశ్చలంగా చూస్తూవుంది. ఆమె వింటూన్నదో, ఆ మాటలు గదిలోని గాలిలో కల్సిపోతున్నాయో చెప్పడం కష్టం.

"మీ ఆయనకు ప్రాణాపాయం ఏమీలేదు. నేను గారంటీ ఇస్తున్నానమ్మా!"

"నిజంగానా డాక్టర్!" కేకవేసింది శాంతి.

"అవునమ్మా! నూటికి నూరుపాళ్ళూ నిజమే! కూతురులాంటిదానివి. నీతో నేను అబద్ధమాడతానా?"

"డాక్టర్! నిజంగా మీరు నాపాలిట దేవుళ్ళే! నాక్కావాల్సింది ఆయన బ్రతకడమే! ఆయన బ్రతికితే చాలు. నేనూ బ్రతికినట్టే! ఎంత చల్లని మాట చెప్పారు డాక్టర్. వచ్చే జన్మలో మీ కూతుర్ను అయి పుట్టి, ఈ ఋణం తీర్చుకుంటాను" అంది శాంతి ఆవేశంగా.

"అయితే!"

"అయితే! —"

"ఒక చిన్న యిబ్బంది వుందమ్మా?"

శాంతి గుండె ఒక్కసారిగా బరువెక్కింది. ఆమె మొహంలో వెంటనే వెలుగు పోయి, చీకట్లు కమ్ముకున్నాయి.

"ఏమిటండీ!"

"నీ భర్త బ్రతకాలంటే ఆపరేషన్ చేయాల్సి వుంటుందమ్మా! అది వెంటనే చేయాలి. ఆలస్యం చేస్తే ప్రాణానికే అపాయం ఏర్పడవచ్చు."

"ఆపరేషనా?"

"అవునమ్మా! తప్పదు. అందుకు నీ అంగీకారం కావాలి. ఆయన తన అంగీకారాన్ని తెలిపే స్థితిలో లేడు."

"ఆపరేషన్ ఎందుకు?"

"ఒక కాలికీ, ఒక చేతికీ బలంగా గాయాలు తగిలాయమ్మా! అవి రెండూ నజ్జు నజ్జు అయిపోయాయి. వాటిని తొలగిస్తేగానీ—"

"ఆఁ!..." షాక్ తిన్నది శాంతి.

"మన చేతుల్లో ఏమీలేదు తల్లీ! విధి చేతుల్లో కీలుబొమ్మలం. అది ఎలా ఆడిస్తే, అలా ఆడేవాళ్ళమేగానీ — ఎదురుతిరిగి, మన ఇష్టానిష్టాల ప్రకారం అదృష్టాన్ని, జీవన విధానాన్ని మలుచుకోలేం తల్లీ!... డాక్టర్లు ఒక్కొక్కప్పుడు దేవుళ్లలాగ కనబడతారు; మరొకప్పుడు రాక్షసుల్లా అగపడతారు. ఏమైనా డాక్టర్లు తమ కర్తవ్యాన్ని నెరవేర్చక తప్పదు. పేషెంట్ ప్రాణాన్ని కాపాడడం కనీస ధర్మం. ఏమంటావు తల్లీ!... ఆపరేషన్ చేయమంటావా?"

నిను చూసి....

నవ్వు నెఱుగని నా మది
నిను చూసి నవ్వింది

పాట ఎఱుగని నా గొంతు
నిను చూసి పాడింది

ఆగిపోయిన నా గుండె
నిను చూసి కదిలింది

కలత చెందిన నా కనులు
నిను చూసి మెరిశాయి

ఆశ లేని నాలోన
ఆశ మొలకెత్తింది

అలసిపోయిన బ్రతుకు
ఉఱక లేసింది.

— ఎ. జ్ఞానేశ్వర్‌రావు

శాంతి అచేతనంగా కూర్చుండిపోయింది. ఒక కాలూ, చేయీ లేని రామ్ ఆమె కళ్లముందు మెదిలాడు. రెండు చేతులతో గట్టిగా కళ్లు మూసుకుంది... జీవితాంతం రామ్ అవిటివాడుగా ఉండలేడు! జీవితాన్ని కులాసాగా, ఆనందంగా, జాలీగా గడపాలనే రామ్ ఒక కాలూ, చేయీ లేకుండా కలకాలం ఇంట్లో వుండగలడా! ఇంపాసిబుల్! రామ్ ఒప్పుకోడు. అంతకంటె మరణమే మేలంటాడు. అవిటివాడైతే ఉద్యోగం చేయలేడు; టెన్నిస్ ఆడలేడు; ఏ పనీ చేయలేడు; ఎందుకూ పనికిరాడు. అలాంటి బ్రతుకును రామ్ బ్రతకలేడు. కోరుకోడు. అయితే... ఆపరేషన్ చేయకపోతే రామ్ బ్రతకడు. రామ్ బ్రతక్కపోతే తాను బ్రతకలేదు. భగవంతుడా! ఎలాంటి అగ్నిపరీక్ష పెట్టావు? ఏం చేసేది?...

ఏమైనా రామ్ బ్రతకాలి! రామ్ బ్రతికితే చాలు! అవిటివాడైనా, నిరుద్యోగియైనా, ఎల్లకాలం ఇంట్లో కూర్చున్నా, ఏ పనీ చేయడానికి అశక్తుడైనా — రామ్ బ్రతికితే చాలు! జీవితాంతమూ అతన్ని తాను పోషించగలదు. ఏ లోటూ లేకుండా తాను చూసుకోగలదు. సాధ్యమైనంతమేరకు సంతోషంగా వుండేట్టు చూడగలదు. ఆయన బ్రతకడం ముఖ్యం.

"ఏమంటావమ్మా!... త్వరగా నిర్ణయం తీసుకోవాలి. ఆలోచించటానికి ఎక్కువ వ్యవధి లేదు." అన్నాడు మళ్లీ పెద్ద డాక్టరు.

శాంతి ఓ నిర్ణయానికి వచ్చింది గుండె ధైర్యంతో.

"ఆపరేషన్ చేయండి డాక్టర్! ఆయన్ను బ్రతికించండి." చూస్తూ చూస్తూ తన భర్త ప్రాణాల్ని పోవడానికి ఏ భార్య ఒప్పుకోంటుంది? తన నుదుట కుంకుమను ఏ భార్య తన చేతులతో తుడిచివేసుకోంటుంది? తన మెడలోని మంగళసూత్రాన్ని ఏ భార్య తనకు తానుగా తెంపుకోంటుంది?

వెంటనే ఆ రాత్రే రాంమ్మోహన్‌కు ఆపరేషన్ చేశారు. ఒక కాలూ, ఒక చేయీ తీసివేయడం జరిగింది.

ఒక కాలూ, ఒక చేయీ లేని అవిటివాడై, అశక్తుడై ఒక నెలరోజుల పిమ్మట యింటికొచ్చాడు రాంమ్మోహన్.

ఈ విషయం తెలిసి ఓరోజు మధ్యాహ్నం రాజారాం ఇంటికొచ్చాడు సానుభూతి తెలిపేందుకు. ముసలి కన్నీళ్ళు కార్చాడు.

"ఈ శిక్షను భగవంతుడు ఎందుకు విధించాడో తెలియదు. మీ యిరువురి అన్యోన్య దాంపత్యం చూసి భగవంతుడికికూడా కన్నుకుట్టివుంటుంది. అందుకే ఈ అనర్థాన్ని తెచ్చిపెట్టాడు. అయినా మన చేతుల్లో ఏముంది రాంమ్మోహన్! ఇటువంటి పరిస్థితుల్లోనే ధైర్యంగా వుండాలి. కష్టాల్ని ఎదుర్కోవాలి. ఓపికపట్టాలి. మంచిరోజులు రాకపోవు. ఆ భగవంతుడే తోడ్పడతాడు. మీకు సహాయం చేయడానికి నేనెప్పుడూ సిద్ధంగా వుంటాను రాంమ్మోహన్. దుఃఖపడకు."

దశరథరామయ్యగానీ, సుబ్బారావుగానీ శాంతికి హఠాత్తుగా ఏర్పడిన దుస్థితిని విని, చూడటానికి రాలేదు. అయితే, వాళ్లు వస్తారని కూడా శాంతి ఎప్పుడూ అనుకోలేదు; పైపెచ్చు వాళ్లు సంతోషించి కూడా వుండొచ్చు. తమ మాట వినకుండా ప్రేమించినవాడి కోసం ఇంటిని వొదిలిపెట్టి వెళ్లింది. కుటుంబ గౌరవాన్ని మంటగల్పింది. తగిన శాస్తి జరిగింది. ఆ భగవంతుడు తగిన శిక్ష విధించాడు దానికి! అనుకొని కూడా వుంటారు వాళ్లు అనుకొంది శాంతి. అయితే తల్లే గనక బ్రతికివుంటే — తనని చూడకుండా వుండగలదా? అనే ఆలోచన కూడా ఆమెకు రాకపోలేదు.

[ఇంకా వుంది]



శ్రీధర్ బెదిరింపు - మంజు భయం

మద్రాస్‌లోని ప్రసాద్ స్టుడియోలో ఒక ఫ్లోర్‌లో, నటుడు శ్రీధర్, చేతిలో కొరడా పట్టుకుని నటి మంజుభార్గవిని బెదిరిస్తున్నాడు. చెయ్యకూడని పెద్ద నేరమేదో చేసినట్టుంది మంజుభార్గవి. అందుకే "నిజం చెప్పు! ఎందుకు చేశావో ఈ తప్పు? చెప్పకపోయావో చావు తప్పదు" అంటూ కర్కశంగా పలికాడు శ్రీధర్. "నిజం చెప్పి ఆ నీచుడి చేతిలో చావడంకన్నా, నేరం ఒప్పుకుని ధర్మ ప్రభువుల ముందు నిలబడ్డం మంచిది" అంటుంది భార్గవి. దీన్నిబట్టి చూస్తే, బలవంతంగా ఏదో ఒక అజ్ఞాత శక్తి ఒక పెద్ద నేరాన్ని మంజుభార్గవిచేత చేయించినట్టు బోధపడుతుంది మనకు.

చేసిన నేరం చెబితే చేయించిన వ్యక్తి చంపేస్తాడు. చెప్పకపోతే రాజ్యాధికారులు చంపేస్తారు. ఒకవేళ అందుకేనేమో ఇక్కడ మంజుభార్గవి కత్తితో ఆత్మహత్య చేసుకోబోతుంది. కానీ శ్రీధర్ ఆవిడ్ని వారించి, 'నీ ప్రాణాన్ని సంరక్షించుకోవాలంటే, నిన్ను ఈ దుష్కార్యానికి పురికొల్పిందెవరో చెప్పు, నిన్ను మన్నించి వదిలివేస్తాం' అంటాడు భార్గవితో. ఇంతలో కట్ అన్నారు దర్శకుడు కె. ఎస్. ఆర్. దాస్.

సుందరం మూవీస్ పతాకం క్రింద మల్లెమాల సుందరరామిరెడ్డి నిర్మిస్తున్న "దొరలు—దొంగలు" చిత్రంలో న్యాయాన్ని విచారించే ఒక సైనికాధికారిగా శ్రీధర్, నేరం చేసిన ఒక నేరస్తురాలిగా మంజుభార్గవి పై సన్నివేశాల్లో అగుపిస్తారు.

రంగిగా అగ్రనటి, రాణిగా కళాభినేత్రి ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో రామకృష్ణ, రంగనాథ్, నాయకులుగా నటిస్తున్నారు. విజయా విడుదల చేసే ఈ చిత్రానికి కె. ఎస్. ప్రసాద్ ఛాయ, సత్యం సంగీతం, ఏ. కె. శేఖర్ కళ, మల్లెమాల కథను సమకూరుస్తున్నారు.

కాఫీ గుక్కలోకి పాలసుక్క

ఓ గ్రామంలో పాలమ్ముకుని బ్రతుకుతుంటుంది జయప్రద. ఒకనాడు జయప్రద ఇంటికి ఓ బిచ్చగత్తె వస్తుంది. ఆ ముసలిదానికి కాసిని బిచ్చం వేసి పంపిస్తుంది జయప్రద. ముసిల్ది (ఆనందంలో) పిల్లాపాపల్ని గని సుఖంగా వుండమ్మా అని జయప్రదను ఆశీర్వదిస్తుంది. ఈ మాటలు అల్లు రామలింగయ్య చెవిన బడ్డాయి. ఈ చెవితో విని ఆ చెవితో వదిలేసే మనిషి కాదు రామలింగయ్య. జయప్రదను సమీపించి "ఏం బుల్లెమ్మా! ముసల్ది పిల్లల్ని కనమని సెప్పింది? మొగుడు లేకుండా ఎట్టానమ్మా పాడు. ఇదుగో! సందమామలాంటి మొగుడ్ని సూసుకో" అంటాడు అల్లు రామలింగయ్య. "నువ్వు సెప్పలేదనే వూరకున్నాను" అని వ్యంగ్య ధోరణిలో బదులిస్తుంది జయప్రద. మరి అంతటితో ఆపాడా అంటే లేదు. సంభాషణాన్ని ఇలా పొడిగించాడు ఇంకా. "నువ్వూరుకున్నా, వూళ్లో బుల్లోళ్లు వూరుకోనీయరే బుల్లెమ్మా"

"అహా! ఏంచేస్తారేం?" అంటూ మొండిగా పలికింది జయప్రద.

"ముక్కు ట్టుకు లాక్కుపోయి ముద్దెట్టుకుంటారు. నూంచి లగ్గం సూసి మూడు ముళ్లు యేత్తారు. ఏడాది తిరక్కుండానే పిల్లను సంకనెక్కిత్తారు" అంటూ హాస్యంగా పలుకుతాడు రామలింగయ్య.

అంతవరకూ మొండిగా వున్న జయప్రద సిగ్గు ముంచుకు రాగా "ఛిపో" అంటూ బిడియంతో పలుకుతుంది. "సరే పోతాలే! కాఫీగుక్కలో ఇన్ని పాలసుక్క" అంటాడు రామలింగయ్య. ఇంతలో కట్ అన్నారు దర్శకుడు పి. సుబ్రమణ్యం. శ్రీ మాధవీ ఎంటర్ ప్రైజస్‌వారి "మనిషిలో మనిషి" చిత్రంలో పై వ్యంగ్య సంభాషణం వినిపిస్తుంది మనకు. పి. చిన్నపరెడ్డి నిర్మిస్తున్న పై చిత్రంలో రంగనాథ్, ప్రభాకరరెడ్డి, రమాప్రభ మున్నగువారు ప్రధాన పాత్రధారులు.

"విప్లవం క్రిందనుంచీ రావాలేగానీ, పైనుంచీ దిగుమతి అయ్యేది కాదు. ప్రతి మనిషిలో సామాజిక స్పృహ, సామాజిక చైతన్యం కల్గినపుడు అక్కడినుండే విప్లవం ప్రారంభమౌతుంది" అనే సందేశంతో నిర్మింపబడుతున్న చిత్రమే "మనిషిలో మనిషి". ఈ చిత్రానికి పి. సుబ్రమణ్యం దర్శకుడు.

"మనిషిలో మనిషి" చిత్రానికి సంభాషణలు వ్రాసాడొక వ్యక్తి. అతని పేరు శ్రీకాంత్. శ్రీకాంత్ చక్కటి రచనాశైలి చేయగల సమర్థుడు. పాత్రల కనుగుణంగా మాటలను చిత్రించగల వివేకి, "మనిషిలో మనిషి" చిత్రంలోని మాటలను వింటే, ఇతని హై పవర్ ఆఫ్ థింకింగ్ అర్థమౌతోంది. గ్రామీణ వాతావరణానికి సంబంధించిన పాత్రలతో నడిచే పై చిత్రంలో, ఆయా పాత్రలకు సంభాషణలు వ్రాయడంలో శ్రీకాంత్ తన ప్రతిభనంతా చూపెట్టారంటే అతిశయోక్తి కాదు.

ఇటీవల ఈ చిత్రం డబ్బింగ్ అరుణాచలం స్టుడియోలో జరిగింది. ఆరోజు అల్లురామలింగయ్య గారి వాయిస్ డబ్బింగ్ జరుగుతుంది. తెరమీద బొమ్మవేసి అసిస్టెంట్ డైలాగులు చెబుతుంటే, ఎంతో జాగ్రత్తగా విని, ఒక్క మాటకూడా పొల్లుపోకుండా శ్రీకాంత్ వ్రాసిన మాటలను చక్కగా తగురీతిలో ఉచ్చరించారు అల్లురామలింగయ్య. ఈ చిత్రంలో వారిదొక గమ్మత్తైన పాత్ర. చిత్రంలోని ప్రతి పాత్రతో ఈ పాత్రకు సంబంధం వుంటుంది. అంతేగాక తెరపై ఈ పాత్ర కన్పించినపుడల్లా నవ్వు పుట్టుకొస్తుంది. అలాంటి పాత్రకు ఎలాంటి డైలాగులు వ్రాస్తే బాగుంటుందోనని బాగా ఆలోచించి వ్రాసారు మాటలు శ్రీకాంత్. రామలింగయ్య శ్రీకాంత్‌గారి రచనపట్ల ఎంతో ఆనందాన్ని వ్యక్తంచేసి, చాలా బాగా వ్రాసారని నాతో అన్నారు. వారన్న మాటలు నూటికి నూరుపాళ్ళు నిజమే అన్పించింది డబ్బింగ్ చూచినపుడు.

కామెడీ వ్రాయడంలో ప్రత్యేక ఒరవడిని అనుసరించారు శ్రీకాంత్. సర్దుకున్న శ్రీకాంత్ లాంటి సమర్థులను సక్రమంగా ఉపయోగించుకుంటే సంభాషణల నావల్టీ తగ్గదు. క్వాలిటీ అంతకన్న తగ్గదు. "మనిషిలో మనిషి" విడుదలైన తర్వాత అందరూ కాకపోయినా, కొందరైనా నామాట నిజం అనక మానరు. ప్రస్తుతం శ్రీకాంత్ "కొల్లేటి కాపురం" చిత్రంలోని కొన్ని పాటలు, "పూర్ణమ్మ కథ"లో కొన్ని పాటలు వ్రాస్తున్నారు.

"ఎదురులేని మనిషి"లో ఒక దృశ్యం



నవంబరులో వింత ఇల్లు-సంతగోల

రమాప్రభ సమర్పించు కరుణ చిత్ర వారి "వింత ఇల్లు — సంతగోల" చిత్రం అక్టోబరు 20 నాటికి పూర్తవుతుంది. ఇప్పటికి 3 పాటల చిత్రీకరణ కూడా జరిగింది. మిగతా 2 పాటలను కూడా అక్టోబరులో చిత్రీకరించడం జరుగుతుంది. చిత్రాన్ని నవంబరులో విడుదల చేయాలనుకుంటున్నారు నిర్మాత కమలాకరరావు, సహనిర్మాత దయానంద్.

హాస్యం ప్రధాన పాత్రను వహిస్తున్న యీ చిత్రంలో దాదాపు తెలుగు తెర కమెడియన్లు అందరూ ఏదో ఒక వింత పాత్రలో కన్పిస్తారు. విభిన్న ప్రవృత్తులు గల వింత మనుష్యుల మధ్య జీవిత మెలా సాగుతుందనే ప్రశ్నకు ప్రతీకగా నిలుస్తుంది "వింత ఇల్లు - సంత గోల" చిత్రం. ఇందులో ప్రతి ఒక్క నటుడికి ప్రత్యేక తరహా పాత్ర ఇవ్వబడింది. క్యారెక్టర్ యాక్టర్ సత్యనారాయణ వెరైటీ పాత్రలో కన్పిస్తారీ చిత్రంలో. రాజబాబు, రమాప్రభ, శరత్‌బాబు, ప్రభ, చంద్రమోహన్, జయమాలిని, అల్లు రామలింగయ్య, నాగభూషణం, శుభ, నిర్మల, జ్యోతిలక్ష్మి చిత్రంలోని ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు.

లక్ష్మీదీపక్ దర్శకత్వంలో తయారవుతున్న తొలి హాస్యభరిత చిత్రం ఇదే కావొచ్చు. దేవరాజ్ ఛాయ, శంకర్ సంగీతం, అప్పలాచార్య మాటలు, తోట కథ, వెంకటరత్నం కూర్పు, వెంకన్నబాబు ప్రొడక్షన్ నిర్వహణ చేస్తున్న ఈ చిత్రానికి తారకరామా పంపిణీదారులు.

సంగీతం మేష్టారుగా కృష్ణకుమారి

కృష్ణకుమారి ఓ వ్యక్తిని ప్రేమించింది. అతగాడుకూడా ఆమెను గాఢంగా ప్రేమించాడు. కానీ పరిస్థితుల ప్రేరేపణవల్లనో, లేక స్వయంకృతాపరాధం వల్లనో వారిద్దరి జీవితాలమధ్య అగాధమేర్పడుతుంది. ప్రియుడొకచోట, ప్రేయసి ఒకచోట కాలాన్ని గడుపుతుంటారు. కృష్ణను ప్రేమించిన వ్యక్తే మరొక స్త్రీని పెండ్లి చేసుకుంటాడు. కృష్ణకు తన ప్రియుడివల్ల ఒక పుత్రుడు పుడతాడు. అతనే శోభన్‌బాబు. తన బిడ్డడు పెరిగి పెద్దవాడు కావాలనే దీక్షతో సంగీత పాఠాలు నేర్పే ఒక మేష్టారుగా పని చేస్తుంటుంది కృష్ణకుమారి. సంగీతం మూలంగా కృష్ణకుమారికి, మంజులకు పరిచయం ఏర్పడుతుంది. సద్గుణవంతుడు శోభన్ మంజుల మనస్సును ఆకర్షించాడు. తన కళ్ళయెదుట తన కొడుకు, కోడలు పిల్ల (మంజుల) సుఖంగా కాలం గడుపుతుంటే చూచి ఆనందించాలని ఉబలాటపడుతుంది కృష్ణకుమారి. కానీ వూహించనివిధంగా శోభన్ అంతర్ధానమవడంతో కథ అంతా అడ్డం తిరుగుతుంది.

కృష్ణకుమారిని ప్రేమించి, పరిత్యజించిన ఆ వ్యక్తి ఎవరు? ఎందుకలా చేశాడు? మంజుల శోభన్‌ల పెళ్ళి జరిగిందా? ఈ ప్రశ్నలకు సమాధానమే శ్రీ విజయభట్ ప్రొడక్షన్స్‌వారు నిర్మించిన రంగుల చిత్రం "గుణవంతుడు." యస్. యస్. భట్, యస్. యస్. మూర్తిగార్లు నిర్మించిన ఈ చిత్రానికి ఆదుర్తి దర్శకత్వం పెద్ద హైలైట్. మహదేవన్ సంగీతం, సత్యానంద్ మాటలు, కన్నప్ప ఛాయాగ్రహణం, జి. వి. సుబ్బారావు కళ, ఆదుర్తి హరనాథ్ కూర్పు సమకూర్చిన ఈ చిత్రం అక్టోబరులో అన్నపూర్ణ ద్వారా విడుదలౌతుంది.

జమున కూతురుగా హేమ

శ్రీ గౌతమ్ పిక్చర్స్ నిర్మిస్తున్న "ఈకాలం దంపతులు" చిత్రంలో జమున కూతురిగా హేమా చౌదరి నటిస్తోంది. భార్యాభర్తల మధ్య సమరసం, సర్దుబాటులేని కారణంగా, తాళి కట్టిన భర్తకు దూరమైంది జమున. భార్య అంతరంగాన్ని అర్థం చేసుకోలేక అనవసరంగా విడాకులిచ్చి వేదనకు గురి అవుతాడు సత్యనారాయణ. భార్యాభర్తల సంబంధం తాత్కాలికంగా తెగిపోయినా, ఒకనాడు మళ్ళీ ఆ బంధం కలుసుకునే అవకాశం వుందనడానికి నిదర్శనంగా, జమున, సత్యనారాయణలకు పుట్టిన బిడ్డే హేమాచౌదరి. విచిత్రమేమిటంటే హేమ తన కూతురని జమునకు చివరిదాకా తెలియదు. హేమ తన కూతురే అని మధ్యలో తెల్సుకున్న సత్యనారాయణ ఈ నిజాన్ని కూతురుతో చెప్పడు.

తల్లి, తండ్రీ వుండికూడా ఎక్కడో పెరుగుతుంది హేమ. ప్రేమ, భక్తి, గౌరవం అనే సద్గుణాల నలవరచుకుంటుంది. చివరకెలాగో తండ్రిని చేరుకుంటుంది. కానీ అతనే తన తండ్రి అని హేమకు తెలియదు. తండ్రి చెప్పడు. ఇలా అడుగడుగునా ఆసక్తిని కల్గించే సన్నివేశాలతో నిండిన చిత్రమే "ఈకాలం దంపతులు."

యస్. రామబ్రహ్మం నిర్మిస్తున్న యీ చిత్రానికి డి. వి. నరసరాజు మాటలను, సత్యం సంగీతాన్ని, పి. భాస్కరరావు కెమెరాను, కృష్ణారావు కళను, బి.కందస్వామి కూర్పును సమకూరుస్తున్నారు. ఈ చిత్రంలో రావికొండలరావు, మిక్కిలినేని, పి. హెచ్. కృష్ణమూర్తి, ఎం. పి. ప్రసాద్, గోకిన రామారావు, మురళీమోహన్ ముఖ్య పాత్రధారులు. డి. యోగానంద్‌గారి దర్శకత్వంలో రూపొందుతున్న



"ఆడవాళ్లు అపనిందలు"లో కృష్ణంరాజు, శుభ

నవరంగా తయారౌతున్న యీ చిత్రానికి వెంకటరత్నం నిర్వహణ.

డిశంబరు నుంచి జ్యోతి

శ్రీ అన్నపూర్ణ సినీ ఎంటర్‌ప్రైజెస్ పతాకం క్రింద క్రాంతికుమార్ నిర్మిస్తున్న పూర్తి అవుట్‌డోర్ చిత్రానికి "జ్యోతి" అనే పేరు పెట్టారు. డిశంబరునుంచీ ఈ చిత్రం షూటింగ్ వుండగలదని తెలుస్తోంది. చిత్రానికి "జ్యోతి" అనే పేరు ఎందుకు పెట్టారని క్రాంతిగార్ని అడిగాను. "తన జీవితం విషాదమైనా, తనవారి జీవితంలో వసంతం విరియాలని, ఎన్నో త్యాగాలను చేసిన ఒక స్త్రీ కరుణామయ గాథే చిత్ర మూలకథ. మైనపొత్తి తాను కరిగిపోతున్నా, కర్పూరం తాను దహించుకుపోతున్నా, తమ పరిసర ప్రాంతాలకు వెలుగునెలా ప్రసరింపచేస్తాయో, అలాగే ఓ స్త్రీమూర్తి తన బ్రతుకులో నిప్పులు కురిసినా, మరొకరి బ్రతుకులో నవ్వులు చిందాలని అడుగడుగునా ఆత్మత్యాగానికి పూనుకుంటుంది. అందుకే చిత్రానికి "జ్యోతి" అనే పేరు పెట్టాం అన్నారు నిర్మాత క్రాంతికుమార్.

జ్యోతి పాత్రకు జయసుధను ఎన్నుకున్నారు. కవిత (లక్ష్మణరేఖ) పాత్రలో జయసుధ జయించిందనే చెప్పాలి. జ్యోతి పాత్రతో ఆ జయాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటుందనడానికి వీలుగా ఆ పాత్ర మలచబడింది. కనిపించే నవ్వులో, కనిపించని వేదనను కడుపులోనే దాచుకుని కృంగిపోయే వ్యక్తిగా సత్యనారాయణ ఈ చిత్రంలో కన్పిస్తారు. రావుగోపాలరావు, మురళీమోహన్, గిరిబాబు చిత్రంలోని తదితర ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు.

షూటింగ్‌కు ముందు పాటల రికార్డింగ్ చేయాలనే ఆలోచనలో వున్నారు క్రాంతికుమార్. సత్యానంద్ మాటలు, చక్రవర్తి సంగీతం, విన్సెంట్ ఛాయాగ్రహణం సమకూర్చే ఈ చిత్రానికి కె.ఎస్.పి. తనయుడు కె. రాఘవేంద్రరావు దర్శకుడు.





''రౌటరాముడు''లో ఒక దృశ్యం

వేటూరికి క్రొత్త చిత్రం

మాటల రచయితగా, పాటల రచయితగా పేరు గడించిన వేటూరి ''భారతి'' చిత్రానికి ప్రథమంగా దర్శకత్వం వహించారు. కానీ దురదృష్టవశాత్తు ఆ చిత్రం ఆర్థికంగా విజయాన్ని సాధించలేకపోయింది. ఒక చిత్రం దెబ్బతిందని వస్తు వున్న వ్యక్తులను తక్కువగా అంచనా వేయడం పొరబాటు. వేటూరి దీర్ఘాలోచన చేయగల సమర్థుడు. భావయుక్తంగా, సంగీతపరంగా పాటలను మలచగల నేర్పరి. ఎఫెక్టివ్ అయిన సంభాషణలను లిఖించగల ప్రతిభావంతుడు.

ఒకసారి ఓటమి సంభవించిందని వెనకడుగు వేసే స్వభావం కాదు వేటూరిది. నమ్మకంతో నడుంకట్టి ముందుకు సాగే వ్యక్తి వేటూరి. ప్రస్తుతం శ్రీ కళామందిర్ కంబైన్స్ బ్యానరుపై వి. నారాయణమూర్తి నిర్మిస్తున్న ''సత్యం—శివం—సుందరం'' చిత్రానికి రచన్ను, దర్శకత్వాన్ని వేటూరే నిర్వహిస్తున్నారు. పూర్తి అవుట్‌డోర్‌లో నిర్మింపబడే ఈ చిత్రానికి చక్రవర్తి సంగీతం, ప్రకాష్ నాయు, వీరప్ప కూర్పు సమకూరుస్తున్నారు. అక్టోబరులో పాటల రికార్డింగ్, నవంబరు నుంచీ షూటింగ్ వుండగలదని, దర్శకుడు వేటూరి చెప్పారు. క్రొత్త, పాత తారల సమ్మేళనంతో తయారుకానున్న ఈ చిత్రం దర్శకుడిగా వేటూరి ఔన్నత్యాన్ని పెంచాలని ఆశిద్దాం.

''సన్నిక రచయితగా పరిశ్రమచే ప్రజలచే గుర్తింపచేసింది నా పాటలు, నా మాటలే. నేడు దర్శకుడ్ని అయ్యానే అని పాటలు వ్రాయడానికి, మాటలు కూర్చడానికి విముఖతను వెల్లడించే అవివేకిని కాను నేను. పాటల, మాటల రచయితగా పరిచయమైన నేను ఆ శాఖను వదలి కృతఘ్నుడను కాలేను. అలాగని క్రొత్త బాధ్యతలను స్వీకరించకుండా వుండను. దర్శకత్వం చేసినా, పాటలు వ్రాయడానికి, మాటలు లిఖించడానికి నేనెప్పుడూ సంసిద్ధుడనే. రచయితగా కాస్త పేరు సంపాయించుకున్న నేను దర్శకుడిగా కూడా కాస్త పేరు తెచ్చుకోవాలనుకుంటానేగాని శాశ్వతంగా దర్శకుడ్ని అయిపోవాలనే పేరాశ నాకు లేదు.'' అంటాడు వేటూరి. ప్రస్తుతం వీరు శ్యాంప్రసాద్ ఆర్ట్స్ పిక్చర్స్ వారి చిత్రానికి ఒక పాటను, మహేష్‌గారి ''ముగ్గురు మూర్ఖులు'' చిత్రానికి ఒక పాటను, చక్రపాణి ఆర్ట్స్ పిక్చర్స్ వారి ''పెళ్ళికాని తండ్రి'' చిత్రానికి మాటలను, జయవాణి ఆర్ట్స్ వారి ''అదృష్టవంతులు'' చిత్రానికి మాటలను వ్రాస్తున్నారు.

క్షేత్రయ్య ప్రతిభ !

సెప్టెంబరు యిరవై ఎనిమిదినాడు, బెంగుళూరు చాముండేశ్వరి స్టుడియోకు వెళ్ళాను.

విజయ రాఘవ నాయకుడు కవితా గోష్ఠి జరుపుతున్నాడు. ఆయన ఆస్థాన పండితులు ప్రగల్భాలు పలుకుతున్న వేళ, క్షేత్రయ్య ఒక సమస్య నిచ్చి పూరించమన్నాడు. కొలువు చేరిన పండితులు పూరించలేక దిగ్భ్రమ చెందారు.

అట్టి సమయాన క్షేత్రయ్య తానిచ్చిన సమస్యను తనే పూరించాడు.

''వదరక... పో. పోవే

వద్దురా వద్దని'' అంటూ అష్టవిధ నాయికా లక్షణాలను అభినయిస్తూ అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేశాడు.

''వదరక... పో. పోవే'' అనెడి క్షేత్రయ్య పదానికి అక్కినేని ప్రదర్శించిన నవరసభరితమైన ఆంగిక అభినయం, కూచిపూడి నాట్యాచార్యుడు వెంపటి సత్యంగారినే పరవశింపచేసిందంటే, ప్రేక్షకుల ఆనందపారవశ్యం అదుపులో వుండగలదా? క్షేత్రయ్యా, నీకు తిరుగులేదయ్యా అని ప్రేక్షకులు ఆశీర్వదించగలరు.

లక్షన్నర ఖర్చుపెట్టి, విజయరాఘవనాయకుని సభా మందిరాన్ని నిర్మించిన కళా దర్శకుడు శేఖర్ ఆనాటి రాజస వైభవాన్ని మనోజ్ఞంగా చూపెట్టారు.

కవయిత్రి రంగాజమ్మకు (విజయరాఘవుని ద్వితీయ కళత్రం) క్షేత్రయ్య సమక్షాన కనకాభిషేకం జరగడం, కవి పండితులు పాల్గొని ఆశీర్వదించడం, తండ్రిని ధిక్కరించిన మన్నారును నిరాజ్యుడ్ని చెయ్యడం, మన్నారుడి తనయుడికి జన్మదినోత్సవ సంరంభం జరపడం'' లాంటి ముఖ్యమైన సన్నివేశాలను హృద్యమంగా చిత్రీకరించారు, ఘనకీర్తి వహించిన ఆదుర్తి. సంగీతం మధుర మనోహరంగా వుండడానికి ఆదినారాయణరావు, సాహిత్యం సారస్యంగా వుండడానికి ఆత్రేయ, చిత్రం అందంగా వుండడానికి స్వామి పాటుపడి కృషి చేస్తున్నారు.

''మహాకవి క్షేత్రయ్య'' వర్ణ చిత్రంలో ఎవరు ఏ పాత్రను పోషిస్తున్నారో పాఠకులకు తెలపాలిగా.

క్షేత్రయ్య : 'నటసామ్రాట్' నాగేశ్వరరావు; రంగాజమ్మ : అంజలీదేవి; విజయరాఘవనాయకుడు : కాంతారావు; మన్నారుదేవుడు : గిరిబాబు; క్షేత్రయ్య మేనత్త : రాధాకుమారి; లాలిషా ; ప్రభాకరరెడ్డి; మేనమామ : ధూళిపాళ; క్షేత్రయ్య సహచరుడు : రాజబాబు; భామ : మంజుల; తారామతి : జయసుధ; క్షేత్రయ్య మేనకోడలు : ప్రభ; క్షేత్రయ్య తల్లి : హేమలత. వీరుగాక రావి కొండలరావు, సాక్షి, జగ్గారావు వున్నారు.



''అమ్మా—నాన్న''లో ప్రభ, బేబీ రోహిణి

క్షామ నివారణ నిధి కోసం
మంజుల భరతం

సర్వగం స్టుడియోకు వెళ్ళిన వేళ, ఆదిత్య చిత్రవారి "మనుషులంతా ఒక్కటే" వర్ణ చిత్రం షూటింగు జరుగుతూ వుందని తెలిసింది.

సెట్లోకి అడుగు పెట్టాను. నా కళ్ళకు ఒక ఫలకం కనిపించింది. "క్షామ నివారణ నిధి" అని రాసుంది. ఆ బోర్డు వంక చూస్తున్న తరువాత, జగన్మోహనాకారిణివలె సాక్షాత్కరించింది మంజుల.

స్టేజిమీదికి వెళ్ళింది. సౌండ్ ఆన్ అన్నారు దర్శకుడు దాసరి. పాట ప్రారంభమైంది. మంజుల మనోజ్ఞంగా భరతనాట్యం చేసింది.

ఆమె భరతం చేసిన పాటలో రవ్వంత రాస్తాను.

"నిన్నే పెళ్ళాడుతా, రాముడు-భీముడు;
రాముని మించిన రాముడు, పిడుగు;
రాముడు, అగ్గిరాముడు, టైగర్;
రాముడు, శభాష్‌రాముడు, నిన్నే పెళ్ళాడుతా"


అనేడి జావళిని గురించి రాశారు. దాసరి రాసిన మొదటి పాట "నటరత్న" చిత్రావళి మీద గావడం విశేషం.

"మనుషులంతా ఒక్కటే" చిత్రంలో ఎన్టీఆర్ నటన అద్వితీయమూ లేక అపూర్వమూ అని ప్రశ్నిస్తే, అద్భుతము అని సమాధానం వస్తుంది. జమున, సత్యనారాయణ, రమాప్రభ, నాగేష్, అల్లు ప్రధాన తారాగణం.

ప్రజాదర్శకుడు - ప్రజానటుడు కలిపిన యీ లాటి చిత్రం ప్రేక్షకుల ప్రశంసలను పొంద గలిగే అర్హతను కలిగియుంది. నిర్మాతలు దుడ్డు వెంకటేశ్వరరావు, మహేష్. సమర్పకుడు రాజేంద్ర కుమార్‌కు ఘనవిజయాన్ని తేగలదు.

ప్రజల్లో మంజుల స్థానం

ఆంధ్ర ప్రేక్షకులు మంజులకు ద్వితీయ స్థానం యిస్తున్నదానికి సుముఖంగా వున్న నిజాన్ని నా చెవులారా విన్నాను.



"దేవుడు యిచ్చిన చెల్లెలు"లో అల్లు

సినిమా

గ్లామర్ పాత్రలకు మంజుల సరితూగినట్టుగా మరెవ్వరూ లేరన్నది ప్రజా వాక్యం.

ప్రజా వాక్యం అట్టిది గాబట్టే, మంజులకు పరిశ్రమలో విపరీతమైన డిమాండు.

ప్రస్తుతం మంజుల నటిస్తున్న చిత్రాలన్నీ వర్ణ చిత్రాలే. హీరో లందరితో నటిస్తున్నదికూడా మంజులే.

"అక్కినేనితో క్షేత్రయ్య, బంగారు బొమ్మలు; నందమూరితో మనుషులంతా ఒక్కటే, దీవార్, రోటీ; శోభన్‌తో పిచ్చిమారాజు, ఇద్దరూ యిద్దరే, విజయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్, గుణవంతుడు; రామకృష్ణతో ధర్మా" చిత్రాలలో మంజుల ముగ్ధమోహన కాంతగా నటిస్తున్నది. హీరో కృష్ణతో "దేవుడులాంటి మనిషి" చిత్రంలో నటించింది.

హిందీలో ఒక చిత్రం, తమిళంలో శివాజీతో మూడు చిత్రాలు మంజులకు వున్నాయి.

రోజా సగటున ఒక చిత్రం కోసం మంజులను అడగడం జరుగుతూ వుంది. అందరినీ అంగీకరించడం సాధ్యమా ?

భమిడిపాటి కథలు

భమిడిపాటి రాధాకృష్ణగారి కలానికి ఒక ప్రత్యేకమైన కమ్మదనం వుంది. తన కమ్మదనాన్ని ఎక్కువగా అమ్మడం యిష్టంలేని కారణంగా, తక్కువ చిత్రాలకు మాత్రమే రాయడం జరుగుతూ వుంది.

ఈ ఏడు భమిడిపాటి కలానికి ఎక్కువ పని తగిలింది. "వైజయంతీ మూవీస్ వారి ఎదురులేని మనిషి, అనిల్ ప్రొడక్షన్స్ వారి చిత్రం, ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి చిత్రం, రామకృష్ణారెడ్డిగారి చిత్రం, ప్రత్యగాత్మగారి చిత్రం" యొక్క రచనా బాధ్యతను రాధాకృష్ణ స్వీకరించారు. ఇంత బిజీగా తనెప్పుడూ రాయలేదని భమిడిపాటి అన్నారు.

ప్రథమ ద్వితీయ తృతీయ స్థానం

ప్రేక్షకులు యిష్టపడేది ఎవరెవర్ని అని ఆరా తీశాను. నేను రాస్తున్న నిజం అధిక శాతం ప్రజల అభిప్రాయసారం.

హీరోల్లో నాగేశ్వరరావు, రామారావుగార్లకు మొదటి స్థానం, శోభన్‌బాబుకు ద్వితీయ స్థానం, వాణిశ్రీకి మూడవ స్థానం యిచ్చే జనం ఎక్కువ మంది వున్నారు గాబట్టే, పరిశ్రమలో నే చెప్పిన నలుగురికి డిమాండ్ ఎక్కువగా వుంది.

దర్శకుల్లో విశ్వనాథ్‌గారికి, దాసరిగారికి, బాపు గారికి పేరు ప్రఖ్యాతులు వున్నాయి.

సంగీత దర్శకుల్లో మహదేవన్‌కు మొదటి స్థానం, ఆదినారాయణరావుకు రెండవ స్థానం యివ్వ డానికి శ్రోతలు సుముఖంగా వున్నారు.

ఛాయాగ్రహణ దర్శకుల్లో వెంకటరత్నం, స్వామి, జి. కె. రాముగార్లంటె ఎక్కువ అభిమానం చూపుతున్నారు, ప్రేక్షకులు.

విలన్ వేషానికి ప్రభాకరరెడ్డిని మాత్రమే పేర్కొంటున్నారు.

ప్రజల్లో సత్యనారాయణ, రాజబాబు, అల్లు రామలింగయ్యగార్లకు ప్రత్యేకమైన ఫాలోయింగ్ వుంది.

మహామనిషి లేరే

"మంచి మనిషి, మహా మనిషి, మనసున్న మనిషి" అయిన చక్రపాణిగారు మనకు లేరే యిక.

"నిజాన్ని ముఖంమీద అనగలిగిన మనిషి, మంచిని ఆదరించే మనిషి, అన్నీ తెలిసిన మనిషి" మనకు దూరమాయెనే.

రచనా రంగానికి, సినిమా రంగానికి, చిత్ర నిర్మాణ రంగానికి చక్రపాణిగారు ఎంతో సేవ చేశారు.



"గుణవంతుడు"లో శోభన్, అంజలి ←

18 చిత్రాలని పూర్తిచేసిన గిరిబాబు

"జగమే మాయ" చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైన గిరిబాబు, "గాజుల కిష్టయ్య" చిత్రంతో పది + ఎనిమిది చిత్రాలను పూర్తిచేశాడు.

ఈమధ్య గిరిబాబును "క్షేత్రయ్య" షూటింగు సమయాన కలిశాను. "ఎలావున్నారు? ఎన్ని చిత్రాలు వున్నాయి ?" అని ప్రశ్నించాను.

గిరిబాబు నటిస్తున్న చిత్రాలు :

"వెలుగుబాటలు, వధూవరులు, ఒకమ్మాయి కథ, రాము — సోము, పెళ్ళాడే బొమ్మ, పెళ్ళికాని తండ్రి" చిత్రాల్లో హీరోపాత్రలను పోషిస్తున్నారు.

"మనస్సాక్షి, స్వామిద్రోహులు, ఒక వల్లని రాత్రి, జ్యోతి, సోగ్గాడు, దేవుడున్నాడు జాగ్రత్త, క్షేత్రయ్య, చిట్టెమ్మ — చిలకమ్మ, పంత ఇల్లు — సంతగోల, నందినీ ఫిలింస్ చిత్రాలలో విలన్ వేషాలను వేస్తున్నారు.

నటనలో కృషి, నడవడికలో మంచితనం, పెద్దలపట్ల గౌరవభావం వున్న గిరిబాబుకు భవిష్యత్తు బాగావుండగలదు.

లాల్‌కీ సాలన్ !

"నిప్పులాంటి మనిషి, అన్నదమ్ముల అనుబంధం" చిత్రాల విజయానికి ఎస్. డి. లాల్ ముఖ్య కారకుడు అని అనడంలో అబద్ధం ఏ మాత్రం తయినా లేదు. లాల్ ప్రతిభగలవాడు అని నిరూపించుకొన్నాడు. ఏవాడు ఏరకం చిత్రాలను జనరంజకం చెయ్యగల సామర్థ్యం లాల్‌కు మాత్రమే వుంది అన్నది ప్రజల్లోనూ, పరిశ్రమలోనూ ఉంది.

ప్రస్తుతం లాల్ మూడు హిట్ చిత్రాలకు దర్శకత్వం వహిస్తున్నారు. అవేమన, రవి చిత్ర (వై. వి. రావు) తలపెట్టిన "రోటీ", రాజ్యం పిక్చర్స్ (శ్రీధరరావు - లక్ష్మీరాజ్యం) నిర్మిస్తున్న "దీవార్", శ్రీ లక్ష్మీనారాయణ ఎంటర్‌ప్రైజస్ (సీతారామస్వామి, లక్ష్మణరావు) తీస్తున్న "ధర్మా."

లాల్‌కీ సాలన్ ప్రారంభమైన ఈ తరుణాన్ని ఆయన సద్వినియోగం చెయ్యగలరని ఆశిద్దాం.

రవి చిత్ర ఫిలింస్ !

సహృదయుడు, అభిరుచి వున్నవాడు వై. వి. రావుకు, రామారావుగారి సంపూర్ణ సహకారాలు లభించడం యొక్క ప్రతిఫలమే గత ఏడు "నిప్పులాంటి మనిషి", ఈ ఏడు "రోటీ" రూపం అందుకోవడం జరిగింది.

"రోటీ" హిందీ చిత్రాన్ని కొన్ని మార్పులతో నిర్మిస్తున్నట్లు, వై. వి. రావు చెప్పారు.

అక్టోబరు యిరవైనాలుగు నుండి షూటింగు ఆరంభం. "నటరత్న" ముఖ్య పాత్రధారిగా, మంజుల, గుమ్మడి, ప్రభాకరరెడ్డి, రాజబాబు, అల్లురామలింగయ్య, పద్మనాభం, కాంతారావు, రాజనాల, త్యాగరాజు, ప్రభ, పండరీబాయి సహాయ పాత్రధారులుగా పాల్గొంటున్నారు.

రచనా విభాగానికి గొల్లపూడి, సంగీత విభాగానికి సత్యం, ఛాయాగ్రహణానికి దేవరాజ్, కళా విభాగానికి చలం, కూర్పుకు బాలు, సహకార దర్శకత్వానికి కృష్ణకిశోర్ సారథ్యం వహిస్తున్నారు. లాల్ దర్శకత్వంలో పూర్తిగా విడుదల చెయ్యనున్న మరొక హిట్ చిత్రమే "రోటీ" రంగుల చిత్రం.

రాజ్యం పిక్చర్స్

ప్రజానుగుణంగా చిత్రాలను కాలపరిణామాన్ని అనుసరించి తీయగల సమర్థులు శ్రీధరరావు — లక్ష్మీరాజ్యంగార్లు.

హిందీలో అఖండ విజయాన్ని సాధించిన "దీవార్" చిత్రాన్ని రాజ్యం పిక్చర్స్ తలపెట్టడం ముదావహం. "నటరత్న"గారి అంగీకారం లభించడం నిర్మాతల అదృష్టం.

నవంబర్ 12 నుంచి షూటింగు ప్రారంభం. "ప్రజానటుడు" ముఖ్యపాత్రను పోషించ, అంజలీదేవి, రామకృష్ణ, మంజుల, ప్రభాకరరెడ్డి, త్యాగరాజు సహాయపడడానికి అంగీకరించారు.

"దీవార్" వర్ణ చిత్రానికి డి. వి. నరసరాజు. ఆదినారాయణరావు, చలం, శ్రీకాంత్ ముఖ్య సాంకేతిక శాఖలను నిర్వహిస్తున్నారు.

లాల్ నిర్దేశకత్వంలో "దీవార్" చిత్రం ఆల్ టైమ్ రికార్డ్‌ను సృష్టించగలదు, రాజశ్రీ సంపిణీ సంస్థకు.

శ్రీ లక్ష్మీనారాయణ ఎంటర్ ప్రైజస్

"కదలదు — వదలదు, చిక్కడు దొరకడు" చిత్రాలను నిర్మించిన కుదరవల్లి సీతారామస్వామి, "ధర్మా" చిత్రాన్ని తెలుగులో నిర్మించడానికి నిర్ణయించారు. ఆయనకు లక్ష్మణరావు తోడుగా నిలబడ్డారు. పూర్తిగా కామరాజుగారి మద్దతు లభించింది. అక్టోబరు 9న షూటింగు ప్రారంభం.

"ధర్మా" వర్ణ చిత్రంలో రామకృష్ణ (నవీన్ నిశ్చల్), సత్యనారాయణ (ప్రాణ్), మంజుల (రేఖ) ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. సహాయ భూమికలను రాజబాబు, అల్లు రామలింగయ్య, ప్రభాకరరెడ్డి ధరిస్తున్నారు.

రచనకు గొల్లపూడి, సంగీతానికి చక్రవర్తి, కళకు చలం, ఛాయకు దేవరాజ్, సహకార దర్శకత్వానికి జయాసాగర్ సారథులు.

లాల్ చిత్రీకరణలో "ధర్మా" చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించగలదు.

— శ్రీనివాస్



డాక్టర్ సలహాలు

—డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

ఎస్. కె. ఎస్. – రాజమండ్రి

నాకు 10 నెలల నుండి చూచేటప్పుడు దృష్టికి ఎదురుగా ఏవో మచ్చలు మచ్చలుగా కనపడుతున్నది. నెమ్మది నెమ్మదిగా, మచ్చలు పెద్దవి అవుతున్నాయి. ఎండలో ఎక్కువగా స్పష్టంగా ఈ మచ్చలు కనబడుతున్నాయి. ఆ మచ్చలు దృష్టి ఏవైపుకు మరలిస్తే ఆవైపుకు వెళ్తాయి. దీనికి చికిత్స ఏమిటి?

★ "మస్కే వాలిటాన్ టిస్" అనే యీ మచ్చలువంటి 'వస్తువులు' కంట్లో కనబడటం కొంతవరకు సహజమే!

కొందరికి తీగలు తీగలుగా, కొందరికి నల్లని గుండ్రని మచ్చలుగా, మరికొందరికి వేరే యితర విధాలుగా కండ్లు కదల్చిన వెనువెంటనే లేక చూపు మరల్చిన వెంటనే ఇది పైనుంచి క్రిందికి దిగుతూ వుండటం, కొంతసేపటికి యివి పూర్తిగా మాయ మవటం జరుగుతుంది. ఈ లోపం ఎక్కువగా హ్రస్వ దృష్టి గల వారిలో కనబడుతుంది. (దగ్గర వస్తువులుమాత్రమే కనబడేటంత చూపు కలవారు.)

దీనికి ప్రత్యేకించి చికిత్స అంటూ ఏమీలేదు, దృష్టిలోపం వుంటే సరిదిద్దుకోవటం తప్ప.

ఆర్. ఆర్. — జగన్నాథపురం

నా వయస్సు 32 సం.లు. నాకు యింకను పెళ్లి కాలేదు. నాకు "హెర్‌పిస్" అనే సుఖవ్యాధి వున్నట్టు, ఆ వ్యాధి క్రానిక్ అయినట్లు, యింక తగ్గే సూచనలే లేనట్లు అని డాక్టర్లు చెప్పినారు. నాకు రక్తములో 'వి. డి. ఆర్. ఎల్.' నెగెటివ్‌గా వున్నది. నాకు ఆ వ్యాధి తగ్గే సూచనలు ఏమైనా వున్నచో తెలుపవలెను.

★ "హెర్‌పిస్" అనేది సుఖవ్యాధి అని వైద్యులు (ప్రత్యేక శిక్షణ పొందినవారు) ఎవరూ చెప్పివుండరని నిర్ధారణగా చెప్పగలను.

"హెర్‌పిస్" అనేది ఆటలమ్మ అనే మసూచి లోని ఒకరకమైనదానికి సమానమైన వైరస్ అనే సూక్ష్మ క్రిమివల్ల వస్తుంది. అయితే యిది ఒక నిర్ణీతకాలం వరకు మాత్రమే వుండి తనంతట తానే తగ్గిపోతుంది. ప్రత్యేక చికిత్సగాని, ఇతర ఔషధాలు గాని అనవసరం. ఈ రోగం ఎక్కువ కాలంగా (క్రానిక్‌గా) వుండే అవకాశం చాలా తక్కువ అని చెప్పటంలో సందేహంలేదు.

డి. వి. — పందిళ్ళపల్లి

నా కుమారునికి 24 సం.లు. ఎస్. ఎస్. ఎల్. సి. చదువుతూ వుండగా మనస్సు కొంత మారినది. ఎక్కువ చదువుతూ వుండేవాడు. ఎక్కువగా మౌనముగా వుంటాడు. ఆకలి, దప్పిక మామూలుగా వుంటాయి. పిలిస్తేగాని పలకడు. నవ్వుతూవుంటాడు. నడిచేటప్పుడు ఏది కనిపించినా తల కొంచెముసేపు ఆడించిగాని తిరిగి నడవడు. విశాఖపట్నంలో కరెంట్ ట్రీట్‌మెంటు చేయించాము. కాని పరిస్థితి మామూలుగా వున్నది. ఏమి చేయమంటారు?

★ కొంత వయస్సు మీరిన తర్వాత, అంటే ముఖ్యంగా యుక్తవయస్సులో కొన్ని భావాలు, ఆశయాలు, అభిరుచులు చోటుచేసుకోవటం సర్వ సాధారణం.

ఆ సమయంలో, వారి అభిరుచులు నిజ జీవితంలో సమకూరవని వారు నిర్ధారణ చేసుకొంటే లేక పరిస్థితుల ప్రోద్బలంవల్ల వారికా భావం కలిగితే జరిగే మానసిక విచ్ఛిత్తి మాత్రమే దీనికి కారణం.

'కరెంట్' (ఇ. సి. టి.) మొ.వి ఉపయోగ పడినా వారిని మానసికంగా, మామూలు మనుష లను చెయ్యటానికి ప్రయత్నించడం ముఖ్యం.

పి. జె. — ఆదోని.

నా వయస్సు 32 సం. లు ఒక సం. క్రిందట అమీబియాసిస్ వచ్చి చాలా బాధపడినాను. మళ్ళీ బొడ్డు దగ్గర నొప్పివచ్చుచున్నది. తగిన సలహా ఇవ్వప్రార్థన.

★ ఒకసారి అమీబియాసిస్ వచ్చిందని తెలిసిన తర్వాత, అది పూర్తిగా నయమయినదో లేదో, మల పరీక్ష పలుసార్లు చేయించుకొని, నిశ్చయించుకోవాలి. అలాగాకుండా ఒక "కోర్సు" మందులు మాత్రం వాడి, తాత్కాలిక ఉపశమనం కలిగిన వెంటనే మందులు వాడటం నిలిపివేస్తే, ఈ రోగం తిరిగి యథాప్రకారం రావటానికి అవకాశం ఎక్కువ.

ముందు అమీబియాసిస్ వచ్చిన వారికి సక్రమంగా రోగనివారణ జరగక పోతే ఇలా నెప్పి వచ్చే అవకాశం ఎక్కువ.

బి. కె. — నెల్లూరు.

★ నా వయస్సు 20 సం.లు నా చేతులు రెండు నరాలు నొప్పిగా వున్నట్లు వుంటుంది. పని ఎక్కువ చేసినప్పుడు చేతి వేళ్ల గూడా వణుకుతాయి. చేతి భుజందగ్గర చాలా నొప్పిగా వుంటుంది. టైపు చేస్తున్నప్పుడు వేళ్లు నీరసముగా కదులుతున్నాయి.

యుక్తవయస్కులకు, వేళ్లు వణకటం నరాలు లాగుట – ఉంటే ముందుగా, "థైరోటాక్సి కోసిస్" (అంటే థైరాయిడ్ గ్రంధి ఎక్కువగా పనిచేయటం) ఉన్నదీ, లేనిదీ తీర్మానించటం చాలా అవసరం. ఈ రోగం లేదని వైద్య పరీక్షవల్ల తేలితే, మెడ భాగాన్ని ఎక్స్–రే తీసిచూసినప్పుడు. అదనంగా ఏదైనా ఒక్క ఎముక (సెర్వైకల్ రిబ్) ఉన్నదా లేదా అని తెలుస్తుంది.

కొందరికి ఏ కారణం లేకుండానే ఇలా జరగటాన్ని "యున్‌క్సైటీ న్యూరోసిస్" అంటారు. ఇది ఎక్కువగా ఆందోళన, ఖంగారు పడేవారికి తరచూ కనబడే లక్షణం. రోగనిర్ణయాన్ని అనుసరించి చికిత్స చేయవలసి ఉంటుంది.

మినీ ఇంటర్వ్యూ



"అంతర్జాతీయ మహిళా సంవత్సరం ఆడవారిపై కార్టూన్లు వేయడానికి తప్ప మరే విధం గానూ లాభించినట్లు నాకు కనబడలేదు" అంది కుమారి లక్ష్మి. "లక్ష్మి" అసలు పేరయినా జయమణి అని తన సన్నిహితులు పిలుస్తూ వుంటారని చెప్పింది. ఇంటి పేరు "ద్వాదశి". ఈ సంవత్సరమే విశాఖపట్నం ఎ. వి. ఎన్. కళాశాలలో బి. ఎ. ప్యాసయింది. "చదివింది రాజకీయ శాస్త్రమే అయినా 'ప్రస్తుత' రాజకీయాలమీద కుతూహలం లేదు" అంది. "విద్యార్థులకి రాజకీయ అవగాహన అవసరమే అయినా, వాటిల్లో స్థానం ఏర్పరచుకోవడం అంత మంచిది కాదేమో" అనికూడా ఆమె అంది.

"సినిమాలు అంటే ఇష్టమేనా?" అని ప్రశ్నించినపుడు "ప్రస్తుతం వస్తున్న సినిమాలలో ఇష్టపడడానికి ఏమిటుందికనుక" అని సమాధానం ఇచ్చింది. అయినా అప్పుడప్పుడు తెలుగు సినిమాలు చూస్తూ వుంటుందిట. హిందీ సినిమాలు చూచే అలవాటు లేదట.

లక్ష్మికి నవలలు చదవడం, సంగీత సాధనా ముఖ్యమైన హాబీలు. వీణా గాత్రంలో ప్రావీణ్యం సంపాదించడం తన ధ్యేయం అని చెప్పింది. లోగడ "గాన కళ" అనే పత్రికలో సంగీతంపై ఒక వ్యాసం కూడా వ్రాసిందిట.

హైస్కూలు చదువు రోజుల్లో "గ్రిగ్ స్పోర్ట్సు"లో పాల్గొందిట. రింగ్, త్రోబాల్, షటిల్, పోటీలలో పాల్గొని ప్రైజులు కూడా సంపాదించిందిట.

[జి. యస్.]

ఇచ్చావుగాని, మీ కొలీగ్సు ముందు యిటువంటి లెక్చర్లు ఇవ్వకు. అనవసరంగా అందరి ముందూ తేలికయిపోతావు. అన్నట్టు ఎప్పుడూ ఇతరుల వర్కు విషయంలో జోక్యం కలుగజేసుకోకు. అనవసరంగా కష్టాల్లో పడతావు. అనుభవంమీద చెప్తున్నాను. తర్వాత నీ యిష్టం. నా పిచ్చిగాని ఇంకో రెండు మూడు సంవత్సరాలు పోతే ఇవన్నీ నీకు తెలియవా, ఎప్పటికి యిలానే వుంటావేమిటి, నువు మారకుండా వుంటే చాలు ఇతరులను మార్చినంత ఫలం'' అన్నాడు.

''ఛాలెంజ్ బావా. నేనెప్పటికీ ఇలానే వుంటాను. ఎట్టి పరిస్థితుల్లోనూ, నా ఆశయాలకు భిన్నంగా పోను'' అన్నాను.

''అనవసరంగా వెధవ లెక్చర్లివ్వకు. కాలమే చెపుతుందిగా'' అన్నాడు బావ.

'అవును బావ చెప్పిందే కరెక్టు' అని మనసులో అనుకోబోయి పైకే అనడం, ఆఫీసు బెల్ మోగటం ఒకేసారి జరిగాయి.

మెల్లగా ఆఫీసు నుంచి బయటపడి, సిటీ బస్‌లో ఒళ్ళు హూనం చేసుకుని, ఆరున్నరకు ఇంటికి చేరాను.

అమ్మతో గోపికూడ భోజనానికి వస్తున్నాడని చెప్పి, స్నానం కానిచ్చి, బయట గదిలో కొచ్చి కూర్చున్నాను.

గోపి ఎప్పుడు వస్తాడా, వాడితో 'నేనిప్పుడు మామూలు మనిషిని. నాకు ఎటువంటి ఆశయాలులేవు, అందరిలా బతకటమే నా లక్ష్యం కూడాను' అని ఎప్పుడు చెపుతానా అని ఎదురు చూస్తున్నాను.

చెప్పిన దానికంటే ఓ గంట ఆలస్యంగా వచ్చాడు గోపి. వస్తూనే ''సారీరా, కొంచెం ఆలస్యమైంది. సారీ చెప్పానుగా. ఇక ఇండియన్ పంక్చుయాలిటీ మీద లెక్చరు మాత్రం ఇవ్వకు'' అన్నాడు నవ్వుతూ.

నేను 'ఫర్వాలేదులేరా' అనబోవటం, వాడు నా సమాధానం కోసం ఎదురు చూడకుండా సరాసరి వంటింట్లోకి వెళ్లిపోవటం జరిగిపోయాయి.

నేనింకా ఆలోచిస్తుండగానే, వాడు మా అమ్మకు నమస్కారం చెప్పటం, కులాసాగా వున్నారా అని అడగటం, తర్వాత వాళ్ళ వాళ్ళంతా కులాసాయేనని చెప్పటం, ఇంకా ఏవో విశేషాలు మాట్లాడటం, ఆ తర్వాత గదిలోకి వచ్చి నా ఎదురుగా కూర్చోవటం జరిగిపోయాయి.

ఓ గుమస్తా కథ

(18వ పేజీ తరువాయి)

నేను సీరియస్‌గా ''ఒరే ఇంకెప్పుడూ లేటుగా వచ్చినందుకు క్షమాపణలు చెప్పకు. నేనిప్పుడు అతి మామూలు మనిషిని. నేను కూడ చెప్పిన దానికంటే ఓగంటో రెండు గంటలో ఆలస్యంగా వెళ్ళటం నేర్చుకున్నాను'' అన్నాను.

వాడు నన్ను ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు.

అవును, నేను అదివరకు ఇచ్చిన లెక్చర్లు ఎలా మర్చిపోగలడు. లేటుగా రావటం ఓ జబ్బని, ఆరింటికి వస్తామని చెప్పి ఏడింటికి వచ్చే బదులు ఏడింటికే వస్తామని చెప్పితే ఏం పోతుందని, నిజంగా చెప్పిన టైముకు రావటానికి వీలున్నా 'ఓ అరగంట లేటుగా వెడితే ఏం పోతుందిలే! అనుకునే మనవాళ్ళ మనస్తత్వాన్ని వీలు దొరికినప్పుడల్లా విమర్శిస్తుండే వాణ్ణి.

తర్వాత వాడే ''అయితే ఇవాళ నాకు లెక్చర్లబోరు తప్పిందన్నమాట. ఎంత సుదినం ఈరోజు హాయిగా అమ్మాయిల గురించో, సినిమాల గురించో కబుర్లు చెప్పుకుందాం. చెప్పరా, మీ ఆఫీసులో అమ్మాయిలు ఏమంటు న్నారు.''

ఈమాటే వాడు ఓ సంవత్సరం క్రితం అనివుంటే ఈ పాటికి వాడి మొహం నా చివాట్లతో వాచిపోయుండేది.

కాని ఈనాటి పరిస్థితే వేరు. ''అలాగే చెప్పుకుందాం గాని నేను ఇలా మారిపోవటం నీకు ఆశ్చర్యంగా లేదూ'' అన్నాను.

''అవున్రోయ్ అది మాయింటే. తొందరగా చెప్పు నీ ఆశయాల మేడలో నుంచి దిగి వచ్చి మాలో కలిసిపోవటానికి గల కారణాలు'' అన్నాడు.

నేను టీపాయ్ మీద వున్న నాడైరీ తీసి వాడికిచ్చి ''ఇది చదవరా అంతా నీకే తెలుస్తుంది.'' అన్నాను.

తర్వాత నేనే ''ఇదంతా చదవటం నీకు బోరుకొడుతుంది గాని నేనే అక్కడక్కడా చదివి వినిపిస్తాను'' అన్నాను.

నేను ఓ పేజి తీసి చదవబోయిన వాణ్ణి ఆగి, ''మా డిపార్టుమెంటు, మూణ్ణెల్లకొకసారి, ఇంక్రిమెంట్సు ఇన్‌స్టాల్‌మెంటు కట్టమని, లోన్స్ తీసుకున్నవాళ్లకి 'ఇంటిమేషన్సు' పంపించాలని నీకు తెలుసను కుంటాను'' అన్నాను.

''తెలుసులేవోయ్. అసలు మాట్లాడితే, మీ డిపార్టుమెంటు వర్కంతా నాకు తెలుసు గాని, ఆ చెప్పేదేదో తొందరగా కానీ'' అన్నాడు.

నేను చదవటం మొదలు పెట్టాను

జనవరి 25—ఇంకా ఇంక్రిమెంట్సు ఇన్‌స్టాల్‌మెంటు కట్టటానికి ఐదురోజులు మాత్రమే వుంది. ఇంతవరకు ఇంటిమేషన్సు పంపలేదు, అందరికి రాయవలసిన, ఫైళ్ళు 'డిస్ట్రిబ్యూట్' చేస్తాడేమోనని ఎదురు చూసాను. అయనలో చలనంలేదు. మిగతా వాళ్ళందరూ నాకేం పట్టిందన్నట్టు కూర్చున్నారు. నేనే వుండబట్టలేక ఆఫీసరుతో 'ఇంటిమేషన్లు వెళ్ళలేదండి' అన్నాను.


'ఇంకా పంపలేదా, తొందరగా రాసి పంపించండి' అని గోడకు చెప్పినట్టు చెప్పి

ఆకస్మిక మరణం



ఆదుర్తి సుబ్బారావుగారు తెలుగులోను హిందీలోను తీసిన చలన చిత్రాలు అన్ని వర్గాలవారి మన్నన పొందటమేగాదు నిర్మాతలకు కనకవర్షాన్ని, ప్రశంసా పత్రాలని కురిపించాయి. ఎందరో 'తార'లను తయారు చేసిన శ్రీ సుబ్బారావుకు అఖిలభారత స్థాయి పేరు ప్రతిష్టలున్నాయి.

తోడికోడళ్ళు, మూగమనసులు, దర్పణ్, మిలన్ లాంటి ఎన్నో చిత్రాలను వెండితెరకెక్కించిన ఆయన 53 సంవత్సరాల చిన్నవయస్సులోనే కన్నుమూయడం తెలుగు చిత్ర రంగం దురదృష్టం. వారు లేనిలోటు తీరనిది.



మీరు ధరించండి
మీరు పెట్టే ఖర్చుకు మించిన విలువను పొందండి
Reshma
Suchitra
Lavanya
Pushpanjali
ది దావణగెరె కాటన్ మిల్స్ లిమిటెడ్
దావణగెరె, కర్నాటక
THOMAS/DCM/175/Tel

విద్యార్థులు చేసిన టాక్సీ కారు

అమెరికాలో ఒక కాలేజీలో చదివే విద్యార్థులు కొందరు చేరి ఒక కొత్త రకం టాక్సీ కారును రూపొందించారు. ఈ టాక్సీ డ్రైవర్‌కి దొంగలు దౌర్జన్యం చేస్తారనే భయం ఉండదు. తన టాక్సీలో అటువంటి దొంగ లెవరైన ఎక్కినట్టు అనుమానం వస్తే, డ్రైవర్ వాళ్ళకి తెలియకుండానే ఆ టాక్సీ తలుపులు బంధించివేసి, సరాసరి పోలీసు స్టేషన్‌కి తీసుకెళ్ళి అప్పగించవచ్చు.

డ్రైవర్ సీటు చుట్టూ బులెట్ దూరని షీటు తెర ఏర్పాటు చేశారు. డ్రైవర్‌కి ప్యాసింజర్లు బాడుగ డబ్బులు ఇవ్వటానికి ఒక వంకర కంత మాత్రం ఉంటుంది. డ్రైవర్‌కి అనుమానం వస్తే చప్పుడు కాకుండా ఒక బిస నొక్కితే తలుపులు బంద్ అవుతాయి. డ్రైవర్‌ని వాళ్ళేమీ చేయలేరు. వెస్ట్ వాషింగ్టన్ స్టేట్ కాలేజీ విద్యార్థులు దీనిని నిర్మించారు.

అమెరికా ప్రభుత్వం ఇటువంటి టాక్సీకారు కావాలని చేసిన ప్రకటన చూసి ఈ విద్యార్థులు అలా చేశారు.

మళ్ళీ ఆయన తన పనిలో మునిగిపోయాడు. నాకు ఒళ్ళు మండిపోయింది. అలా చెపుతే ఎవరూ రాయరని ఆయనకూ తెలుసు. కాని మనలో మనకు ఎన్నివున్నా పబ్లిక్‌కి అసౌకర్యం కల్గించకూడదని, నేనే సాయంకాలంకల్లా అన్నీ పూర్తిచేసి సంతకానికి పెట్టాను. ఆయనకు అన్నీ నేనే రాశానని తెలిసికూడ, కనీసం మర్యాదకైనా 'అయిపోయినాయా' అని కూడ అడగలేదు. 'ఆయన పొగిడితే మనకు ఒరిగేదేమిటి, పొగడకపోతే పోయేదేమిటి' అని మనసును తృప్తిపరచుకున్నాను.

జనవరి 27 – పదింటికి ఆఫీసుకు వచ్చాను. ఫైళ్లన్నీ యథా ప్రకారంగా ఆఫీసరు టేబుల్‌మీద వున్నాయి. 'ఫర్వాలేదు, ఇవాళ డిస్పాచ్ అవుతాయి' అనుకున్నాను.

కాని సాయంకాలం నాల్గింటివరకు ఆఫీసరు వాటివంక కన్నెత్తి చూడలేదు. నాకు కాస్త కష్టం వేసింది. చేరవలసిన వాళ్లకి టైముకు చేరకపోతే, ఎంత కష్టపడి రాస్తే మాత్రం ఏం ప్రయోజనం. అదేమాట పక్కన వున్న ప్రసాదుతో అన్నాను. నేనంటే ఆఫీసులో అందరికి ఒకరకమైన తేలికభావం. దొరికిందే చాలని ప్రసాదు, 'మీరు కష్టపడి రాసిందే సుందరండి. మీకు జీతం ఇస్తున్నారు. మీరు రాస్తున్నారు. అంతే. ఆఫీసరు సంతకం పెడితే మీకెందుకు, పెట్టకపోతే మీకెందుకు' అన్నాడు.

'ఇది నా పననో, లేక నా పని కాదనో అనటమే తప్పు, అసలు మొత్తంమీద, చేసిన పనివల్ల ఏమన్నా వుపయోగం వుందా, లేదా' అని చూసేదెవడు?

ఓ గుమస్తా కథ

జనవరి 28 – ఇవాళ వస్తూనే ఆఫీసరు టేబుల్ వంక చూసాను. అక్కడ ఫైళ్లు లేవు. 'సంతకం అయిపోయాయి. ఈ రోజు డిస్పాచ్ అవుతాయి' అనుకున్నాను. సాయంకాలం ఏదో ఫైలుకోసం, వెనకవున్న అల్మైరా వెతుకుతుంటే, అక్కడ నేను రాసిన ఇంటిమేషన్లు ఫైళ్ళతో సహా క్షేమంగా కనిపించాయి. అదేమిటని ప్యూన్‌ని పిల్చి అడిగితే 'డిస్పాచ్‌కి పెట్టటం మర్చిపోయాను' అని తలబిరుసుగా సమాధానం ఇచ్చాడు.

ఆఫీసరుకు కంప్లయింట్ చేద్దామనుకుని దానివల్ల ఫలితం ఏమీ వుండదని ఆ ప్రయత్నం విరమించుకున్నాను. ఇంటిమేషన్లు త్వరగా డిస్పాచ్ అవ్వాల్సిన అవసరం గురించి ప్యూన్‌కి విడమర్చి చెపుదామనుకున్నాను గాని, 'వాడితో ఆర్గ్యూ చేయటం అశుద్ధం మీద రాయి వేయటం లాంటిదని' ఆ ప్రయత్నం కూడా మానుకున్నాను.

ఫిబ్రవరి 5 – ఇవాళ ఆఫీసుకు వెళ్లేటప్పటికి ఆఫీసరు ఎదురుగా ఓ పెద్దమనిషి కూర్చుని వున్నాడు. ఆయన చేతిలో వున్నది నేను పంపిన ఇంటిమేషననని గ్రహించాను. దాన్లో కూడికలో ఓ పదిరూపాయలు తేడా వుందిట. ఆఫీసరు పిలిచి అడిగినపుడు 'ఆ రోజు చాలా హడావిడిగా రాశానండీ, ఒకటి రెండు కేసుల్లో చిన్న తప్పులొస్తే వచ్చి వుండవచ్చు. అయినా దానివల్ల పెద్ద నష్టమేమీలేదు, ఎకవుంట్సు టాలీ చేసేటప్పుడు అదే బయటపడుతుంది. నెక్స్టు క్వార్టర్‌కి కట్టేటప్పుడు యీ పదిరూపాయలు కూడ కలిపి కట్టించవచ్చు!' అన్నాను.

ఆఫీసరు వ్యంగ్యంగా ''ఈ ఒక్క తప్పయితే ఫర్వాలేదండీ, ఇంకా ఇటువంటి తప్పులు ఎన్ని రాశారో'', అన్నాడు.

అవమానంతో తల వంచుకున్నాను. దారుణంగా పార్టీ ముందు ఫూల్‌ని చేసాడు. అందరూ రాయవలసిన ఇంటిమేషన్లు నేనొక్కణ్ణే రాసినపుడు కనీసం 'రాసేసారా' అననప్పుడు కూడా నేనేమీ బాధపడలేదు. పబ్లిక్‌కి ఇన్‌కన్వీనియన్స్ లేకుండా టైముకు అందించగలిగానని తృప్తిపడ్డాను. కాని ఇవాళ ఇతరుల పనికూడా చేసిన పాపానికి ఫలితంగా బయటవాడి ముందు అవమానం పాలయ్యాను. అవును, బావ చెప్పిందే కరెక్టు, ఎప్పుడూ ఇతరుల పని నెత్తిన వేసుకో కూడదు. 'కుక్కపని కుక్కే చేయాలి గాడిద పని గాడిదే చేయాలి!'

తర్వాత ఓ ముప్పయి పేజీలు తిప్పాను. మార్చి 5–ఇవాళ సుందరం ఆఫీసుకు వచ్చాడు. ఆ రోజుకు వుండిపొమ్మని ఎంత బతిమాలినా, 'ససేమిరా' అన్నాడు. కలవక కలవక చాలా కాలానికి కలిసాడు కదా వాడితో కలిసి కాస్త కాఫీ తాగుదామని కాంటీన్‌కి వెళ్లాను అక్కడ ప్రసాద్ వున్నాడు. చాలా వ్యంగ్యంగా నవ్వుతూ, 'మీరు యీ టైములో కాంటీన్‌కి రావటమా వుండండి బయటకు వెళ్లి చూసొస్తాను, సూర్యుడేమన్నా వుత్తర దిక్కున వున్నాడేమో' అంటూ బయటకు నడిచాడు. 'ఆఫీసు టైములో వూరికే తిరగడంకన్న పనిచేస్తే నష్టమేమిటని' ఒకసారి ఆయనతో అన్నందుకు ఫలితం యిది.

మార్చి 30 – 'తొందరగా పనులు జరగటానికి ఏ ఫైలు ఎక్కడ వుంటుందో తెలుసుకోవటం అవసరమని' అనుకుని, అన్నీ తెలుసుకున్నాను. ఇవాళ ఏదో ఫైలు తెమ్మని ఆఫీసరు ప్యూన్ని అడిగాడు. 'అది కనబడటం లేదండి, ఆయన్నడగండి, ఆయనకు ఏ ఫైళ్ళు ఎక్కడ వున్నాయో తెలుస్తాయి' అని నావైపు చూపించాడు ప్యూను. ప్యూన్ని వెతికి పట్టుకురమ్మనాల్సింది పోయి. ఆఫీసరు నన్నే వెతికి పట్టుకురమ్మన్నాడు. ఆఖరికి ప్యూను పని కూడా నేనే చేయవలసి వచ్చింది. చేసేవాడుంటే నెత్తిన ఏపని రుద్దటానికైనా వెనుకాడరు ఈ పెద్దమనుషులు. అసలు ఇదంతా నేనిచ్చిన చనువే, ఒకటి రెండుసార్లు ప్యూను

గోద్రెజ్ నుంచి

క్రొత్త
టర్కిష్ బాత్



ఒక ఉన్నతమైన
సబ్బు నమ్మలేని ధరలో కేవలం

Rs.1·10 (పన్నులు అదనం)

గోద్రెజ్ వారు మాత్రమే మీకు అంత తక్కువ ధరలో ఎక్కువ నురుగు నిచ్చే...ఎక్కువ నిలువ ఉండే...తాజాదనము నిచ్చే సువాసనతో ఉండే సబ్బును అంద చేయగలరు.

గోద్రెజ్ వారి టర్కిష్ బాత్

Interpub/GTB/1/75/TEL


డిపార్టుమెంటులో లేనప్పుడు ఫైళ్ళు వెతికి యిచ్చిన పాపానికి. ఈరోజు ఫ్యాను వున్నా నేనే వెతికి ఇవ్వాల్సి వచ్చింది. అలా యింకో క్లర్కును వెతికిమ్మనటానికి ఆఫీసరుకు ఎన్ని గుండెలుండాలి. అంతా నేను చేసుకున్నదే. పబ్లిక్‌కి ఇన్‌కన్వీనియన్సు కలిగించకూడదని వాళ్ళకోసం వీలున్నంతవరకు ఏపని అయినా సరే చేయాలనుకున్న పాపానికి, డిపార్టు- మెంట్‌లో ప్రతి అడ్డమైన వెధవ, ఏది కన బడకపోయినా. 'అదేది, ఇదేది' అని నన్నే అడుగుతారు. ఆఖరకు మొన్న ఏదో ఒక పని అవ్వకపోతే ఆ వర్కు నా పక్కవాడిదని తెలిసి కూడా, అతన్ని అడిగే ధైర్యంలేక 'అదవలేదే మని' నన్ను అడిగాడు మా ఆఫీసరు. ఇక నేను స్ట్రెయిన్ భరించలేను. డిపార్టుమెంట్ సంగతి, పబ్లిక్ సంగతి దేముడెరుగు, రేపటి నుంచి నా పనేదో నేను చూసుకుంటాను. కాదు, నా పనికూడ సొంతం చేయను. కొంత చేసి కొంత పెండింగులో అట్టే పెడతాను. నాపని అయిపోయిందని తెలిస్తే పక్కవాడికి హెల్ప్ చేయమంటాడు మా బాస్ ఎప్పు డైతే ఆమాట మా ఆఫీసరు నోటివెంట వస్తుందో, ఆ క్షణాన్నే వాడి వర్కంతా నా మొహాన తోసి నా పక్కవాడు బయటకు పోతాడు. ఇక యీ బాధ భరించడం నా వల్ల

ఓ గుమస్తా కథ

కాదు. రేపట్నించి నా వర్కు కొంచెం కొంచెంగా చేసుకుంటాను.

డైరీలో ఇంకో పేజీ తీసి చదవబోయాను.

"ఆపరాబాబు, ఆపు సంగతంతా తెల్సింది. ఇంకా ఇటువంటి సంఘటనలు చాలా జరి గాయి. దాంతో నీకు వర్క్ చేయాలన్న వుత్సాహం చచ్చిపోయింది. అవునా, కాని ఒక్క సంగతి చెప్పనా, నువ్వీ విషయాలన్నీ ఆఫీసులో రెండు సంవత్సరాలు పని చేసాక కాని తెలుసుకోలేక పోయావు. మేం ఆఫీసులో చేరకముందే ఇవన్నీ తెలుసుకున్నాం. అంతే



తేడా. మీ బావ చెప్పేవాడు గుర్తుందా, 'ఆఫీసర్ని ప్లీజ్ చేయాలనుకోవటం, ఎడారిలో ఎండమావికోసం పరిగెత్తటం లాటి దని' అన్నాడు గోపి నాసోది ఆపమన్నటు గా ఒకచేయి చూపిస్తూ.

"ఒరే ఇన్ని మాటలెందుకురా, ఆఫీసులో పని చేసేవాడికన్నా చేయనివాడికే ఎక్కువ గౌరవం ఇస్తారని ఏ క్షణాన్నయితే తెలుసు కున్నానో, ఆ క్షణాన్నే నా ఆశయాలకు, ఇంకా ఏమన్నా వుంటే వాటికి తిలోదకాలు ఇచ్చి అందర్లో కలిసిపోయాను. ఇప్పుడు చాలా హాయిగా వున్నాను తెలుసా" అన్నాను.

"వెరి గుడ్ మై బాయ్. ఇప్పటికైనా నిజం తెలుసుకున్నావు. భోంచేసి, ప్లాజాలో మంచి సెక్సు పిక్చరుంది, పోదాం" అన్నాడు వాడు.

నా బుద్ధి మారినందుకు, మావాడి బుద్ధి మారనందుకు నాకు నవ్వాలో ఏడవాలో తెలియలేదు.

ఇంతలో 'ఏమిట్రా వెధవ కబుర్లు, భోజనానికి లేవండి' అన్న అమ్మ కేక వినిపిం చింది.

అమ్మ భోజనానికి పిలవటంలో ఏ మాత్రం మార్పులేదని, ఇద్దరం నవ్వుకుంటూ భోజ నానికి లేచాం.

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

పి. కె. — ములకల్లంక

మీ ఉద్యోగానికి జీతం ఎంత ?

నేను జీతం రాళ్లతో యీ ఉద్యోగం కొలవను. ఇది నాకు యిష్టమైన పని అంచేత సంతృప్తిగా చేస్తాను.

జి. పి. ఆర్. — రాజమండ్రి

దేవుడు సృష్టించిన మనిషికంటే, మనిషి సృష్టించిన డబ్బుకే ఎక్కువ విలువ వుంది. ఇందులో ఎవరు గొప్ప ?

దేవుడే. ఆతగాడు మనిషినంటూ సృష్టించాడు కదముందు.

పి. ఎస్. ఎన్. — జూదుపూడి

నేటి యువతరం ప్రేమించి పెళ్లి చేసుకోవడం లాభదాయకమా ? పెళ్లి చేసుకుని ప్రేమించడం లాభదాయకమా ?

ఇదేం వ్యాపారమా ? లాభ నష్టాలు బేరాలు వెయ్యడానికి ! ప్రేమించి పెళ్లి చేసుకుంటే ప్రేమకు లాభం. పెళ్లిచేసుకుని ప్రేమిస్తే యిద్దరికీ లాభం.

ఎఫ్. ఎల్. కె. — శ్రీకాకుళం

అక్కయ్యా. అసలు పెళ్లి ఎందుకు చేసుకోవాలి? పెళ్లి అంటే ఏమిటి ? పెళ్లిమీద మీ అభిప్రాయం ఏమిటి ?

ఈ సంగతులు తెలియకపోతే— నీ మనస్సు యింకా ఎదగలేదన్న మాట. వయస్సువచ్చి మనస్సు ఎదిగినా ఇవి అర్థం కాకపోతే— నువ్వు వో మంచి లేడీ డాక్టర్‌ని చూసి మాట్లాడు.

హెచ్. ఎస్. ఆర్. — పెదతిప్పసముద్రం

ఈ మధ్య మీ జవాబులు చూస్తుంటే కాదు పడువుతూంటే ఘాటు 'చో' 'ఐ. ఎస్.జోహార్' లను మించి పోయేట్టుంది.

నాకు 'చో' అంటే యిష్టం. జోహార్ కాస్త వల్గర్‌గా పోతాడని నా అభిప్రాయం......

ఆర్. కె. — గుంటకల్

దయచేసి మగవాళ్ళ గురించి కాస్త మనస్తత్వం మార్చుకుని నిజంగా ఆడవారికి సేవచేయండి ముఖ్యంగా— పతితలూ విధవలూ మొదలైన వాళ్ళకి. మీరు బంగ్లాదేశ్‌లో బాగా సేవచేయకలరనినా నమ్మకం.

మీ నమ్మకంతో మాకు పనిలేదు సార్,అమానుషంగా చెరచబడిన లక్షలాది మహిళాలోకానికో సానుభూతి వాక్యం పల్కే అదృష్టానికి కూడా నోచుకోవాలని నేను అభిప్రాయ పడతాను. నిజంగా స్త్రీపట్ల మీ ఒలకపోస్తున్న సానుభూతి వున్నట్లయితే యింత తేలికగా మాట్లాడేవారే కాదు. పతితలూ విధవలూపురుషులదున్నన్న స్త్రీల కంటే వేరు స్త్రీలుకారే! వో పురుషుడు కనుమూస్తే విధవ అవుతోంది స్త్రీ వో పురుషుడు చెరిస్తే పతిత అవుతోంది స్త్రీ ఆమెకై ఆమె దిగజారి పోవడం లేదు. మీరు వేళాకోళానికే అన్నా యిలాంటి సున్నితమైన విషయాన్ని నేను తేలికగా తీసి పారేయలేను. మగవారిపట్ల నా ధోరణి తప్పు దారిన లేదని అడపాతడపా మీలాంటి వాళ్ళు నిరూపిస్తూనే వుంటారు !

నవరస — హైదరాబాదు

మీ రంటే ప్రేమ, ద్వేషం, అభిమానం అసహ్యం—మీరేమంటారు ?

ఇంకేమంటాను నీపేరే 'నవరస' అంచేత మన తెలుగు సినిమాలోలాగా అన్ని రసాలూ మేళవించావు !

సి. పి. ఆర్. — తెనాలి

అనుకూలంలేని దాంపత్యంలో ఎవరు ఎన్ని సూచనలు యిచ్చినా అవి మాటలవరకే అవుతుంది.

నిజం గుర్రాన్ని లాక్కెళ్ళి చెరువు దగ్గర వదల కలమేగాని నీళ్ళు తాగించ గలమా?

తొడుక్కున్నవాడికే తెలుస్తుంది జోడు ఎక్కడ కరుస్తుందో. అలాగే అతి వ్యక్తిగతమైన వైవాహిక జీవితంలో తలెత్తే ఒడుదుడుకులు వారికి వారే పరిష్కరించుకో కలరుగాని, మనం ఎన్ని చెప్పినా అవి కబుర్లే

ఎమ్. ఆర్. ఎల్. — అయోధ్య

మిమ్మల్ని నిందిస్తూ వేస్తున్న ప్రశ్నలకి జవాబులెందుకిస్తారు? అలాంటివి చూస్తే నా మనస్సు తహతహలాడు తుంది.

అందరూ నీలా తహతహలాడేవారే కాదని తెలియడం కూడా అవసరం అనీ, తిట్లే దీవెనలను కొంటూంటాను. అయినా తిట్టేవాళ్ళు తిడుతూంటే అమ్మవారి ముందు ధూపం వేస్తే ఆవేశం పెరిగినట్టు—నాకు మహా కవిత్వం పుట్టుకొస్తుంది. నువ్వేం బాధపడకు.

ఆర్. కె. — హైదరాబాదు


అర్భకుల మీద అంతలేసి వాడిబాణాలు వేయకు గిలగిలాడి పోతున్నారు.పాపం. ప్రశ్నావళి లేకపోతే పత్రిక తావిలేని పూవు. ఈ సంగతి నీవు ఒప్పుకోవు.

ఇంతకీ తమరు కరుణా, కరుణాకరనా?! మీ కవిత్వం ఒప్పుకోవాలనే వుంది కాని గర్వం అనుకుంటారేమోనని మొహమాటంగా వుంది!

వి. ఎస్. — మదనపల్లి

అమ్మా , ఈ విశ్వంకన్నా విశాలమైనదేదమ్మా?

ఆర్టిస్టునంటున్నావు కదనాయనా యీ విశ్వం కన్న విశాలమైనది ప్రకృతి అని తోచలేదా?



వారఫలం

24-10-1975 శుక్రవారం మొదలు
30-10-1975 గురువారం వరకు

మేషం—: వృత్తిలో పోటీవారిపోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. వారంమధ్యలో సామాన్యమైన పనులకు కూడా యెంతో కృషి చేయవలసి వస్తుంది. ప్రయాణాల్లో శ్రమకలుగుతుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్త్రీలకు— వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. పుణ్యకార్యాలు చేస్తారు.

వృషభం:— మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. ప్రయోజనంగల పరిచయాలుఏర్పడుతాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. మిత్రులకు సహాయం చేస్తారు. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన సమాచారం అందుతుంది.

మిధునం:— నూతన వ్యవహారాలు లాభిస్తాయి. సాంఘిక కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఇతరులతో కలసిచేసే వ్యాపారాలు లాభించగలవు. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లాభిస్తుంది. రావలసిన డబ్బు అందగలదు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ప్రయాణాలోచనలు చేస్తారు.

కర్కాటకం:— మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారంమధ్యలో అన్ని వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. బంధుమిత్రులను కలుసుకొంటారు.

సింహం :— రావలసిన డబ్బు అందుతుంది. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. వారం మధ్యలో మీ తాలూకు వస్తువులు పోవచ్చును. సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగలదు. వ్యతిరేకమైన వార్తలను వింటారు. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

కన్య :— అన్ని వ్యవహారాల్లోనూ గౌరవం బాగుంటుంది. ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడతాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. మున్ముందు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధిస్తారు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

తుల:— వ్యాపారంలో అనుకూల వార్తలను వింటారు. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో ముఖ్యమైనవ్యక్తులనుకలుసుకొంటారు. స్త్రీలకు— వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. శుభ కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

వృశ్చికం :— శ్రమపడినా, ఫలితం దక్కదు. సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగలదు. వారం మధ్యలో అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతిలభిస్తుంది. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. అలంకార వస్తువులు కొంటారు.

ధనుస్సు :— భాగస్వాములతో కలసిచేసే వ్యాపారాలు బాగుంటాయి. మీ ఆలోచనలు ఫలిస్తాయి. వారం మధ్యలో మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. ఆందోళనకు గురికాగలరు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అనవసరమైన వ్యయం జరుగుతుంది.

మకరం :— మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. వృత్తిలో శ్రమమీద అనుకూలత లభిస్తుంది. వారం మధ్యలో ప్రయోజనంగలపరిచయాలు ఏర్పడతాయి. రావలసిన డబ్బు అందుతుంది. పోటీవారిలో గౌరవం లభించగలదు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

కుంభం :— వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి రాజకీయవ్యవహారాల్లో శ్రమకలుగుతుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి. స్త్రీలకు— వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. పోటీవారితో వాద ప్రతివాదాలు తగవు.

మీనం— : సామాన్యమైన పనులకు కూడా యెంతో కృషిచేయవలసివస్తుంది. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వారం మధ్యలో సాహసిక వ్యవహారాలు లభిస్తాయి. వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. మిత్రుల సహాయం లభించదు. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి.

— మహేష్

ప్రశ్నావళికి తమ సందేహాలు పంపేవారు. కవర్ పై లేదా కార్డు పై శీర్షిక పేరు వ్రాసి, సంపాదకుడు ఆంధ్ర సచిత్ర వార పత్రిక, గాంధీనగరం, విజయవాడ — 520003 అనే చిరునామాకే తమ సందేహాలు పంపాలి.

సం.

సామాన్యుని సణుగుడు

ఒక మోర్నింగ్ షోకి వెళ్లవలసి వచ్చింది...

అది పదకొండు గంటలనుంచి ప్రారంభమయ్యే ఆట. హాలు బయట విశ్రాంతి వరండా వుంది. దాన్లో మెత్తల కుర్చీలున్నాయి. నలుగురు కుర్రాళ్లున్నారు. ఇద్దరి చేతిలో పాకెట్ సైజు ట్రాన్సిస్టర్ రేడియో లున్నాయి. చెవిలో పెట్టేసుకుని శ్రద్ధగా వింటున్నాడు ఒక చక్కనివాడు. రెండో అందగాడు అది లాక్కుని తన చెవిలో పెట్టేసుకుంటున్నాడు... నాకు గొప్ప కుతూహలంగా వుంది. క్రికెట్ కామెంటరీ వింటున్నారనుకున్నాను ... కుర్రాళ్ళిద్దరు కూడా మంచి పొడుగైన కాళ్ళు, చురుకైన చేతులు గల వాళ్లు బాగా క్రికెట్ ఆడుతారనుకున్నాను... చిన్నప్పుడు మాకు యిలాంటి ట్రాన్‌సిస్టర్ రేడియోలు అందుబాటులో లేవు... సినిమా హాల్లో కూర్చుని అది బోరు కొట్టినప్పుడు యిది తిప్పి హిందీ పాటలు వింటూ యిది బోర్ కొడితే దీన్నోరు మూసి తెర మీద కళ్లు పారేసి చూడటానికి... క్రికెట్ కామెంటరీ వినాలంటె యింట్లో బడికి ఎగనామం పెట్టి వింటామంటే వొప్పుకోరుగా. బళ్లో పుస్తకాలు పడేసి దగ్గర్లోవున్న కాఫీ హోటల్ మీద పడి దబాయించి పెట్టించుకుని వినేవాళ్లం. ట్రాన్సిస్టర్ రేడియోలు పెద్ద లగ్జరీ అప్పుడు... ఆ హోటలు ప్రొప్రయిటర్ రేడియో పెట్టడానికి పెద్దగా అభ్యంతర పెట్టేవాడు కాదుగాని, మేం స్టూడెంట్‌లం హోటల్లో వున్న మంచినీళ్లన్నీ ఖాళీ చేసేవాళ్లం. దానికి గోలెట్టేసేవాడు... అలాగే యీ పిల్లకాయలు క్రికెట్ కామెంటరీ వింటున్నారు అనుకొన్నాను 'స్కోరెంత' అన్నాను. వాళ్లు నా మాట వినిపించుకొనే స్థితిలో లేరు ... వాళ్ల చూపుల్ని నా చిరునవ్వుతో పట్టుకునే విఫల ప్రయత్నం మాని, "ఏంటయ్యా! క్రికెట్ కామెంటరీయేనా? వింటున్నారు" అన్నాను—వాళ్ళు "ఏం భాష బాబూ! మాట్లాడుతున్నావు" అన్నట్టు చూశారు-నా బాధ యిలా తప్పదురా అనుకున్నారు కాబోలు — "వివిధ భారతిలో సంక్షిప్త సినిమా వింటున్నాం" అన్నారు — అదేదో యివాళ కొత్తగా వేస్తున్నారుకాబోలు రేడియో వారు — లేకపోతే మొదటి నుంచి వుందో! తెల్లమొహం వేయటం నా వంతైంది! సినిమాకు వచ్చారు — సినిమా చూస్తున్నారు ... సినిమా అని యిద్దైపోతున్నారు...క్రికెట్, హాకీ, టేబుల్ టెన్నిస్ లాంటి ఆటలు మన యువలోకం ఆడటం లేదని గోలపెట్టడంకన్నా ముందు ... అలా ఆడుకునేటందుకు మన యిరుకు ప్రపంచంలో వాళ్లకి చోటు ఎక్కడ యిచ్చాం? వాళ్లని ఏదో ఒక చిన్న 'కొట్లో' తోసి పాఠాలు చెప్పి పరీక్షలకి తోలేయడానికేచోటు చాలక షిఫ్టులమీద నడిచే మన కాలేజీలలోనా? యింటికి చుట్టాలొస్తే హోటల్లో రూమ్ బుక్‌చేసి-ఏడుస్తూ ఆ బిల్లు చెల్లించే మన యింటి పెరట్లోనా? ఎక్కడుంది యీ కుర్రాళ్లకి నీలాకాశం పచ్చిక మైదానం చూస్తూ కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ, చెమటలు కక్కుకుంటూ, యీలలు వేసుకుంటూ ఆడుకునే ఛాన్సు! వాడింటి దగ్గర పుస్తకాలు తీసుకుని బయలుదేరిం దగ్గర్నించి బడి నుంచి వచ్చేదాకా వాడు చూసేవి వినేవి అన్నీ-ఆదికాలంలో స్త్రీ పురుషులు మొట్టమొదట పరస్పరం గల అవసరాన్ని అర్థం చేసుకుని మొట్ట మొదట ఏ అవసరం కోసరం యిలా "వాటేసుకుని" ఏకమై పోయారో ఆ ఏకమైపోయే ప్రక్రియను లౌడ్‌గా తెలిపే వాతావరణం మాత్రమే! కదా?... యంగ్ జెనరేషన్‌లో సాడిస్టులెక్కువై పోతున్నారంటే దాని బాధ్యత ఎవరిది? అంట!

[★★ జీ]

వి జ్ఞా న వి కా స ం

తుఫానుల్ని దారి మళ్ళించగలమా?

శ్రానిన్ గాడ్ నిహైడ్రోమెటియొరొలాజికల్ సంస్థలోనూ, జార్జియా విజ్ఞాన పరిషత్తు భూ భౌతిక సంస్థలోను పనిచేస్తున్న శాస్త్రవేత్తలు సంయుక్త పరిశోధనలు జరిపి తుఫానుల్ని దారి మళ్ళించవచ్చునని నిర్ధారణ చేశారు. క్యుములస్ మేఘాలు తుఫాను మబ్బులుగా మారడానికి చాలా ముందే అనేక ఫ్రీక్వెన్సీలలో విద్యుదయస్కాంత తరంగాలను ప్రసారం చేస్తాయి. ప్రత్యేక పనిముట్ల ద్వారా యీ తరంగప్రసారాన్ని అందుకోవడంలో విజయం పొందేరు.

తుఫాను మబ్బులదశకు చేరకపూర్వం మేఘాలు ప్రసారించే కిరణాల ఫ్రీక్వెన్సీని తెలుసుకొన్నప్పుడు తుఫాను మబ్బులు, వడగళ్ల మబ్బులు ఏర్పడుతుండడాన్ని ముందే కనిపెట్టవచ్చు. వాతావరణంలోనికి చొచ్చి చూసేందుకీనాడు రాడార్ సౌకర్యాలున్నాయి. వాని సాయంతో తుఫాను మబ్బుల న్యూక్లియసు స్వరూపాన్నీ, అవి కూడుతున్న ప్రదేశాన్నీ గుర్తించవచ్చు అప్పుడు విమానాల, ఓడల రాకపోకలను నిరపాయం చేయవచ్చు.

వడగళ్లప్రమాదం కలిగించగల న్యూక్లియసును తెలుసుకునేందుకూ, రసాయనాలతో నింపేందుకూ పద్ధతులనూ, శాస్త్రవేత్తలు తెలుసుకొన్నారు. ఈ విజయాలను వుపయోగించి విశాల ప్రాంతాలలో వడగళ్లు పడకుండా నిరోధించి, పంటలను కాపాడగల పద్ధతులను ప్రపంచంలోకెల్ల ప్రథమంగా సోవియటు సమర్థవంతంగా వుపయోగించింది. సోవియటు అనుభవాన్ని వుపయోగించి యితర దేశాలు, ముఖ్యంగా హంగరీ, బల్గేరియాలు వడగళ్లవానల నిరోధానికి చర్యలు తీసుకొన్నాయి.


ఇల్లాలి అన్నపూర్ణ

పెద్దింటి విజయలక్ష్మి

పగలంతా బండెడు చాకిరీతో, బోలెడన్ని సమస్యలతో, ఆర్థిక యిబ్బందులను ఏ విధంగా పరిష్కరించాలా అన్న ఎడతెగని ఆలోచనలతో అలసిపోయి, అలుపు తీర్చుకుందామని రాత్రి ఏ పదింటికో మంచం వాసన చూడగలిగిన అన్నపూర్ణకి, ఎంత ప్రయత్నించినా నిద్ర రావటం లేదు. జరిగిపోయిన సంఘటనలమీద తర్కించటం మొదలు పెట్టింది మెదడు. యింక నిద్ర ఎలా పడుతుంది! పగలుపడ్డ శారీరకపు బాధకన్నా, ఎందుకో ఇప్పుడు యీ మానసికా వేదన ఆమెని కృంగదీసింది. ఏ దేవుడైనా కనిపించరే, ఈ ఆలోచనా భారానికి దూరంగా వెళ్ళే సుఖనిద్రనే ప్రసాదించమని కోరేది అన్నపూర్ణ. కానీ కనిపించే దేవుడెవరు!

ఇంటి స్వంతగాళ్ళు, అప్పులవాళ్ళు— వీళ్ళే పెద్ద దేవుళ్ళుగా తమ నెత్తిమీద కూర్చుని రోజుకోపది దండాలు పెట్టించుకుంటున్నారు. అంతా డబ్బుకి మనుష్యులేగాని, మానవత ఉన్న మనిషికీ, మంచి హృదయానికీ మనుషులు కారు. లేకపోతే, ప్రొద్దున యింటావిడ కనకమ్మ. ముష్టి కరేపాకు కోసం. అంత తగువు పెట్టుకుంటుందా! దాంతో యింత కాలం కలిసి మెలిసి వున్న తమ స్నేహంపై ఓ పెద్ద బండరాయిపడి, అది కాస్త రెండు ముక్కలై కూర్చుంది. వాళ్ళ దొడ్డిలో పెరుగుతున్న కరేపాకు తాను కోసుకుంటుండటం వల్లందుకు, రోజూ ఆ మొక్కకి తాను నీరు పట్టాలిట. ఒకరోజు ఎందుకో అవసరమొచ్చి ఎప్పుడూ అడగని స్నేహితురాలు రెండు రెబ్బలు అడిగింది కదాని రెండంటె రెండు రెబ్బలు కోసిచ్చింది తను. ఒకరెబ్బగిల్లితేమళ్ళా అక్కడ యింకోరెబ్బ చిగురిస్తుంది కదా. ఏం పోయిందని కనకమ్మగారి 'పర్మిషను' తీసుకోకుండా అలా చేయటం తననేరమైపోయింది.

"హత్తెరిగ, యింటి యజమానురాలు నేనుండగా నీవింతటి నేరమెలా చేస్తావు? దానికి తగినశిక్ష నీవు అనుభవించాల్సిందే" అని, అనరాని మాటలని, లోపలికెళ్ళి తలుపు గడియపెట్టుకుంది. ఆవిడ 'లా' ప్రకారం తాను దోషియే. ఐదు పైసలు పెడితే వచ్చే కరేపాకుకి. కాస్తలో కక్కుర్తిపడ్డ తనని తాను తిట్టుకుంది అన్నపూర్ణ. దాంతో తన "మూడ్స్" పాడైపోయింది. విచ్ఛిన్నమైన మనసులో, ఎంతో ఘుమఘుమలాడుతూ చేయాలనుకున్న పప్పుచారులో కాస్త, రెండు మార్లు వుప్పువేసి దించేసింది. దానికి ఫలితం, ఒక్కళ్ళూ ఓ చెంచాడు చారుకూడ పోసుకోలేదు. గిన్నెడు చారుపట్టుకెళ్ళి దిబ్బలో పోసింది.



ఈ కలికాలంలో, రేట్లకి రెక్కలొచ్చి పైకెగసిపోతున్న తరుణంలో, అన్నీ అమరికగా చేసుకోటానికే గగనమైపోతూంది. ఇదివరకు నాలుగు ఆధరువులతో అన్నం వండుకుని, ఒక్కొక్కళ్ళూ పావుశేరు బియ్యపు అన్నంతో లాగించేవాళ్ళు. ఆ రోజులుపోయి, యిప్పుడు ప్రతిగిన్నెలో ఎంతవుందో, దానికి తగ్గట్టుగానే తినాలన్న నియమం ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో గిన్నెడు చారుదిబ్బలో పోసివచ్చిన అన్నపూర్ణమనసు విలవిల్లాడి పోయింది. భర్త, పిల్లలూ చారులో అంత వుప్పు వేసినందుకు విసుక్కోవటం మొదలెట్టారు. పచ్చడి, చారుచేస్తే, దాంట్లో చారు యిరాలయిపోయి, చివరికి పచ్చడి మెతుకులలో భోజనం ముగించినందుకు వాళ్ళకి తనపై గుర్రు. కానీ, తాను చేయాలనా అలా చేసింది. ఎంతవాళ్ళకైనా ఒక్కోసారి గురి తప్పుతుంది. అదే బయట వాళ్ళ దగ్గరైతే సర్దుకుంటారుగానీ, ఇంటి ఇల్లాలు దగ్గరకొచ్చేసరికి ఆమె నెవరూ క్షమించరు. వంట చేసేటప్పుడు అంత పరధ్యానమెందుకని చిటపటలాడుతారు. దాంతో యింటి బరువు సగానికి పైగా మోసుకొస్తున్న యిల్లాలు మనసుకి శరాఘాతం తగిలి, పరధ్యాన మరికొంత ఎక్కువై మరో తప్పు జరుగుతుంది గానీ, వేరే మోక్షముండదు. అందుకే పొరపాటుగా ఏదో తప్పు జరిగినా, దానికి క్షమాభిక్ష అనేది పెట్టరు. అంద

వలసిన ఆ సమయానికి క్షమాపణ అందకపోతే మనిషికి నిరుత్సాహం రాక తప్పదు.

మనసులో యిన్ని విధాల ఆలోచనలు పీకుతుంటే అన్నపూర్ణకి భోజనం చేయాలనిపించలేదు. వంటిల్లు సర్ది, అన్నీ మూతలు పెట్టి, యివతలికి వచ్చింది— తాను భోజనం చేయకుండానే.

ఆ రోజు మంగళవారం కాబోలు, పత్రిక కుర్రాడు వచ్చి. పుస్తకం పడేశాడు. డబ్బుల కోసం అలా నిల్చున్నాడు. అన్నపూర్ణ, ఓ అరవై పైసలకోసం. యిల్లంతా గాలించింది. కానీ లాభం లేకపోయింది. ''తర్వాత రారా ఇస్తాను'' అంది ఆ కుర్రాడితో. కానీ, వాడు ''మా షావుకారు ఎక్కడా అరువు పెట్టవద్దన్నాడండి. ఇప్పుడే యిచ్చేయండి'' అని మేకులా నుంచున్నాడు.

అన్నపూర్ణలో నిరాశ, నిస్పృహ ఎక్కువై పోయింది. ఈ చిన్న అప్పు వెంటనే తీర్చుకోలేని యిల్లాలు తను. ఒక్క నిముషం తన బ్రతుకుమీద తనకే అసహ్యమేసింది. తన నిస్సహాయతకు, ఆ పత్రిక కుర్రాడిమీద మనసు భగభగ మండింది. ''అక్కర్లేదు. పట్టుకెళ్లు'' అని పుచ్చుకున్న పత్రిక వాడి మొహాన కొట్టి, భారమైన మనసుతో లోపలికొచ్చింది. తానిటు రాగానే, మరో నిముషానికి మళ్లా ఎవరో తలుపు తట్టారు. అనహనంగానే లేచివచ్చిన అన్నపూర్ణకి రాజమ్మ పిన్ని ప్రత్యక్షమైంది. ఆవిడనిచూడగానే, మొహం యింత చేసుకుని, ''రాపిన్నీ, రా''అని తలుపు తీసింది అన్నపూర్ణ.

సంసారంలో ఎన్ని కలతలు వున్నా, మనసులో ఎంత నిరాశ పేరుకున్నా, మనిషికి ''నా'' అన్న వాళ్లు కనిపిస్తే ఎక్కడలేని బలం వస్తుంది. పరితప్తతతో వేగుతున్న హృదయంపై, చిరుజల్లు కురిసినట్టు హాయిగా వుంటుంది.

ఎన్నాళ్లకో, మళ్లా కనిపించిన రాజమ్మ పిన్ని రాక అన్నపూర్ణకి మహదానందం కలిగించింది.

''ఏమిటి పిన్నీ, మరీ నల్లపూసవై పోయావు ? అంతా బాగున్నారా? బాబాయిగారు వూరు నుంచి వచ్చేశారా?'' మొదలగు ప్రశ్నలన్నీ, తన ఆతృతకొద్దీ ఒక్కసారే వేసేసింది. రాజమ్మ పిన్నికి కూడా, అన్నపూర్ణపై ప్రత్యేక ఆదరణ వుంది కాబట్టి, ఆమె అడిగిన దానికంతా, నవ్వుతూ సమాధానాలు యిచ్చింది.

పిన్నిని చూడగానే ప్రాణం లేచివచ్చిన అన్నపూర్ణకు, తన ఆకలి తెలియవచ్చింది.

'' రా పిన్నీ, భోజనం చేద్దాం '' అని, రెండు కంచాలు అందుకోబోయిన అన్నపూర్ణ,

''నేను భోజనం చేసే వచ్చానమ్మాయ్'' అన్న పిన్ని సమాధానానికి చిన్నబుచ్చుకుంది.

''పోనీ, కాఫీయైనా తాగు'' అంటూ. ఆమెకు కాఫీ చేసిచ్చి, తాను భోజనానికి కూర్చుంది.

తానారోజు పిన్ని పుణ్యమా అని, నాలుగు మెతుకులు మింగింది కానీ, అప్పటిదాక తన కున్న నిస్పృహకి ఆ రోజు పస్తు వుండిపోయేదే !

''పూర్ణా, మినర్వాలో 'అమ్మాయి పెళ్లి''ట వెళ్దామా ? నీకు భానుమతి అంటె యిష్టంకదూ' అంటూ, యిక తప్పకుండా బయలుదేరి తీరుతుందని. అన్నపూర్ణవైపు ఆశగా చూసింది రాజమ్మ పిన్ని.

నిజమే. భానుమతి నటన, ఆ వాక్చాతుర్యం, ఆమెపాటలు అంటె అన్నపూర్ణకి చాలాయిష్టం. కానీ, యీ సంసారంలోపడి, ఆ సాగరాన్ని ఎలా యీదుకురావాలా అన్న బెంగతో తాను సినిమాలన్నీ కట్టి పెట్టేసింది. పైగా, పిల్లలూ పెద్దవారయ్యారు. వాళ్లూ రావాలని గొడవ. ఇంటిల్లిపాదీ వెళితే సినిమాకి రెండుపదులెగిరిపోతాయి. మన సొప్పక, తానూ సినిమాగురించి ఆలోచించటమే మానుకుంది. కానీ, యిప్పుడు పిన్ని అడగ్గానే అణచిపెట్టుకున్న కోరికని మెత్తగా కదిపినట్లైంది. వెళ్లాలనే ఆశ జనించింది. కానీ, నెలపుట్టిన పదిరోజుల్లోపుగానైతే ఫరవాలేదు. ఇప్పుడు రమ్మనిపిలుస్తోంది పిన్ని. ఇందాక పత్రిక కొనటానికే తనదగ్గర చాలినంత డబ్బులేదుకదా, యిక సినిమాకెలా బయలుదేరుతుంది ! అందుకే పిన్నికి ఏ సమాధానమూ యివ్వక మొహం వేలేసింది.

అన్నపూర్ణ యిబ్బందిని అర్థం చేసుకుంది రాజమ్మపిన్ని. ''ఏమిటే డబ్బుగురించి ఆలోచిస్తున్నావా ? నేనిస్తారా పెద్దాడికి వుద్యోగం వచ్చింది. 'సినిమాకెళ్లమ్మా' అంటూ చేతిలో పది రూపాయలు పెట్టాడు అని చేతిలో వున్న చిన్నపర్సులో, అన్నిమడతలూ మడచబడ్డ, పదిరూపాయలనోటుని బయటికి లాగి చూపించింది పిన్ని.

తల్లులారా! బహుపరాక్!!

పిల్లల్ని ఎక్కడా తిరగనీయకుండా. తిండీ తిప్పలు సరిగా చూడకుండా ఇంట్లోనే ఉంచినట్లయితే, అటువంటి పిల్లలలో తెలివితేటలు వృద్ధికావని పరిశోధకులు అంటున్నారు. పిల్లల శరీరంలోని హార్మోన్ల పెంపుమీద పరిసరాల ప్రభావం హెచ్చుగా ఉంటుందట పిల్లల్ని మాటి మాటికి తిట్టడం కూడా మంచిది కాదు అయితే, ఇటువంటి పరిస్థితులవల్ల పెంపు తగ్గిన పిల్లలను బాగుచేయవచ్చునని జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ వైద్య విదాలయ ఆచార్యులు డా. జాన్ మనీ అంటున్నారు. ఇటువంటి పిల్లల్ని కొన్నాళ్లు స్వేచ్ఛగా వదలివేస్తే నెలలో త్వరగా ఈ లోపాలన్నీ తీరతాయని ఈయన అంటారు. ఇది చాలా త్వరగా కూడా జరగటం కద్దు అని అంటున్నారు! ప్రయత్నం చేస్తే పోలేదా ?

ఇకనే, అన్నపూర్ణ ఆ నిముషంలో వూహాసౌధాల్లో విహరించేసింది. సినిమా యేమో తన కిష్టమైన భానుమతి నటించింది డబ్బేమో పిన్ని యిస్తోంది. ఇక ఏ ఆలోచనా అక్కర లేదు. బయలుదేరవలసిందే. పిల్లలు సాయంత్రం బళ్లోనుంచి వచ్చినా, ఒక గంట అటు యిటు ఆడుకుంటుంటే, అంతలో తాను రానే వచ్చేస్తుంది. అనుకుని పిన్నివెంట బయలుదేరింది అన్నపూర్ణ.

సినిమానుంచి వచ్చేసరికి అరుగుమీద మూలుగుతూ పడుకున్నాడు నానిగాడు. వాణ్ణి చూడగానే తనగుండె గతుక్కుమంది.

''ఏంట్రానాన్న, ఏమిటలా మూలుగుతున్నావు ?'' అంటూ వాడినుదురు ముట్టుకుంది. వేళ్లు చురుమన్నాయి. తనహృదయం ద్రవించింది.

''ఎంతసేపైందిరా నీవొచ్చి? ఇంత జ్వరమెలా వచ్చింది ?'' అంటూ, తలుపుతీసింది.

'దారానికి చిక్కులాగ దారికి గతుకులాగ' ఆమె మెదడులో సమస్యలు బయలుదేరి, సినిమాచూసొచ్చిన సంబరమంతా పటాపంచలై పోయింది.

జ్వరంతో యింటికిరాగానే అమ్మ...

ఇల్లాలు—అన్నపూర్ణ

లేకుండా తలుపుకి తాళంపెట్టి ఎక్కడికో వెళ్ళిందని, ఆ జ్వరంలోకూడ నానిగాడిక అమ్మమీద కోపమొచ్చి చిటపటలాడాడు. దాంతో, తనలాంటి మధ్యతరగతి కుటుంబీకురాలికీ, నలుగురుపిల్లలున్న తల్లికీ, యీ సినిమా వ్యామోహం ఎందుకని తనని తాను తిట్టుకోకుండా వుండలేకపోయిందిఅన్నపూర్ణ.

వెంటనే బాబుని. డాక్టరుదగ్గరకు తీసుకెళ్ళాలంటే, ఆయనఫీజు మాట తర్వాత చూసుకున్నా, రాసిచ్చినమందులు కొనటానికైనా తనదగ్గర యిప్పుడు డబ్బుల్లేవు. పక్కమ్మగార్ని చేబదులుఅడిగి పుచ్చుకుందామా అని తోచింది ఒక్కనిముషం. మళ్ళా 'ఛ ఛ, పొద్దున్నే తగువు పెట్టుకున్న మనిషిని ఎలా వెళ్ళి అడగటం అని పూరుకుంది. యిక భర్త వచ్చేదాక అలావుండాల్సిందే.

రాజమ్మ పిన్నిగారైనా యింతదాక వచ్చింది కాదు. అటునుంచిఅటే యింటికెళ్ళిపోయింది.

అన్నీ తనకు సమస్యలుగానే ఎదురౌతాయి. అయాచితంగా అనుభవించిన కాస్తసంతోషం దానివెనకాల సిద్ధంగావున్న దుఃఖవాహినిలో కొట్టుకుపోతుంది.

'అమ్మగారూ' అన్న కేకతో ఆలోచిస్తున్న అన్నపూర్ణ యీలోకంలోకి వచ్చింది.

"అయ్యగారు యీ ఫైళ్ళు యింట్లో పెట్టి రమ్మన్నారండీ! అయ్యగారు సినిమాకి వెళతారటండి. ఆలస్యంగా వస్తానని చెప్ప మన్నారండి" అంటూ పాఠం అప్పజెప్పినట్లు ఆఫీసు జవాను అప్పన్న చెప్పి ముగించాడు.

"హాతోస్మి. ఈయనకూడా నేడే సినిమాకి వెళ్ళాలా" అనుకుని, "చూడు అప్పన్నా! నాని బాబుకి జ్వరంగా ఉంది. డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాలి, అందుకని అయ్యగార్ని త్వరగా ఇంటికి రమ్మన్నానని చెప్పు" అంటూ చెప్పి, సత్ఫలితానికి ఆశపెట్టుకుంది అన్నపూర్ణ.

"అలాగేనండి" అంటూ సాగదీసి, సాగిపోయాడు అప్పన్న.

నాని చలికి వణుకుతుంటే వాడికి దుప్పటి కప్పి. మిగతా పిల్లలకి యింత టిఫినైనా పోద్దామనే నెపంతో వంటింట్లోకి దారితీసింది అన్నపూర్ణ.

ఇదివరకు తాను చదువుకునే రోజుల్లో బొమ్మ స్వీటూ, హాటూ రెండూ తయారుచేసి, తనకు రాగానే టిఫిను ప్లేటు అంది

చ్చేది. కానీ తనీనాడు తన పిల్లలకి నాలుగు రోజుల కొకసారి గాని టిఫిను పెట్టలేక పోతూంది. తన పిల్లల దురదృష్టానికి యీ కాలం యిలా మారిందని ఆమె మనసు కలత చెందింది. ఇంకోటి కూడా తట్టింది అన్న పూర్ణకి. వీళ్లందరికి పెళ్లిళ్ల చేయకుండా అలా వదిలేస్తే, ఎవరికి వారు హాయిగా ఏ యిబ్బందీ లేకుండా వుండగలరేమో! పెళ్లాం, పిల్లల్ని మెడకి కడితే, కాలం పోయే పోకడలో, వాళ్ళకి గంజినీళ్లకు కూడ కరువై పోతుందేమోనని అనిపించింది.

సాయంత్రం అరవగానే, అన్నపూర్ణ భర్త మాధవరావు, యింటికొచ్చాడు తన మాటలు లెఖ్ఖచేసి, సినిమా మానుకుని యింటికి వచ్చిన భర్తని కృతజ్ఞతతో చూసింది. అన్నపూర్ణ.

''సారీ అండి. మీరు సినిమాకి వెళ్ల కుండా చేశాను'' అంది పశ్చాత్తాపంతో.

''మరేం ఫరవాలేదు పూర్ణా. ఏదో రావాల్సి వుండి నాలుగు డబ్బులు చేతికి రాగానే, అందరూ నా చుట్టూ చేరి, సినిమా కని గోలపెట్టారు. కాదనలేక సరే అన్నాను. కానీ నీ కబురు రాగానే డ్రాప్ చేసుకున్నాము. ఎలావుంది నానికి?'' అంటూ బాధ్యత వున్న మగనిగానే అడిగాడు మాధవరావు.

బాబుని డాక్టరు దగ్గర తీసుకెళ్లి ఏవో మందులు, టానిక్కు - ఆయన వ్రాసిచ్చిన ప్రకారం తీసుకొచ్చాడు మాధవరావు. అంతా కలిసి అటు, యిటుగా ఓ యిరవై రూపా యలు వదిలాయి. అన్నపూర్ణ ప్రాణం వుసూరుమంది. చేతికి డబ్బు వచ్చిందని, యీ రోగాలకి కూడా తెలుస్తాయి కాబోలు! పిలిచినట్లు వస్తాయి!

అనుకోని డబ్బు వచ్చింది కదా, ఏదో కోరిన వస్తువు కొనుక్కుందామని లేక, యిలాగ మందులూ మాకులూ. వుప్పు పప్పు కనీ, స్కూలు ఫీజులనీ, బాకీలు చెల్లింపనీ — డబ్బంతా హారతి కర్పూరమై పోతుంది.



ఇల్లాలు—అన్నపూర్ణ

అన్నపూర్ణ ఆలోచనల నుంచి, యింకా తేరుకోనేలేదు. పథ్నాలుగేళ్ల రాధ, "అమ్మా, అమ్మా" అంటూ అరవటం మొదలెట్టింది.

"పరీక్షలకి చదువుకోవాలని ఆ గదిలో వేరేగా లైటు పెట్టుకుని కూర్చుంది కదా, హాయిగా చదువుకోకుండా దీనికేమొచ్చింది" అని ఆకూతురిమీద విసుక్కుంటూ వెళ్లింది.

"ఏమిటే రాధా, కాస్త పడుకోనీయకుండా అలా 'అమ్మా అమ్మా' అంటూ నీ కేకలు!" అని మేను మరచి నిద్ర రాకపోయినా, మేను వాల్చిన సుఖము యిప్పుడు తెలిసినట్లు చిరాకు పడింది అన్నపూర్ణ.

రాధ భయపడినదానికిమల్లే తల్లి చెవిలో ఏదో గుసగుస చెప్పింది.

అది విన్న అన్నపూర్ణ నిలువుగుడ్లేసింది.

"ఉండేది చాలక యిదికూడానా తల్లీ! రేపటినుంచి మరో క్రొత్త సమస్య. సరే వస్తానుండు" అంటూ కర్తవ్య నిర్వహణకి నడుము కట్టక తప్పింది కాదు ఆ యిల్లాలికి.

అలసిపోయి హాయిగా పెద్దగా గుర్రు పెట్టి నిద్రపోతున్న భర్తకి "అమ్మాయి పెద్దదైం"దని చెప్పి నిద్రాభంగం కలిగించటం యిష్టంలేక ఆ పని మరునాటి ప్రొద్దుటికి వాయిదా వేసింది.

అంతలో గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

ఇల్లు, సంసారం, పిల్లలూ — యీ సమస్యలతో నిద్ర రాలేదని బాధపడటం మానేసి, యిక 'నిద్ర' అనే పదాన్ని పూర్తిగా మార్చిపోవాలని నిశ్చయించుకుంది—యిల్లాలు అన్నపూర్ణ.

ఫాలాక్షుని డైరీ

వాయిదాపడిన ఉరి

"ఉరికంబం" శిక్ష పడిన వో ఖయిదీ తన కళ్లను, మూత్రపిండాలను, చర్మాన్ని— వెయ్యేల!! తన శరీరంలో పనికి వచ్చే ప్రతి భాగాన్నీ ఆ భాగం అవసరమున్న వారికివ్వాలన్న తన అభిప్రాయం వెల్లడించాడట. మహారాష్ట్రకు చెందిన హమీద్ దాల్వాయి అనే వో ప్రముఖ సంఘ సంస్కర్త మూత్రపిండాల చికిత్స పొందుతున్నాడట. ఆయన కొక వేళ యీ ఖయిదీ మూత్రపిండాలు పనికి వస్తాయేమోనని వైద్య నిపుణులు చూస్తున్నారట. ఈ విషయాలు బొంబాయి ముఖ్యమంత్రి చవన్ విలేఖరులతో అన్నారట. ఇంతకూ అభినవదాన కర్ణుడైన ఆ ఖయిదీ పేరెక్కడా చెప్పినట్లు లేనట్లుంది.

ప్రసాదంపేరున విషప్రయోగం

దక్షిణ ఆర్కాటు జిల్లాలోని వో గ్రామవాసికి తిరుపతి ప్రసాదం అంటూ పోస్టులోఒకపార్సిలు వచ్చిందట. అది విప్పి చూస్తే అందులో లడ్డూలున్నాయట. ఆయన, ఆయన కుటుంబానికీ గాక, ఆ ప్రసాదం వూరిలో చాలా మందికి పంచిపెట్టాడట. ఆ ప్రసాదం తిన్న వెంటనే చాలా మంది స్పృకం వచ్చి పడిపోయారట. ఆసుపత్రిలో చేరిన వారిలో ఏడుగురు చికిత్స పూర్వమే చనిపోయారట. ఇంకా 37 మంది చికిత్సలో "ఇదమిద్ధం" తేలని స్థితిలో వున్నారట. ఈ పార్సిలు మద్రాసు నుంచి వచ్చిందట. ఇంతకూ ఎవరు, ఎందుకు యీ విష ప్రయోగం చేయాల్సివచ్చిందో పోలీసు కూపీ లాగ నారంభించిందట — మరిహానేం!



శవం బయటపెట్టిన రహస్యం

కర్నూలులో బోయ వోబులేసు అనే ఒకతను తాగి ఘర్షణలాడుతుంటే వో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి పోలీసులకు కబురెట్టాడట. దాంతో వాళ్ళొచ్చి వోబులేశును త్రీ టవున్ స్టేషనులో చువ్వల వెనుక దాస్తే ఆ వోబులేశు చువ్వలకు తాడేసుకు, వురేసుకు చనిపోయాడట. దాంతో పోలీసులు అతని శవాన్ని, స్టేషనుకు వో రెండొందల గజాల దూరంలో వున్న వో పొదలో పారివేశారట. డొంక కదిలిందట.

పోలీసాధికారి హత్యకు మరణమే దండన

మాడ్రిడ్‌లో వో పోలీసు లెఫ్టినెంటును హత్య చేసినందుకు ఇద్దరు గర్భిణీ స్త్రీలకు, ముగ్గురు మగవారికి మిలిటరీ కోర్టు మరణ దండన విధించిందట. ఈ దేశం కొత్త మిలిటరీ "లా" ప్రకారం పోలీసు అధికారిని చంపిన వారికి మరణదండనట. దీనిమీద సుప్రీమ్ మిలిటరీ ట్రిబ్యునల్‌కు అప్పీలు చేసుకునే అధికారాలు కూడా పోలీసు హంతకులకు లేవట!! పోలీస్పార్స్ప్ !!

మంత్రిపుత్రుణ్నన్న మోసగాడు

నిర్మల్‌కు చెందిన 21 సంవత్సరాల మహమ్మద్ మొయినుద్దీన్ అనే చాకులాటి కుర్రాడు ఆవూరొదిలి హైదరాబాదులో మకాం పెట్టి తానో మంత్రిగారి సుపుత్రుణ్నని చెప్పుకుంటూ శక్తి, యుక్తులతో ఎంచక్కా ధనార్జన చేసుకుంటున్నాడట. సంజీవరెడ్డినగర్‌లో ఒకాయనింటికి వెళ్లి తను ఫలానా మంత్రిగారి కొడుకునని చెప్పి ఆయన కారు తాను కొనదల్చుకున్నట్లు తెలియజేసి, "వో సారి అల్లల్లా వెళ్ళొస్తాను మీ కారివ్వండి" అని అడిగాడట. ఆ యజమానికి యీ యువకుని మీద అనుమానం వేసి, మర్నాడు రమ్మని, పోలీసులకు ఆ "మర్నాడు" పట్టిచ్చేశాడట— వ్వాట్ రిసీ!

లక్షచేసే హనుమవిగ్రహాపహరణ

ఆలంపూరుకు చెందిన సంగం అనే వూరిలో వో జొన్న చేనులో తొమ్మిది కిలోల బరువున్న హనుమంతుని విగ్రహం పోలీసులు కనిపెట్టారట. ఈ విగ్రహం ఎనిమిది రకాల లోహాల మిశ్రమంతో చేసిన అపూర్వ విగ్రహమట. దీని వెల సుమారు లక్ష రూపాయలకు పైనే వుంటుందట. దక్షిణ భారత దేశంలోని ఏ దేవాలయం నుంచో యీ విగ్రహం తస్కరింపబడి వుండాలని పోలీసులు అనుకుంటున్నారట— భగవంతుడిందు కలడందు లేడని సందేహము వలదు అనే దానికిదో వుదాహరణ!

ఘంటసాల పాటల పోటీ

ఘంటసాల 53వ జన్మదినోత్సవం, వంశీ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా జరుగు ఘంటసాల పాటలు, కవితలు, కథానికల పోటీలలో విరివిగా పాల్గొనండి.

పూర్తి వివరాలు 25 పైసల స్టాంపు పంపి వంశీ ఆర్ట్ థియేటర్స్, 1–8–702/31, నల్లకుంట, హైదరాబాదు – 500044 నుంచి పొందండి.

అవీ ఇవీ అన్నీ

విజయవాడలో 'అందాలరాణి' పోటీ

అంతర్జాతీయ మహిళా సంవత్సరంలో స్త్రీ సంక్షేమ కార్యక్రమాల నిధి సేకరణకు విజయవాడ ఇన్నర్‌వీల్ క్లబ్‌వారు అక్టోబరు 19న ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో అందాలరాణి పోటీ, ఫాషన్ పెరేడ్, భారతీయ వధువులు అనే అంశాలు ఉంటాయి. కుమారి వాణిశ్రీ ప్రధాన అతిధిగా, దర్శకుడు శ్రీ విశ్వనాథ్ ప్రధాన ఎన్నికాధికారిగా వ్యవహరిస్తారు. పోటీలలో పాల్గొన్న అందగత్తెలందరికీ బహూమతులు ఉంటాయి. వివరాలు శ్రీమతి జంధ్యాల కామేశ్వరి శంకర్, శ్రీ బాగ్, సూర్యారావు పేట, విజయవాడ–2 కు రాసి తెలుసుకోవచ్చును.

శాస్త్రసారం

శాస్త్రసారం అనే ఆధ్యాత్మిక గ్రంథం మా కార్యాలయం చేరింది. రచన శ్రీ స్వామి బాలానంద. 94 పేజీలుగల ఈ పుస్తకం వెల 2 రూ.లు ప్రకాశకులు : బాలానంద భక్త బృందము, దేవాలయం వీధి, కాకినాడ.


ది వరల్డ్, ఇండియా, ది ఎమర్జన్సీ


శ్రీ స్వామి బాలానందగారిచే రచించబడిన ది వరల్డ్, ఇండియా, ది ఎమర్జన్సీ అనే పుస్తకం మా కార్యాలయం.చేరింది పేజీలు 120వెల:1 రూ. ప్రకాశకులు బాలానందభక్త బృందము, దేవాలయంవీధి, కాకినాడ.

నిజం


యువరచయిత బి. రాజేంద్రప్రసాద్ రచించిన గేయ సంపుటం మా కార్యాలయం చేరింది. వెల : 2 రూపాయలు. ప్రతులకి రచయితపేర బోసుబొమ్మ సెంటర్, కొత్తపేట గంటూరు—1. కి వ్రాయవచ్చును.

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna


ఇది అంతర్జాతీయ మహిళా సంవత్సరం
రాగతి పండరి


OFFICE
నవల
OFFICE
నవల
OFFICE
నవల

సంతోషమే సగము బలము


Jayadev

పల్లవీ ఇంటర్నేషనల్

ఇద్దరూ ఇద్దరే

ఈస్ట్‌మన్ కలర్

దర్శకత్వం: వి. మధుసూదనరావు నిర్మాతలు: ఎస్. వెంకటరత్నం, కె. ముఖర్జీ



[redacted]